thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

# చురకలు

**సాయంకాల దినపత్రిక**

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 43 కరీంనగర్ గురువారం, 24 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కర్ణాటక హనీట్రాప్‌పై సుప్రీంలో పిల్

బెంగళూరు : కర్ణాటకలో ఇద్దరు మంత్రులు సహా వివిధ పార్టీలకు చెందిన 48 మంది ఎమ్మెల్యేలతో పాటు న్యాయమూర్తులు, కేంద్ర నాయకులపై హనీట్రాప్ జరిగిందంటున్న అంశంపై స్వతంత్రంగా విచారణ జరిపించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. జారండ్‌లోని ధన్‌బాద్ నివాసి వినయ్‌కుమార్ దీన్ని దాఖలు చేశారు. తనపై హనీట్రాప్ జరిగిందని కర్ణాటక మంత్రి రాజణ్ణ శాసనసభలో స్వయంగా ప్రస్తావించడం, మీడియాలో వచ్చిన కథనాలను ఉటంకించారు.

దీనిని అత్యవసరమైనదిగా భావించి, విచారణ జరపాలని కోరారు. స్పందించిన సీజేఐ జస్టిస్ ఖన్నా ధర్మాసనం ఒకట్రెండు రోజుల్లోనే విచారణ చేపడతామని తెలిపింది.




# ఉగ్రవాద చర్యలను ఉపేక్షించేది లేదు..!

## 'పహల్గాం' ఘటనపై తీవ్రంగా స్పందిస్తున్న మోదీ సర్కార్

జమ్ముకశ్మీర్ అనంత్ నాగ్ జిల్లాలోని పహల్గాంలో ఉగ్రమూకలు జరిపిన ఘాతుకానికి దేశం ఉలిక్కి పడింది. పహల్గాంలోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు జరిపిన మారణహోమానికి అభం శుభం తెలియని 28 మంది పర్యాటకులు మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నారు. సైనిక దుస్తుల్లో వచ్చిన టెర్రరిస్టులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. కాల్పుల శబ్దం విన్న భద్రతా బలగాలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఉగ్రమూకల కోసం వేట మొదలు పెట్టాయి. ఉగ్రవాద దాడిపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ, 'ఈ దాడి వెనుక ఉన్నవారిని ఎవరినీ వదిలిపెట్టం. వారిని చట్టం ముందు నిలబెడతాం' అని ప్రధాని మోదీ చెప్పారు. ఆయన ఉగ్రవాదం ఎప్పటికీ విజయం సాధించలేదని, భారత్ ఉగ్రవాదాన్ని శక్తివంతంగా ఎదుర్కొంటుందని ఆయన మునుపటి లెక్కలు మరింత బలపడతాయని స్పష్టం చేశారు.

**మరణించిన పర్యాటకుల కుటుంబాలకు ప్రధాని మోదీ సంతాపం..** ఈ దాడిలో మరణించిన పర్యాటకుల కుటుంబాలకు ప్రధాని మోదీ తన సంతాపాన్ని తెలిపారు. 'మేము గాయపడినవారికి త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాము. బాధిత కుటుంబాలకు అన్ని విధాల సహాయం అందిస్తాం' అని ఆయన చెప్పారు. ఈ ఘటనపై ప్రపంచ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ ఈ ఘటనను పిరికిపంద చర్యగా అభివర్ణించారు. అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ ఘటనను అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇప్పటికే పహల్గాం చేరుకున్న భారత హోం మంత్రి అమిత్ షా.. మృతదేహాలకు నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపి ఓదార్చారు. అయితే ఉగ్రమూకలు జరిపిన ఈ దాడిపై ప్రధాని మోదీ ఏం నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఉత్కంఠంగా మారింది. అతి త్వరలోనే ప్రధాని మోదీ సంచలన నిర్ణయం తీసుకుంటారని భద్రతా బలగాలతోపాటు దేశ ప్రజలు భావిస్తున్నారు. గతంలో 2016లో భారత సైనిక స్థావరంపై ఉగ్రమూకలు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 19 మంది సైనికులు మరణించారు. ఆ ఘటనకు ప్రతీకారంగా ప్రధాని మోదీ పాకిస్థాన్ లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్ ప్రకటించారు. "ఉరి సర్జికల్ స్ట్రైక్" 2016లో పాక్ ఆక్రమిత కశ్మీర్ లో భారత సైన్యం చేసిన ఒక సైనిక చర్య. ఇది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుంది. 2016 సెప్టెంబర్ లో ఉరిలో భారత సైనిక శిబిరంపై ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా ఈ దాడి జరిగింది. మళ్లీ అలాంటి సర్జికల్ స్ట్రైక్ కు ప్రధాని మోదీ నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. అదే కానీ జరిగితే పాకిస్థాన్ సరిహద్దుల్లోని ఉగ్రమూకలను ఏరి పారేయవచ్చని కాశ్మీర్ కు చెందిన మాజీ ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

పహల్గాం దాడి అనంతరం పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ పైనా కేంద్రం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. కాశ్మీర్, పీఓకే ప్రాంతంలో ఉగ్రవాదుల ఏరివేతకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. కాశ్మీర్ పరిస్థితులను ప్రధానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ వివరించారు. మరోవైపు త్రివిధ దళాధిపతులతో రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సమావేశమయ్యారు.





ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో టెన్షన్ వాతావరణం నెలకొంది. కర్రెగుట్టపై కీలక నేతలతో పాటు వేయి మందికిపైగా మావోయిస్టు తలదాచుకున్నారనే సమాచారంతో భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. దీంతో కర్రెగుట్ట చుట్టూ భద్రతా బలగాల హెలికాప్టర్లు చక్కర్లు కొడుతున్నాయి. హెలికాప్టర్లతో గుట్టపైన రాకెట్ లాంచర్స్ తో మెరుపుదాడి చేయాలని పోలీస్ బలగాలు భావిస్తున్నట్లు సమాచారం. దీంతో తెలంగాణ ఛత్తీస్ గఢ్ సరిహద్దు ప్రాంతంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బుధవారం (ఏప్రిల్ 23) కర్రెగుట్టలలో భారీ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. 12 వేల మంది పోలీస్ బలగాలు చుట్టుముట్టాయి. చుట్టూ 140 కి.మీ. పరిధిలో సాయుధ బలగాల మోహరించారు. కర్రెగుట్టలను జల్లెడ పడుతూ బలగాలు ముందుకు కదులుతున్నాయి. దీంతో ఏ క్షణంలోనైనా ఎన్ కౌంటర్ జరిగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. కర్రె గుట్టలలో గెరిల్లా దళపతి హిడ్మాతో పాటు వెయ్యి మంది మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాల సమాచారం. మావోయిస్టులు ప్రతిదాడి చేసే అవకాశం ఉండడంతో ఎయిర్ సపోర్ట్ తో ముందుకు కదులుతున్నారు. హెలికాప్టర్లు, డ్రోన్ లతో పాటు రోప్ ల సాయంతో కర్రెగుట్టలపైకి చేరుకుంటున్నాయి పోలీస్ బలగాలు.

ఛత్తీస్ గఢ్ నుంచి తెలంగాణ బార్డర్ వైపుకు బలగాల కదులుతున్నాయి. మావోయిస్టు దళాలు పారిపోకుండా కొత్తగూడెం, ములుగు వైపు కేంద్ర, రాష్ట్ర బలగాలు మోహరించాయి.

**కేంద్రం ఈ నరమేధాన్ని ఆపాలి: పౌర హక్కుల నేతలు...** భద్రతా బలగాల దాడిని పౌర హక్కుల నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. కేంద్రం ఈ నరమేధం ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కాల్పులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు శాంతి చర్చలకు పిలుపునిచ్చినా కూడా.. ఏకపక్షకాల్పులు జరపడం సరి కాదని అంటున్నారు. కాల్పులు విరమించి శాంతిచర్చలు జలపాలని డిమాండ్ చేశారు.




దిల్లీ: జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని భారత్ అత్యంత తీవ్రంగా పరిగణించింది. పహల్గాం దాడి నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పెహల్గాం ఉగ్రదాడి వెనుక పాక్ హస్తం ఉందని పేర్కొన్న కేంద్రం.. ఆ దేశ పర్యటకులు భారత్‌ను వీడాలని తేల్చి చెప్పింది. పాకిస్థాన్ పర్యటకులతో పాటు ప్రత్యేక వీసాదారులు 48 గంటల్లో భారత్‌ను వీడాలని ఆదేశించింది. ఈ మేరకు భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీలో తీసుకున్న నిర్ణయాలను భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వెల్లడించారు. పాక్ పౌరుల్ని భారత్‌లోకి అనుమతించ రాదని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. రాయబార కార్యాలయాల సిబ్బందిని 55 నుంచి 30కి తగ్గించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. అటారీ– వాఘా చెక్‌పోస్టును తక్షణమే నిలిపివేస్తున్నట్లు చెప్పిన కేంద్రం.. పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని నిర్ణయించిందన్నారు. ప్రత్యేక వీసాలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే సరిహద్దు దాటిన వారు మే 1లోగా వెళ్లిపోవాలని మిస్రీ తెలిపారు.




# రేవంత్ టీం జపాన్ పర్యటన సూపర్ సక్సెస్!

## హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి..

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు కాంగ్రెస్ నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ నెల 16న జపాన్ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం.. అక్కడి పలు కంపెనీలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించింది. ఈ క్రమంలో రూ. 12,062 కోట్ల మేర పెట్టుబడులకు ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జపాన్‌లో పర్యటించిన తెలంగాణ రైజింగ్ బృందం పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఏడు రోజుల పర్యటనలో రూ.12,062 కోట్ల పెట్టుబడులు సాధించింది. వీటి ద్వారా తెలంగాణలో యువతకు దాదాపు 30,500 ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జపాన్‌కు చెందిన మారుబెని కంపెనీ.. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. రూ.1,000 కోట్లు ప్రారంభ పెట్టుబడి పెట్టనుంది. మొత్తంగా రూ.5,000 కోట్ల పెట్టుబడులకు అంచనా వేసింది. ఎన్‌టీటీ డేటా, నెయిసా సంస్థలతోనూ తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థలు రూ.10,500 కోట్ల పెట్టుబడులతో హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నాయి. తోషిబా ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ)తోనూ ఒప్పందం చేసుకోగా.. ఆ సంస్థ రూ.562 కోట్లతో రుద్రారంలో విద్యుత్ పరికరాలు, సామగ్రి తయారీ ఫ్యాక్టరీని నెలకొల్పనుంది. వీటి ద్వారా 30 వేల ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'టామ్ కామ్'తో టెర్న్, రాజ్ గ్రూప్‌లు చేసుకున్న ఒప్పందాల ఫలితంగా.. తెలంగాణకు చెందిన 500 మందికి జపాన్‌లో ఉద్యోగ నియామకాలకు మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం ఈ నెల 15న రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరు మీదుగా జపాన్ పర్యటనకు వెళ్లింది. 16న టోక్యో చేరుకుని.. 22 వరకూ పర్యటించింది.

ఏడు రోజుల పర్యటనలో జపాన్ పారిశ్రామికవేత్తలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించింది. మురసాకి రివర్ మ్యూజియాన్ని, ఒసాకా రివర్ ఫ్రంట్‌ను సందర్శించింది. మంగళవారం హిరోషిమా ఉపగవర్నర్‌తో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చించింది. సీఎం బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రి ఫెక్చరల్ అసెంబ్లీ హాల్‌ను సందర్శించింది. తెలంగాణ బృందాన్ని అసెంబ్లీ స్పీకర్ తకాషి నకమోటో, శాసనసభ్యులు ఘనంగా స్వాగతించారు. వారిని ఉద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.."హిరోషిమాకు రావటం గౌరవంగా ఉంది. హిరోషిమా.. ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి నిరూపించిన నగరం. దీని మాదిరిగానే ప్రజల ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ" అని తెలిపారు.

శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి విలువలను పంచుకుందామని హిరోషిమా ప్రభుత్వానికి మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. తర్వాత తెలంగాణ బృందం.. హిరోషిమా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమైంది. తర్వాత హిరోషిమాలోని గాంధీ మెమోరియల్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా ఇద్దరు తెలుగు విద్యార్థినులు హాసిని, హరిణి తాము గీసిన రేవంత్‌రెడ్డి చిత్రపటాలను ఆయనకు అందజేశారు. వారిద్దరూ 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని ఆలపించగా.. సీఎం అభినం దించారు. అనంతరం హిరోషిమా శాంతి స్మారక ఉద్యానవనంలో రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పుష్పాంజలి ఘటించారు. అణుబాంబు దాడికి తట్టుకొని నగరంలో మిగిలిన ఏకైక నిర్మాణం డోమ్‌ను సందర్శించారు. ఈ పర్యటనలో సీఎం వెంట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ కె.రఘువీర్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీఐఐసీ సీఈఓ మధుసూదన్, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులున్నారు.

చురకలు





# హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డి పిటిషన్

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. గతేడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై భాజపా నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. భాజపాకు పరువు నష్టం కలిగేలా రేవంత్ రెడ్డి మాట్లాడారంటూ ఫిర్యాదు చేశారు. కాసం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు.. విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది. భాజపా మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పారని కాసం తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రసంగం ఆడియో, వీడియో క్లిప్పింగ్‌లను సైతం కాసం కోర్టుకు సమర్పించారు. దీంతో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేపట్టవద్దని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే, కోర్టు హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.



# తెలంగాణ ప్రజల గుండె ధైర్యం భారాస: రజతోత్సవ సభాస్థలి పరిశీలనలో కేటీఆర్

హైదరాబాద్: భారాస రజతోత్సవ సభ ప్రజల్ని రెచ్చగొట్టడానికో, ప్రభుత్వ వ్యతిరేకతను పెంచడానికి కాదని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. 25 వసంతాలు పూర్తి చేసుకున్నందున జరుపుకొనే వేడుక మాత్రమేనని తెలిపారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో పర్యటించిన ఆయన.. భారాస రజతోత్సవ సభాస్థలి వద్ద ఏర్పాట్లు పరిశీలించారు.

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఉద్యమ పార్టీగా ప్రతిపక్షంగా, ప్రభుత్వంలో ఎక్కడ ఉన్నా తెలంగాణ కీర్తిని హిమాలయాల స్థాయికి తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. "14 ఏళ్ల పాటు నిర్విరామంగా పోరాటం చేసి అన్ని వర్గాలను సమీకరించి రాష్ట్ర సాధన ఉద్యమం చేసిన పార్టీ భారాస. తెలంగాణ ప్రజల గుండె ధైర్యం బీఆర్ఎస్. గులాబీ జెండా అన్ని వర్గాలకు అండగా ఉంటుందనే పద్ధతిలో ప్రజలు గులాబీ జెండా వైపు చూస్తున్నారు. ఏ సమస్య వచ్చినా తెలంగాణ భవన్ వైపు చూస్తున్నారు. 1250 ఎకరాల్లో సభా స్థలం ఉండగా.. వెయ్యి ఎకరాలు పార్కింగ్ కోసం కేటాయించాం. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేస్తున్నాం. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య తాగునీటి వసతి కల్పిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటుపై నమ్మకం లేనందున జెనరేటర్లు ఏర్పాటు చేశాం. భారాస చరిత్రలో ఇది భారీ బహిరంగ సభ కాబోతుంది" అన్నారు.

# కశ్మీర్‌లో ఉగ్రదాడి.. దోషులను విడిచిపెట్టే ప్రసక్తే లేదు: కిషన్ రెడ్డి



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. పాకిస్థాన్ అసమర్థ నాయకత్వానికి ఈ ఘటన పరాకాష్ఠ అని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉగ్రదాడి మృతులకు నివాళులర్పిచారు.

నల్ల దుస్తులు ధరించి జాతీయ జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. భారత్‌ను దెబ్బతీయాలని పాక్ చూస్తే మూల్యం చెల్లించు కున్నట్లేనని హెచ్చరించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్న కిషన్ రెడ్డి.. దోషులను విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

# తెలంగాణలో పూర్తి స్థాయిలో టీపీసీసీ ప్రక్షాళన



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో టీపీసీసీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని కార్యవర్గాల కూర్పు ఉంటుందని చెప్పారు. గాంధీభవన్‌లో ఇవాళ(బుధవారం) తెలంగాణ రాష్ట్ర పరిశీలకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. పార్టీ ప్రక్షాళనకు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దిశానిర్దేశం చేశారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పరిశీలకులకు మూడు దశల్లో టాస్క్ నిర్దేశించామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఏప్రిల్ 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. జిల్లా సమావేశా లకు బ్లాక్, మండల అధ్యక్షులను ఆహ్వానించాలని సూచించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోటీ చేసిన అభ్యర్థులు, ఏఐసీసీ, పీసీసీ ఆఫీస్ బేరర్లు, జిల్లా స్థాయి సీనియర్ నాయకులను ఆహ్వానించాల నిమహేష్ కుమార్ గౌడ్ సూచించారు. టాస్క్ -2లో అసెంబ్లీ, బ్లాక్ లెవెల్ మీటింగ్స్, టాస్క్-3లో మండల మీటింగ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమాలు తెలంగాణలో పెద్ద ఎత్తున విజయవంతం అవుతున్నాయని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కో ఆర్డినేటర్లు ఇచ్చిన బాధ్యతలను మంచిగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఏఐసీసీ అగ్రనేతలు తెలంగాణలో జరుగుతున్న జై బాపు, జై భీమ్ కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారని చెప్పారు. పార్టీ పటిష్టతకు సంస్థాగత నిర్మాణం చాలా కీలకమని మహేష్ కుమార్ గౌడ్ ఉద్ఘాటించారు.

**కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలి: మీనాక్షి నటరాజన్...**

కాంగ్రెస్ పార్టీకి చాలా చరిత్ర ఉందని.. బ్రిటీష్ వాళ్లతో కూడా పోరాటం చేసిందని ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తెలిపారు. విస్తృత భావజాలం ఉన్న పార్టీ అని.. జాతీయ స్థాయి ఆలోచనలతో కాంగ్రెస్ పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ గాంధీ సిద్ధాంతాలతో నడుస్తుందని తెలిపారు. పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలని సూచించారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం చాలా చిత్తశుద్ధితో సీరియస్‌గా పని చేయాలని మీనాక్షి నటరాజన్ ఆదేశించారు. ప్రస్తుతం గుజరాత్ మోడల్‌గా పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని మీనాక్షి నటరాజన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు విస్తారంగా జనంలోకి పోవాలని సూచించారు. సిద్ధాంత పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో కులగణన 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మకమని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రేవంత్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తుచేశారు. దేశంలో మోదీ ప్రభుత్వం, గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రేవంత్ ప్రభుత్వం చేపట్టిందని ఉద్ఘాటించారు. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను మనం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీనాక్షి నటరాజన్ సూచించారు

# వైసీపీ చేజారిన కదిరి మున్సిపాలిటీ.. చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

శ్రీ సత్యసాయి జిల్లా: కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నిసాపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానానికి 25మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. కోరం ఉండటంతో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. చైర్ పర్సన్‌తో పాటు వైసీపీకి చెందిన 11మంది గైర్హాజరయ్యారు. హాజరైన మొత్తం 25మంది అవిశ్వాసానికి మద్దతుగా ఓటింగ్ వేశారు. ఎమ్మెల్యే, ఎంపీ ఓటు లేకుండానే అవిశ్వాసం నెగ్గింది. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కదిరి మునిపల్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కదిరి మున్సిపల్ టీడీపీ కైవసం కావడంతో కార్యాలయం వద్ద టీడీపీ నేతలు సంబురాలు చేసుకున్నారు. టపాసులు పేలుస్తూ మిఠాయిలు తినిపించుకుంటూ టీడీపీ నేతలు సంబురాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్ మూర? ఆలోచన మీద కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నిసాపై అవిశ్వాసం నెగ్గామని కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ అన్నారు. ప్రజల అభిప్రాయం, ప్రజాస్వామ్యయుతంగానే అవిశ్వాసం జరిగిందని తెలిపారు. కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్ నజీమున్నిసా అవినీతిలో మునిగిపోయారని ఆరోపించారు. కదిరిలో అభివృద్ధి లేదని, అవినీతి హెచ్చు మీరిందని విమర్శించారు. అందుకే వైసీపీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసం వైపు మొగ్గు చూపారని అన్నారు. డబ్బులిచ్చి కొన్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెబుతున్నారని.. అది జగన్‌కున్న అలవాటు అని విమర్శించారు. వల్లభనేని వంశీ, కొడాలి నాని వైసీపీలో చేరితే ఏం చేశారని ప్రశ్నించారు. కదిరి అభివృద్ధి కోసమే.. అవిశ్వాసం పెట్టాం.. నెగ్గామని స్పష్టం చేశారు. త్వరలో అందరికీ ఆమోదయోగ్యమైన మున్సిపల్ ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటామని కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ తెలిపారు.



# మేమంతా భారత్ వెంటే..

## పహల్గాం ఉగ్ర ఘటన.. ఖండించిన ప్రపంచ దేశాలు

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో సాయుధ మూక పాల్పడిన అనాగరిక చర్యను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ దీనిని హేయమైన చర్యగా అభివర్ణించారు. అమాయకులైన పౌరులపై దాడులు ఆమోదయోగ్యం కాదన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు ఈ ఘటనపై స్పందిస్తూ.. పహల్గామ్‌లో జరిగిన విధ్వంసకర ఉగ్రవాద దాడి బాధితులకు సంతాపం తెలియజేశారు.

జమ్మూకశ్మీర్‌లో పర్యటకులపై దాడి వార్త దిగ్భ్రాంతి కలిగించింది. ఇది అమానవీయ చర్య. బాధితులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం. అన్నిరకాల ఉగ్రవాదాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. **– చైనా రాయబారి జు ఫీహాంగ్**

భారత ప్రభుత్వానికి, ప్రజలకు, బాధితుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేస్తున్నాం. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాం. ఉగ్రవాదంపై పోరాటంలో శ్రీలంక.. భారత్‌కు ఎప్పుడూ తోడుగా ఉంటుంది

**– శ్రీలంక విదేశాంగ మంత్రిత్వ శాఖ**

పహల్గాంలో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. ఉగ్రవాదంపై పోరాటంలో ఇజ్రాయెల్ భారత్‌తో కలిసి పనిచేస్తుంది" **– ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూ**

పహల్గాం ఘటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇటువంటి అమానవీయ చర్యలు బాధాకరం. బాధిత కుటుంబాలకు, భారత్‌కు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం

**– ఇటలీ ప్రధాని జార్జియా మెలోని**

పహల్గాంలో జరిగిన భయంకరమైన ఉగ్రవాద దాడి అమాయకుల ప్రాణాలను బలిగొంది. బాధితుల దృశ్యాలు కలిచివేస్తున్నాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో మాల్దీవుల ప్రభుత్వం స్థిరంగా ఉంది. ఈ క్లిష్ట సమయంలో భారత్‌కు మద్దతుగా ఉంటాం.

**– మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు**

భారతదేశంలో జరిగిన ఒక దారుణమైన ఉగ్రదాడిలో డజన్ల కొద్దీ పౌరులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం.

**– ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిని ఖండిస్తున్నాం. ఇందులో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఈయూ ఎప్పటికీ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటుంది. **– ఈయూ విదేశాంగ వ్యవహారాల ప్రతినిధి కాజా కల్లాస్**

జమ్మూలో జరిగిన క్రూరమైన దాడిని వ్యతిరేకిస్తున్నాం. అమాయక ప్రజల మరణం తీవ్రంగా కలిచివేసింది. ఈ కష్ట సమయంలో జర్మనీ భారత్ వెంట ఉంటుంది. బాధితుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. **– జర్మనీ విదేశాంగ కార్యాలయం**

ఈ నేరపూరిత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా భద్రత, స్థిరత్వాన్ని దెబ్బతీసే లక్ష్యంతో జరిగే అన్నిరకాల ఉగ్రవాద చర్యలను ఖండిస్తున్నాం"

**– యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ**



# అసలైన సైనికులను చూసి.. భయపడిన పర్యటకులు

## సైనిక దుస్తుల్లో ఉగ్రవాదులు.. అసలైన సైనికులు వచ్చినా వణికిపోతున్న బాధితులు

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం సమీప బైసరన్ లోయలో సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడులు చేయడంతో 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రూరమైన దాడిలో బయటపడిన బాధితులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ఉగ్రదాడి సమాచారం అందుకున్న సైనికులు ఘటనా స్థలానికి వెళ్లి.. వారిని రక్షించడానికి ప్రయత్నిస్తుండగా అక్కడ ఉన్న పర్యటకులు.. వారు కూడా ఉగ్రవాదులే అనుకొని భయంతో వణికి పోయారు. ఉగ్రవాదులు మళ్లీ ఆర్మీ దుస్తుల్లో తమపై దాడి చేయడానికి వచ్చారేమో అనుకొని సైనికులను చూసిన ఓ మహిళ తన చిన్నారిని ఏమీ చేయొద్దని బోరున విలపిస్తూ.. చేతులు జోడించి వారిని వేడుకుంది. ఇతర పర్యటకులు కూడా భయంతో తమ పిల్లలను దాచడానికి ప్రయత్నించారు. ఓ సైనికుడు వారికి ధైర్యం చెప్తూ.. తాము భారత ఆర్మీ నుంచి.. మిమ్మల్ని రక్షించడానికే ఇక్కడికి వచ్చామని భరోసా ఇచ్చారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఉగ్రవాద దాడిలో తన భర్త మరణాన్ని చూసి షాక్‌కు గురైన ఆ మహిళ అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారని.. ఆ బాధలో రోదిస్తూనే ఉన్నారని భద్రతా బలగాలు పేర్కొన్నాయి. కశ్మీర్‌లో పౌరులపై జరిగిన అత్యంత దారుణమైన ఉగ్రదాడుల్లో ఇది ఒకటి. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత 'లష్కరే తయ్యిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ మారణహోమానికి తెగబడినట్లు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని తెలుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో చోటుచేసుకుంది. దుండగులు అతి సమీపం నుంచి తుపాకులు ఎక్కుపెట్టి తూటాల వర్షం కురిపించారు. మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడి చేశారు. 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. కాల్పుల శబ్దం విని అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టాయి. ప్రధాని మోదీ సూచన మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మంగళవారం రాత్రి శ్రీనగర్‌కు చేరుకున్నారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.



# శ్రీనగర్ హోటల్‌లో చిక్కుకుపోయిన 80 మంది తెలంగాణ పర్యటకులు

హైదరాబాద్: తెలంగాణ జిల్లాల నుంచి శ్రీనగర్‌కు పలువురు పర్యటకులు వెళ్లారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో వీరు భయాందోళనకు గురవుతున్నారు. శ్రీనగర్‌లోని ఓ హోటల్‌లో దాదాపు 80 మంది తెలంగాణ పర్యటకులు చిక్కుకుపోయారు. దీనిపై పర్యటకులు ఓ వీడియో విడుదల చేశారు. తామంతా హోటల్‌లో చిక్కుకుపోయామని.. తమను హైదరాబాద్‌కు సురక్షితంగా చేర్చాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. హోటల్‌లో చిక్కుకున్న వారిలో హైదరాబాద్ నుంచి 20 మంది, వరంగల్ నుంచి 10 మంది, మహబూబ్‌నగర్‌నుంచి 15 మంది, సంగారెడ్డి నుంచి 10 మంది ఉన్నట్లు సమాచారం. మెదక్ పట్టణానికి చెందిన రెండు కుటుంబాలు కూడా ఉన్నాయి. వీరంతా మంగళవారం జమ్మూకశ్మీర్ సందర్శనకు వెళ్లి శ్రీనగర్ హోటల్‌లో చిక్కుకుపోయారు.

# పహల్గాం ఉగ్రదాడి ఘటన.. పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మోదీ తిరుగు ప్రయాణం

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో పర్యటకులపై భీకర ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సౌదీ అరేబియా పర్యటనను కుదించుకొని హుటాహుటిన భారత్ చేరుకున్న సంగతి తెలిసిందే. అయితే, తిరుగు పయనంలో ఆయన విమానం పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మరో మార్గంలో ప్రయాణించారు. ఈ మేరకు ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్‌లో ఉన్న దృశ్యాలను బట్టి తెలిసింది. మంగళవారం ఉదయం ప్రధాని మోదీ ప్రయాణించిన ఎయిర్‌ఫోర్స్ బోయింగ్ 777-300 విమానం పాకిస్థాన్ గగనతలం మీదుగా రియాద్ చేరుకుంది. అయితే, దాడి నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా తిరుగు ప్రయాణానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని ఉపయోగించారు.

ప్రధాని విమానం అరేబియా సముద్రం మీదుగా గుజరాత్ గగనతలంలోకి ప్రవేశించి అక్కడినుంచి దిల్లీకి చేరుకుంది. పాకిస్థాన్ నుంచి ముప్పు ఉండొచ్చన్న నిఘా వర్గాల సమాచారం నేపథ్యంలో రూట్ మార్చినట్లు తెలుస్తోంది. ఈ ఉదయం దిల్లీకి చేరుకున్న ప్రధాని మోదీ ఎయిర్‌పోర్టులోనే అత్యవసర సమావేశం నిర్వహించారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌తో భేటీ అయి దాడి గురించి చర్చించారు. భద్రతా చర్యలపై ఆరాతీశారు. మరోవైపు, ప్రధాని అధ్యక్షతన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ కూడా నేడు భేటీ కానుంది. కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యటకులను చుట్టుముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 28 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపుచర్యలు చేపట్టాయి.

# సినిమా పుస్తకంలో అరుదైన సంతకం ఏడిద

## ఏప్రిల్ 24...ఏడిద నాగేశ్వరరావు జయంతి



ఏడిద నాగేశ్వరరావు (ఏప్రిల్ 24, 1934 – అక్టోబరు 4, 2015) ప్రముఖ తెలుగు సినిమా నిర్మాతలలో ఒకరు. సమున్నత ఆశయాలతో అరుదైన చిత్ర నిర్మాణాలను చేసి తెలుగు చిత్ర సీమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించి, ప్రత్యేక గుర్తింపు పొందారు. సినీ పుస్తకంలో ఒక చెరగని సంతకంగా మిగిలి పోయారు. ఆయన నిర్మించిన సినిమాలు తక్కువే... అయితేనేం అన్నీ ఆణి ముత్యాలే. చిరకాలం ప్రజల హృదయాలలో నిలిచి పోయేవే. ఆయన నిర్మించిన చిత్రాలన్నీ జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకోవడం విశేషం. సుమారు 30 సినిమాల్లో నటించారు. వంద చిత్రాలకి పైగా డబ్బింగ్? చెప్పారు. పాఠశాల జీవితంలో ముఖానికి రంగు పులుముకుని, అమ్మాయి వేషంలో నట జీవితం ప్రారంభించి, తర్వాతి కాలంలో సినీరంగం లోకి అడుగుపెట్టి, నటుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా, నిర్మాతగా ఎదిగిన క్రమం ఆయన అసమాన కృషికి నిదర్శనంగా నిలుస్తోంది. అయన తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి కార్యదర్శిగా సేవలందించారు. నంది పురస్కారాల కమిటీ అధ్యక్షుడిగా, జాతీయ పురస్కారాల కమిటీలో సభ్యుడిగా పని చేశారు. పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ అనే సంస్థ ద్వారా కొన్ని గొప్ప ఆశయాలతో, ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే తెలుగు సినిమాలను నిర్మించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర, భారత ప్రభుత్వాల నుండి ఎన్నో అవార్డులను గెలుచుకున్నారు. ఏడిద నాగేశ్వరరావు తూర్పు గోదావరి జిల్లా, కొత్తపేటలో సత్తిరాజు నాయుడు, పాపలక్ష్మి దంపతులకు 1934, ఏప్రిల్ 24 న జన్మించారు. కాకినాడ మెటలారిన్ హైస్కూల్‌లో ఫిఫ్త్ ఫారమ్ చదువుతుండగా స్కూల్ వార్షికోత్సవంలో లోభి నాటకంలో తొలిసారిగా ఏడిద అమ్మాయి వేషం వేశారు. దానికి సిల్వర్ మెడల్‌ను కూడా అందుకున్నారు. ఆ నటనకు రజత పతకం సాధించిన ఉత్సాహంతో 'విశ్వభారతి, 'పరివర్తన', 'ఓటు నీకే'వంటి నాటకాల్లో నటించి మరిన్ని బహుమతులు పొందారు. ఆ తర్వాత విజయ నగరంలో ఇంటర్మీడియట్ చదువుతుండగా 'కవిరాజు మెమోరియల్ క్లబ్'లో కొన్ని నాటకాలు వేశారు. పిఠాపురం రాజాస్ కాలేజీలో బి.ఎ ఎకనామిక్స్‌లో చేరిన నాగేశ్వర రావుకు అక్కడే దర్శకనిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్ పరిచయ మయ్యారు. వి.బి.రాజేంద్ర ప్రసాద్, నటులు హరనాథ్, మాడా, కె.కె.శర్మ, వడ్డాది సూర్యనారాయణ మూర్తిలతో కలిసి కళాప్రపూర్ణ రాఘవ కళాసమితి నాటక సంస్థను ప్రారంభించి ఇన్‌స్పెక్టర్ జనరల్ వంటి పలు నాటకాలు ప్రదర్శించి నటించారు. 26 ఏళ్ళ వయసులో నాగేశ్వరరావు 'కప్పలు' నాటకంలో వృద్ధ పాత్ర పోషించి మెప్పించి నందుకు గానూ ఆయనకు పరిషత్ పోటీలలో బెస్ట్ యాక్టర్ అవార్డ్ వచ్చింది. తన స్నేహితుడు, నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్? నుంచి 'అన్నపూర్ణ'లో నటించాలని పిలుపు రావడంతో మద్రాస్? వెళ్లారు. కాని, ఆ వేషం దక్కలేదు. డబ్బింగ్? కళాకారుడిగా ప్రయత్నాలు ప్రారంభించారు. 'పార్వతీ కళ్యాణం' లోని శివుడి పాత్రకి డబ్బింగ్? చెప్పి తొలి సంపాదనగా రూ.500 పొందారు. ఆ తర్వాత నటుడిగానూ కూడా అవకాశాలు సొంతం చేసుకొన్నారు. నిర్మాత కాక ముందు ఆయన నటుడిగా సినీ ప్రస్థానాన్ని ఆరంభించారు. రణభేరి, నేరము శిక్ష, బంగారు బాబు, మానవుడు దానవుడు, చిన్ననాటి స్నేహితులు తదితర చిత్రాల్లో నటించారు. 1962 నుంచి 1974 మధ్య కాలంలో సుమారు 30 సినిమాల్లో నటించారు. వంద చిత్రాలకి పైగా డబ్బింగ్? చెప్పారు. ఆ తర్వాత కాకినాడకి చెందిన భాస్కరరెడ్డి, రామకృష్ణారెడ్డి, లచ్చిరెడ్డి, వీర్రాజులతో కలిసి 'వెంకటేశ్వర కల్యాణం'అనే చిత్రాన్ని తెలుగులోకి అనువదించారు. ఆ సినిమాకి లాభాలు రావడంతో ఆ నలుగురూ కలిసి గీతాకృష్ణ కంబైన్స్ అనే సంస్థను ప్రారంభించి నిర్మాణ సారథ్య బాధ్యతలను ఏడిద నాగేశ్వరరావుకే అప్పగించారు. 'నేరము శిక్ష'లో నటించడంతో ఆ చిత్ర దర్శకుడు కె. విశ్వనాథ్తో పరిచయం ఏర్పడింది. ఆయనతో సిరి సిరి మువ్వ సినిమాను నిర్మించారు. అది విజయం సాధించింది. తర్వాత తన బంధువులతో కలిసి పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ స్థాపించారు. తొలి ప్రయత్నంగా కొమ్మినేని శేషగిరిరావు దర్శకత్వంలో తాయారమ్మ బంగారయ్యను నిర్మించారు. అందులో చిరంజీవి ప్రతినాయక ఛాయలున్న ఓ చిన్న పాత్రని పోషించారు. ఆ సినిమా విజయం సాధించడంతో పాటు తమిళం, హిందీ భాషల్లోనూ రీమేక్? అయ్యింది. నిర్మాణ సారథిగా ఒక విజయాన్ని, నిర్మాతగా మరో విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. మూడో సినిమా కోసం మళ్లీ కె.విశ్వనాథ్?ని సంప్రదించి శంకరాభరణం నిర్మించారు. ఇక ఆ చిత్రం తర్వాత వెనుదిరిగి చూసుకొనే అవకాశం రాలేదు. సీతాకోక చిలుక, స్వాతిముత్యం, సితార చిత్రాలకి వివిధ విభాగాల్లో జాతీయ పురస్కారాలు లభించాయి. 'స్వాతిముత్యం' తెలుగు నుంచి ఆస్కార్ నామినేషన్లకు ఎంపికైంది. చాలా సినిమాలకు వివిధ విభాగాల్లో నంది పురస్కారాలు వరించాయి. చివరిగా 'ఆపద్బాంధవుడు'చిత్రాన్ని నిర్మించారు ఏడిద నాగేశ్వరరావు. 2013, ఏప్రిల్ 11 న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉగాది పురస్కారం అందుకున్నారు. కళా సాగర్ వారు దశాబ్ధపు ఉత్తమ నిర్మాత గా అవార్డునిచ్చి సత్కరించారు. సంగం అకాడమీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్, సంతోషం%–% లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు నిచ్చి గౌరవించాయి. ఏడిద నిర్మించిన 9 సినిమాల్లో అత్యధిక చిత్రాలు కె.విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కడం విశేషం. పలు చిత్రాలు రష్యన్ భాషలో విడుదలయ్యాయి. సింగిల్ షెడ్యూల్లో 52 రోజుల్లో రూ.11 లక్షల వ్యయంతో 'శంకరాభరణం'ను నిర్మించారు ఏడిద. జాతీయ స్థాయిలో ప్యూయర్ షిప్‌ను తెచ్చుకున్న సినిమా. ఈ సినిమాను మలయాళం లోకి డబ్ చేశారు. అయితే పాటలను మాత్రం తెలుగులోనే ఉంచారు. ఎర్నాకులం లోని కవితా థియేటర్లో రెండేళ్ళు ఆడింది. అమెరికా%అ%లోనూ విడుదల చేశారు. 20 మంది యూనిట్ సభ్యులు అమెరికాలో 45రోజుల పాటు శంకరాభరణం నైట్స్‌ను నిర్వహించారు. తెలుగు సినిమాకు అమెరికాలో అంతగా బ్రహ్మరథం పట్టడం అదే ప్రథమం. జాతీయ స్థాయిలో స్వర్ణకమలం కూడా సాధించింది. ఈస్ట్ ఫ్రాన్స్‌లో సంగీత ప్రధాన చిత్రాలు మాత్రమే పాల్గొనే బెసన్‌కాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమాకు బెస్ట్ ఫిల్మ్ అవార్డు లభించింది. ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్ నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, తమిళనాడు సీఎం ఎంజీ రామచంద్రన్, శివాజీ గణేషన్, కేరళ నాటి సీఎం తదితరులు వీక్షించి ప్రశంసల వర్షం కురిపించారు. కమర్శియల్ సినిమా హవా నడుస్తోన సమయంలో ఈ సినిమా అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. తర్వత దేశ, విదేశాల్లో ఎన్నో అవార్డులను కొల్లగొట్టింది. ఆ తర్వాత భారతిరాజా దర్శకత్వంలో 'సీతాకోక చిలుక'ను నిర్మించారు. అది జాతీయ స్థాయిలో 'ఉత్తమ ప్రాంతీయ చిత్రం'గా రజత పతకాన్ని, రాష్ట్ర స్థాయిలో బంగారు నందిని అందుకుంది. అలీకి ఈ సినిమాకు ఉత్తమ బాలనటుడు అవార్డు లభించింది. ఆ తర్వాత ఆయన తెరకెక్కించిన సినిమా 'సాగర సంగమం'. బెంగుళూరులో 575రోజుల అరుదైన రికార్డును సొంతం చేసుకున్న సినిమా అది. నేటివిటీ మార్పులతో తెలుగు, తమిళ్, మలయాళంలో ఒకేసారి విడుదలైన సినిమా ఇది. తమిళంలో 'సలంగై ఒళి' పేరుతోనూ మలయాళంలో 'సాగర సంగమం' అనే పేరుతోనే విడుదలైందీ సినిమా. ఇండియన్ పనోరమకు ఎంపికైంది. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం కు ఉత్తమ గాయకుని గా జాతీయ అవార్డు వచ్చింది. ఆపద్బాంధవుడు (1992), స్వర కల్పన (1989), స్వయం కృషి (1987), సిరి వెన్నెల (1986), స్వాతి ముత్యం (1985), సాగర సంగమం (1983), సితార (1983), సీతాకోక చిలుక (1981), తాయారమ్మ బంగారయ్య (1979), శంకరాభరణం (1979), సిరిసిరి మువ్వ (1978), తదితర చిత్రాలను ఆయన నిర్మించారు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదు లోని స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2015 అక్టోబరు 4న, ఆదివారం మూశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పాప విమోచనానికి వరూధిని ఏకాదశి




వరూధిని ఏకాదశి హిందూ ధర్మంలో పునీతంగా, పవిత్రంగా భావించబడే వ్రతాలలో ఒకటి. ఇది కేవలం ఒక ఉపవాస దినం మాత్రమే కాక, మనిషి ఆత్మను పరిశుద్ధం చేసే పరమ పవిత్ర కార్యం. ఈ సంవత్సరం ఏప్రిల్ 24వ తేదీ గురువారం నాడు వరూధిని ఏకాదశి సంభవిస్తోంది. ఈ పవిత్ర తిథి హిందూ ధార్మిక చరిత్రలో విశేష ప్రాముఖ్యాన్ని కలిగినదిగా పూరాణాలు పేర్కొంటున్నాయి. పాప విమోచనకు మార్గాన్ని చూపే ఈ రోజు, ఉపవాస వ్రతం, జాగరణ, భక్తితో నారాయణుని ఆరాధన చేస్తే మోక్ష ఫలితాన్ని పొందవచ్చని శ్రద్ధగా విశ్వసించబడుతుంది. పద్మ పురాణంలో వరూధిని ఏకాదశి వ్రత విశిష్టతను తెలియజేసే ఒక చారిత్రక గాథ ఉంది. ప్రాచీన కాలంలో మాంధాత అనే మహారాజు అరణ్యవాసంలో ఒక దారుణమైన ఘటనను అనుభవిస్తాడు. ఆయన ధ్యానంలో లీనమైనప్పుడు ఒక ఎలుగుబంటి అతని మీద ఆకస్మికంగా దాడి చేస్తుంది. విష్ణువు సుదర్శన చక్రంతో ఆ మృగాన్ని సంహరిస్తాడు కానీ అప్పటికే మాంధాత తన కాలు కోల్పోతాడు. ఈ అఘటనకు కారణంగా పూర్వజన్మ కర్మలే అని విష్ణువు తెలియజేస్తాడు. పాప పరిహారానికి వరూధిని ఏకాదశి ఉపవాస వ్రతాన్ని పాటించాలని సూచిస్తాడు. ఆ వ్రతాన్ని నిష్టతో ఆచరించిన మాంధాత తన శరీర సంపూర్ణతను తిరిగి పొందుతాడు. ఈ కథ ద్వారా వరూధిని ఏకాదశి వ్రత ప్రభావాన్ని పురాణం స్పష్టంగా తెలియ జేస్తుంది.'వరూధిని' అనే పదానికి 'రక్షణ కలిగించేవి' అనే అర్థం ఉంది. ఇది అధిక దోషాలను తొలగించడంలో అత్యంత శక్తివంతమైన ఏకాదశిగా పరిగణించ బడుతుంది. బ్రహ్మవైవర్త పురాణం, స్కాందపురాణం మొదలైన ధార్మిక గ్రంథాలలో ఈ వ్రతానికి విశేషమైన ప్రాముఖ్యతను ఇస్తారు. వరూధిని ఏకాదశి వ్రతాన్ని పాటించేవారు ముందురోజు (దశమి) సాయంత్రం స్వచ్ఛతతో ఆహారం తీసుకుని, ఏకాదశి రోజంతా ఉపవాసంగా ఉంటారు. భగవంతుని భక్తి పాటలు పాడుతూ, నామస్మరణతో, విష్ణు సహస్రనామ పారాయణ, గీతా పఠనంతో ఆ రోజును గడిపే ప్రాముఖ్యత ఉంది. ఉపవాసం పూర్తిగా చేయలేనివారు పళ్లు, పాలు వంటి ఫలహారాలతో ఆచరించవచ్చు. ద్వాదశి రోజు సత్కార్యాలు చేయడం, బ్రాహ్మణ భోజనాలు పెట్టడం, దానం చేయడం వ్రతాన్ని పూర్తిగా చేసే భాగాలుగా భావిస్తారు. వ్రతమున కట్టుబడి ఆచరించిన వారు జన్మ జన్మల పాపాల నుండి విముక్తి పొందుతారు. విష్ణు నామస్మరణం వల్ల అంతర్గత శుద్ధి కలుగుతుంది. ఈ వ్రతం శారీరక, మానసిక స్వచ్ఛతను కలిగిస్తుందని ఆధునిక వైద్యం కొంతవరకు సమర్థిస్తుంది కూడా – ఉపవాసం శరీర శుద్ధికి దోహద పడుతుంది. నేటి సామాజిక పరిస్థితుల్లో, కాలుష్యం, మానసిక ఆందోళనలు పెరిగిన కాలంలో ఉపవాసం వంటి నియమాలతో శాంతి, శుద్ధి సాధించవచ్చు. తులసి, తీర్థపానాలు, సత్యప్రవర్తన వంటి ధార్మిక సంప్రదాయాలు మానవీయ ధర్మాన్ని బలపరుస్తాయి. వరూధిని ఏకాదశి వ్రతం ద్వారా మనిషి లోతైన శ్రమలు, అన్యాయాలు, అధర్మాలను తొలగించుకునే అవకాశాన్ని పొందుతాడు. ఈ వ్రతాన్ని భక్తితో పాటిస్తూ, పరమాత్మనికి అర్పణగా మార్చుకున్నపుడే నిజమైన వ్రత ఫలితం సార్థకమవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# నాటక రంగానికి జీవితం అంకితం చేసిన శేఖర్ బాబు

## - ఏప్రిల్ 24...పందిళ్ళ శేఖర్‌బాబు వర్ధంతి



పందిళ్ళ శేఖర్‌బాబు (ఆగష్టు 15, 1961 – ఏప్రిల్ 24, 2015) రంగస్థల (పౌరాణిక) నటుడు, దర్శకుడు, నిర్వాహకుడు. ఆయన 1961, ఆగష్టు 15 వ తేదీన వరంగల్ జిల్లా, ధర్మసాగర్లో రాజయ్యశాస్త్రి, సుచేత దంపతులకు జన్మించారు. బాల్యమంతా ధర్మసాగరంలోనే గడించింది. హనుమకొండలో ఇంటర్మీడియట్ చదివారు. అనంతరం దేవాదాయ ధర్మదాయ శాఖలో ఉద్యోగిగా చేరడం, కార్యనిర్వహణధికారిగా ఉన్నతస్థానం సాధించడం అన్ని వరంగల్ లోనే జరిగాయి. అంతటితో ఆగకుండా కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ చదివి, ఆ తరువాత ఎల్.ఎల్.బి. చేశారు. పందిళ్ళ శేఖర్‌బాబు తన 12వ ఏట 1973లో ఆత్మహత్య సాంఘిక నాటికలో సన్యాసి రాజు పాత్రతో రంగ ప్రవేశం చేసారు. తొలి ప్రయత్నంలోనే బహుమతుల (ద్వితీయ ఉత్తమ నాటిక, ఉత్తమ నటుడు) ను అందుకున్నారు. నాటక ప్రవేశం సాంఘిక నాటిక ద్వారా జరిగినా ఈయనకు పేరు తెచ్చినవి మాత్రం పౌరాణికాలు. 1997వ సంవత్సరం మార్చి 1న ఈయన పౌరాణిక నాటక రంగంలోకి అడుగు పెట్టారు. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో, శ్రీకృష్ణ పాత్రలో ప్రేక్షకులను అలరించారు. రవీంద్రభారతి, తెలుగు విశ్వ విద్యాలయం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైద్రాబాద్), మహతి (తిరుపతి), హనుమంతరాయ గ్రంథాలయం, తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఘంటసాల కళావేదిక (విజయవాడ), శ్రీ వేంకటేశ్వర విజ్ఞానకేంద్రం (గుంటూరు) మొదలైన ప్రముఖ వేదికలపై, ఇతర ప్రాంతాల్లో దాదాపు 500 నాటక ప్రదర్శనల్లో నటించారు. శ్రీకృష్ణ రాయబారంలో శ్రీకృష్ణుడిగా, అర్జునుడిగా, దుర్యోధనుడిగా, శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణుడిగా, నారదుడిగా, శ్రీరామాంజనేయ యుద్ధంలో శ్రీరాముడిగా, హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడిగా, గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడిగా, అర్జునుడిగా, అక్రూరుడిగా, నారదుడిగా,లవకుశలో రాముడిగా,యయాతిలో యయాతిగా,చింతామణిలో బిల్వ మంగళుడిగా, భవానీ శంకరుడిగా, బభ్రువాహనలో అర్జునుడిగా, అన్నమయ్యగా నటించారు. 1998లో తెలుగు పద్యాన్ని బ్రతికించండి– పద్యనాటక మనుగడకు సహకరించండి అనే నినాదంతో 'తెలంగాణా డ్రమెటిక్ అసోసియేషన్'ను స్థాపించారు. ఈ సంస్థ, ఒకవైపు ప్రసిద్ధమైన నాటకాలను ప్రదర్శిస్తూ, మరోకవైపు ఎంతో సమర్థవంతంగా నాటక పోటీలను నిర్వహిస్తూ వచ్చింది. రాష్ట్రంలోని ఎన్నో పట్టణాలలో ఎన్నో ప్రదర్శనల్ని దిగ్విజయంగా ప్రదర్శించి, ప్రేక్షకుల్ని పరవశింప జేసింది తెలంగాణా డ్రమెటిక్ అసోసియేషన్. 2007లో 'శ్రీకృష్ణరాయబారం' నాటకానికి ఉత్తమ నటుడు, ఉత్తమ పద్యపఠనం విభాగాలలో రెండు గరుడ అవార్డులు (స్వీయ దర్శకత్వం), 2011లో 'యయాతి' నాటకానికి ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ పాత్రోచిత నటుడు విభాగాలలో మూడు గరుడ అవార్డులు (స్వీయ దర్శకత్వం), 2012లో యయాతి' నాటకానికి ఉత్తమ నటుడు, ఉత్తమ సంగీతం విభాగాలలో రెండు గరుడ అవార్డులు, 'బభ్రువాహన' పద్య నాటికకు తృతీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటి, ఉత్తమ పాత్రోచితనటి విభాగాలలో మూడు గరుడ అవార్డులు లభించడంలో ఆయన కృషి ఎంతో ఉంది. నటులకు ప్రోత్సాహాన్నిచ్చి, వివిధ పరిషత్తులతోపాటు, ప్రముఖ వేదికలపై నాటకాల నిర్వాహణ, దర్శకత్వ బాధ్యతల నిర్వాహణ గావించారు. 2008 నుండి 'వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక' అధ్యక్షునిగా, ప్రతి యేటా క్రమంతప్పకుండా నాటిక పోటీలను నిర్వహించారు. 'రంగస్థల కళాకారుల క్రెడిట్ సొసైటీ'ని నిర్వహిస్తూ, తద్వారా వచ్చే లాభాలు, వడ్డీల నుండి 50 శాతం 'ఐక్యవేదిక'కు కేటాయించి, సంస్థకు ఆర్థికంగా పరిపుష్టం గావించారు. న్యాయ నిర్ణేతగా ఆయన నిర్ణయం నిష్పాక్షికమైనది. రాగద్వేషాలకు తావీయకుండా, ప్రతిభకు పట్టంకట్టడంలో ఆయనది అందెవేసిన చేయి. అందుకే రాష్ట్రంలోని ఎన్నో పరిషత్తులు నాటక పోటీలకు గుణనిర్ణేతగా ఆయయను ఆహ్వానించి గౌరవిస్తున్నాయి. 2008లో రాజమండ్రి లో జరిగిన నంది నాటకోత్సవాలకు పౌరాణిక నాటక విభాగంలో ప్రాథమిక న్యాయ నిర్ణేతగా 2009, 2011 సంవత్సరంలో అభినయ పరిషత్ వారు నిర్వహించే హనుమ అవార్డుల పోటీల పౌరాణిక నాటక విభాగంలో న్యాయ నిర్ణేతగా, 2012లో రవీంద్రభారతిలో జరిగిన పి.ఎం.కె.ఎం. సాంఘీక నాటకపోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. శేఖర్ బాబు నిర్విరామ కృషికి, దీక్షాదక్షతలను గుర్తించిన అనేక సంస్థలు ఆయనకు నటశేఖర, పౌరాణిక నట సౌర్వభౌమ, పౌరాణిక విద్వన్మణి, మెగా సిటిజన్, శ్రీపాద నాటక కళాపరిషత్ వారి పురస్కారం, పద్యనాటక కళాధురీణ వంటి బిరుదులనిచ్చి సత్కారం చేశాయి. 2000 సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదీ నుండి 11వ తేదీవరకు 7రోజుల పాటు వరుసగా ఒకే వేదికపై శ్రీకృష్ణ రాయబారం, లవకుశ, సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, చింతామణి, గయో పాఖ్యానం, శ్రీరామాంజనేయ యుద్ధం నాటకాలను 'పద్య నాటక సప్తాహం' పేరిట, ఏడు రోజులు వరుసగా ప్రదర్శించి, ప్రధాన పాత్రలను ధరించారు. 2011లో మరలా 'పద్యనాటక సప్తకం ' నిర్వహించి స్వీయ దర్శకత్వంలో 7 నాటకాలను, వారానికొకటి చొప్పున ప్రదర్శించి, ప్రధాన పాత్రలు ధరించి, నిర్వాహణ వ్యయం 3 లక్షలు భరించారు. 2012లో తొలి తెలుగు సినీ రచయిత, 'పరబ్రహ్మ పరమేశ్వర' ప్రార్థనా గీత రచయిత చందాల కేశవదాసు 136వ జయంతి ఉత్సవం తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం (హైద్రాబాద్) లో నిర్వహించారు. 2010లో అజో–విభో ఫౌండేషన్ వారు వరంగల్ లో నిర్వహించిన, 'సాహితీమూర్తి పురస్కారం' డా. నల్లాన్ చక్రవర్తుల రఘునాథ చార్యులకు ప్రదానం చేసిన కార్యక్రమాన్ని కలిసి నిర్వహించారు. అనారోగ్య కారణాల వల్ల హైదరాబాద్ లో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఏప్రిల్ 24, 2015 న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సుంకాల యుద్ధం భారత్ మాత్రమే కాదు ఆ దేశాలకు లాభమే!




అగ్రరాజ్యం అమెరికా.. బలమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న చైనా మధ్య మొదలైన వాణిజ్య యుద్ధంతో మేలు ఎవరికి? కీడు ఎవరికి? అన్నదిప్పుడు చర్చగా మారుతోంది. ఈ సందర్భంగా కౌంటర్ పాయింట్ సంస్థ తన రీసెర్చ్ రిపోర్టును బయటపెట్టింది. అమెరికా – చైనా మధ్య వాణిజ్య యుద్ధం కారణంగా అంతర్జాతీయ స్మార్ట్ ఫోన్లు.. ల్యాప్ ట్యాప్ లను ఉత్పత్తి చేసే సంస్థలు తమ ఉత్పత్తి కర్మాగారాలను చైనా నుంచి భారత్ కు తరలించే అంశాల్ని సీరియస్ గా పరిగణలోకి తీసుకుంటున్నాయి. అలా అని భారతదేశమే పూర్తిగా లాభపడుతుందని బావించటం తప్పులో కాలేసినట్లే. ఎందుకంటే.. భారత్ కంటే కూడా మరికొన్ని దేశాలపై మొబైల్.. ల్యాప్ టాప్.. కంప్యూటర్ల తయారీ సంస్థలు భావిస్తున్నాయి. ప్రతీకార లారిఫ్ ఉద్రికత్తలు దీర్ఘకాలం సాగితే.. రానున్న రోజుల్లో పరిణామాలు వేగంగా మారనున్నాయి. అంతర్జాతీయ స్మార్ట్ ఫోన్ల మొత్తం ఉత్పత్తిలో చైనా దేశ వాటానే మెజార్టీ. కానీ.. ఇప్పుడున్న పరిస్థితులు కొనసాగితే ఈ దేశ వాటా 2026 నాటికి 55 శాతానికి పడిపోనుంది. 2024లో దీని వాటా 64 శాతం ఉండటం గమనార్హం. అమెరికాకు చెందిన యాపిల్.. కొరియాకు చెందిన శాంసంగ్ తమ ఉత్పత్తుల్ని భారత్ కు కేంద్రంగా ఎంచుకున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయ స్మార్ట్ ఫోన్ల మొత్తం ఉత్పత్తిలో భారత్ వాటా 2026 నాటికి 25–28 శాతానికి చేరుకుంటుందని చెబుతున్నారు. 2024 నాటికి మన దేశ వాటా 18 శాతంగా ఉంది. అంతర్జాతీయంగా ఐఫోన్ల ఉత్పత్తి విలువలో భారత్ ఎగుమతుల విలువ ప్రస్తుతం 20 శాతంగా ఉంది. 2025–26 నాటికి 25 శాతానికి.. 2026–27 నాటికి 35 శాతానికి చేరుకుంటుందని తాజా రిపోర్టు అంచనా వేస్తోంది. ల్యాప్ టాప్.. పీసీల మొత్తంతయారీలో చైనా వాటా 2026 నాటికి 68–70 శాతానికి దిగి వస్తుందని చెబుతున్నారు. 2024 నాటికి ఈ వాటా 75 శాతం ఉండేది. అదే సమయంలో ఈ రంగంలో భారత్ ఉత్పత్తి వాటా 2026 నాటికి 7 శాతం ఉండొచ్చు. 2024లో ఇది 4 శాతంగా ఉంది. ల్యాప్ టాప్ లు.. కంప్యూటర్లు చైనా నుంచే అధికంగా దిగుమతి అవుతున్నాయి. వాణిజ్య యుద్ధం నేపథ్యంలో హెచ్ పీ.. డెల్ లాంటి సంస్థలు తమ ఉత్పత్తి స్థావరాల్ని చైనా నుంచి భారత్ కు మారిస్తే మన వాటా పెరగనుంది. అయితే.. చైనా నుంచి తయారీ కర్మాగారాల్ని భారత్ కు తరలించటం అంత సులువైన అంశం కాదు. డెల్ సంస్థ ల్యాప్ టాప్ ఉత్పత్తి 79 శాతం చైనాలో ఉండగా.. మిగిలినదంతా వియత్నాంలో ఉంది. 2026 నాటికి డెల్ తన తయారీ సామర్థ్యాన్ని సగానికి పైగా వియత్నాంకు తరలించనుంది. లెనివో సైతం వియత్నాంను ప్రత్యామ్నాయ దేశంగా చూస్తోంది. చైనాలో 85 శాతం తయారీ సామర్థ్యం ఉన్న హెచ్ పీ.. 2026లో మెక్సికో.. తైవాన్ దేశాలకు 45 శాతం మార్చనుంది. మొత్తంగా వాణిజ్య యుద్ధంలో భారత్ కు మేలు జరిగేది అంతంతేనని మాత్రం చెప్పక తప్పదు.

చురకలు

## సంపాదకీయం

### మూడేళ్ల కనిష్టానికి డాలర్ పతనం, గరిష్టానికి బంగారం..

## మార్కెట్లో ఏం జరుగుతోంది?

ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక మార్కెట్లు తీవ్రమైన అనిశ్చితితో సతమతమవుతున్నాయి. ముఖ్యంగా అమెరికన్ డాలర్ విలువలో దారుణ పతనం.. దానికి అనుగుణంగా బంగారం ధర చారిత్రాత్మక గరిష్ట స్థాయికి చేరుకోవడం వంటి సంఘటనలు దీనికి నిదర్శనం. ఏప్రిల్ 21 సోమవారం నాడు సంభవించిన ఈ నాటకీయ మార్కెట్ కదలికలు, ప్రధానంగా అమెరికా అధ్యక్ష భవనం , కేంద్ర బ్యాంక్ అయిన ఫెడరల్ రిజర్వ్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగానే సంభవించాయని, ఇది కేంద్ర బ్యాంక్ స్వాతంత్ర్యంపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. వివిధ ప్రధాన కరెన్సీలతో డాలర్ పనితీరును సూచించే కీలకమైన ఐసీఈ యూఎస్ డాలర్ ఇండెక్స్, మార్చి 2022 తర్వాత అత్యంత బలహీనమైన స్థాయికి క్షీణించింది. డాలర్ విలువలో ఈ క్షీణత ప్రపంచ రిజర్వ్ కరెన్సీ స్థిరత్వంపై విశ్వాసం సన్నగిల్లడాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ డాలర్ బలహీనతకు మూల కారణం అమెరికా ప్రభుత్వం , కేంద్ర బ్యాంక్ మధ్య తీవ్రమవుతున్న ఘర్షణే అని మార్కెట్ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్‌పై చేసిన బహిరంగ విమర్శలు, తక్షణమే వడ్డీ రేట్లను తగ్గించాలనే పట్టుదల కూడిన డిమాండ్లు మార్కెట్‌లో గణనీయమైన అనిశ్చితిని సృష్టించాయి. ఈ పరిణామాలు, రాజకీయ ప్రభావానికి అతీతంగా, స్వతంత్రంగా ద్రవ్య విధానాన్ని నిర్వహించగల ఫెడరల్ రిజర్వ్ సామర్థ్యంపై తీవ్ర ప్రశ్నలను లేవనెత్తాయి. ఇది స్థిరమైన ఆర్థిక నిర్వహణకు కీలకమైన సూత్రంగా పరిగణించబడుతుంది. ఫెడ్ స్వాతంత్రానికి ముప్పు వాటిల్లుతుందనే ఈ ఆందోళన, అమెరికా ఆస్తులపై విస్తృతమైన అమ్మకాల ఒత్తిడికి దారితీసింది. పెట్టుబడిదారులు, పెరిగిన రాజకీయ , ఆర్థిక అనిశ్చితి మధ్య సంభావ్య నష్టాల నుండి తమను తాము రక్షించుకోవడానికి ప్రయత్నిస్తూ తమ మూలధనాన్ని త్వరితగతిన సంప్రదాయ సురక్షిత పెట్టుబడి సాధనాల వైపు మళ్లించారు. ఆర్థిక అస్థిరత లేదా భౌగోళిక రాజకీయ ఒత్తిడి సమయాల్లో సురక్షితమైన ఆశ్రయంగా దీర్ఘకాలంగా పరిగణించబడే బంగారం, ఈ మార్పు నుండి గణనీయంగా ప్రయోజనం పొందింది. సోమవారం నాడు ఈ విలువైన లోహం ధర కొత్త రికార్డు గరిష్ట స్థాయికి చేరుకుంది. ఈ మైలురాయి పెట్టుబడిదారులలో నెలకొన్న 'రిస్క్-ఆఫ్' సెంటిమెంట్‌ను గట్టిగా నొక్కి చెబుతోంది. వారు అధిక రాబడి కోసం రిస్క్ ఉన్న ఆస్తుల కంటే, బంగారం వంటి సురక్షితమైన వాటికే ప్రాధాన్యత ఇస్తున్నారు. బలహీనపడుతున్న అమెరికన్ డాలర్ , అమెరికన్ ఆస్తులపై పెట్టుబడిదారుల విశ్వాసం తగ్గడం వంటి అంశాలు కేవలం కరెన్సీ, బంగారం మార్కెట్లకే పరిమితం కాకుండా, విస్తృత ప్రపంచ ఆర్థిక మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన కరెన్సీ చుట్టూ నెలకొన్న అనిశ్చితి వివిధ ఆస్తుల వర్గాలు , ప్రాంతాలపై గణనీయ ప్రభావం చూపిస్తోంది. రాబోయే రోజులు, వారాల్లో మార్కెట్ల దిశ అనిశ్చితంగానే ఉంటుంది. దాని గమనం ప్రధానంగా శ్వేత సౌధం , ఫెడరల్ రిజర్వ్ మధ్య సంబంధాల స్థితిగతులు, ఫెడ్ నుండి వెలువడే భవిష్యత్ ద్రవ్య విధాన నిర్ణయాలు, విస్తృత ప్రపంచ ఆర్థిక వాతావరణంపై ఆధారపడి ఉంటుంది. అంతిమంగా ఫెడరల్ రిజర్వ్ యొక్క స్థిరత్వం, స్వాతంత్ర్యం మార్కెట్ విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి.. సంభావ్య ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అత్యంత ముఖ్యమైనవి. ప్రస్తుత ఉద్రిక్తతలు రాజకీయ సమీకరణాలు ఆర్థిక స్థిరత్వాన్ని ఎంతగా ప్రభావితం చేయగలవో ఒక స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తోంది. .

## పుష్టి మత స్థాపకుడు వల్లభాచార్యుడు... - చైత్ర కృష్ణ ఏకాదశి వల్లభాచార్య 546వ జయంతి




అన్య మత మార్పిడులు అధికమై, హైందవ సనాతన సాంప్రదాయాలు కనుమరుగు అవుతున్న విషమ పరిస్థితులు, పుష్టి మత స్థాపకుడు శ్రీపాద వల్లభాచార్య అవతరణకు కారణ భూతాలు అయినాయి. వైదిక నిష్టా గరిష్ఠుల కుటుంబంలో జన్మించి వైష్ణవ మతాచార్యుడు అయిన జగద్గురు, మహాప్రభు శ్రీమత్ వల్లభాచార్య, భారతా వనిలో శుద్ధ అద్వైతాన్ని పాటించే పుష్టి మత స్థాపనా చార్యులు అయినారు. క్రీస్తుశకము 1479 లో (విక్రమార్క శకం 1535) చైత్ర కృష్ణ పక్ష ఏకాదశి( వరూధిని ఏకాదశి) నాడు లక్ష్మణ భట్టు, ఎలమగర దంపతులకు రెండవ కుమారునిగా వల్లభుడు అవతరిం చారు. 100 సోమ యాగాలు చేశాక, తాను తమ వంశములో ఉదయిస్తానని శ్రీకృష్ణ భగవానుడు, వల్లభుని పూర్వజు లైన యజ్ఞ నారాయణా చార్యులకు చేసిన ఆదేశానుసారం, ఆయన తరువాతి వారైన లక్ష్మీ నారాయణ భట్టు, శతాధిక సోమ యాగాలు పూర్తి చేసిన క్రమంలో, కాశీలో వల్లభుడు భూమిపై అవత రించారు. బాల్యం నుండే వేదాలు ఉపనిషత్తులు, అష్టాదశ పురాణా లు పఠించి, తర్వాతి కాలంలో, ఆదిశంకర, రామానుజ, మధ్వా చార్య, బౌద్ధ, జైన సిద్ధాంతాలపై ఆమూలాగ్ర అవగాహన పొంది, దేశం నలుమూలల పర్యటించి, భక్తి మార్గం నిర్దేశకులు అయినారు. "భగవత్ సాన్నిహిత్య సాధనకు సాధువులే కానక్కరలేదని, కౌటిం బిక జీవన విధానంలోనూ, కృష్ణ భగవానుని భక్తితో కొలిస్తే, ముక్తి లభించగలదని", కొత్త సంప్రదాయానికి పురుడు పోసారు. భారతావనిలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ లాంటి చోట్ల " కొత్త ప్రతిపాదన" ప్రభావం చూపి, వందలాదిగా వల్లభుని అనుసరించారు. వైష్ణవ మత వ్యాప్తికి, నడుము బిగించి, దేశాటన చేస్తూ, వివిధ చోట్ల భిన్న మతస్థులతో వాదోపవాదాలు జరిపి, తన మతానికి వారిని మళ్ళించారు. శ్రీకృష్ణ దేవరాయల దర్బారులో, మధ్వాచార్య, శంకరాచార్య అనుయాయుల మధ్య జరిగిన చర్చలలో పాల్గొని, 27 రోజులు విస్తృతంగా చర్చించి, శైవులకు ఓడించి, సభికులను ఒప్పించి, మెప్పించి, కనకాభిషేకం చేయించుకున్నారు. అదే సమయంలో, ఆచార్య "జగద్గురు" బిరుదాంకితులు అయినారు. ఉజ్జయిని, ప్రయాగ, కాశీ, హరిద్వార్, బద్రీనాథ్, కేదార్నాథ్ తదితరాలను సందర్శించి, చివరకు మధుర వద్ద, బృందావనంలో కొంతకాలం గడిపారు. శ్రీకృష్ణుడు స్వప్న సాక్షాత్కారియై, గోవర్ధన గిరిపై శ్రీనాథ విగ్రహం కలదని, దాన్ని వెలికి తీసి, ఆలయం నిర్మించి, విగ్రహ ప్రతిష్ట చేసి, పూజాదికాలు జరిగేలా చూడాలని చేసిన ఆదేశానుసారం, 1520 లో శ్రీనాథ ఆలయం నిర్మించారు. అందుకే వల్లభుని మతాన్ని "శ్రీనాథ మతం" అంటారు. "చివరికి కాశీ" లో స్థిరపడ్డారు. బాదరాయణ బ్రహ్మ సూత్రాలకు, జైమినీ పూర్వ మీమాంస సూత్రాలకు, అను భాష్యం రచించారు. భాగవత దశమ స్కందానికి సుబోధిని వ్యాఖ్యాన గ్రంథ రచన చేశారు. మధురాష్టకం, చతు చతు శ్లోకీ, వచనామృతం, భాగవత ఏకాదశ స్కంధ అర్థ నిరూపణ కారిక, భక్తి వర్ధిని, అంతఃకరణ ప్రబోధ, సిద్ధాంత రహస్యం, పుష్టి ప్రవాహ మర్యాద, శ్రీకృష్ణ జన్మ పత్రిక, పురుషోత్తమ సహస్ర నామాలు, యమునాష్టకం, సిద్ధాంత ముక్తావళి, నవరత్నం లాంటి గ్రంథాలు ఎన్నో విరచించారు. శంకరాచార్యుని సిద్ధాంతాలతో విభేదించి, మాయావృతం కాని పరబ్రహ్మమే పరమ సత్యమని ప్రతిపాదించిన కారణంగానే, ఆయన వాదానికి శుద్ధ అద్వైతం అనే నామం శాశ్వతమైంది. పరమాత్మ సచ్చిదానంద స్వరూపం కాగా, జీవుడు సత్ చిత్ రూపం మాత్రమే. జీవుని నుండి, ఈశ్వ రుడు ఆనందాన్ని మరుగు పరిచాడు. అందుకే జీవుడు అజ్ఞాన వశుడై, సంసార బద్ధుడై, దుఃఖ బాధితుడు అవుతున్నాడు, అని తాత్విక చింతనను మిగుల ప్రచారం చేశారు. 1531 లో ఆషాఢ శుక్ల పక్షంలో తమ 52వ ఏట శ్రీనాధుని అజ్ఞాను వర్తియై, ప్రాపంచిక జీవితాన్ని వదిలి గంగానదిలో జల సమాధి అయినారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


## స్థానిక సమస్యల పరిష్కారం... పంచాయితీ రాజ్ లక్ష్యం - ఏప్రిల్ 24...జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఏప్రిల్ 24న భారతదేశంలో ప్రతి ఏటా నిర్వహిస్తారు. పంచాయితీ రాజ్ వ్యవస్థను పటిష్ఠం చేయడం కోసం కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ అధ్వర్యంతో ఈ దినోత్సవం నిర్వహించ బడుతుంది. భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనా వ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగుణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్ పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వ పరిపాలనా సంస్థలు రూపు దిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్ర ప్రదేశ్ లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్ నగర్ జిల్లా, షాద్‌నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతి సమితి, జిల్లా స్థాయి లో జిల్లా పరిషత్ ఏర్పడింది. 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్ గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగా త్మక ప్రాతిపదికగా, సమాజ వికాసా భివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుక బడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యా లు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీ ని 1956లో నియమించారు. ఈ కమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి.




బల్వంతరాయ్ మెహతా స్వాతంత్ర్యం తరువాత మెహతా భారతదేశ లోక్‌సభకు పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికయ్యా డు. పార్లమెంట్ అంచనా కమిటీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ప్రణాళిక ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడుగా రాష్ట్రాలలో మూడు అంచెల వ్యవస్థ స్థాపన కోసం మెరుగైన విధానానికి అద్భుతమైన నివేదికను సిద్ధం చేశాడు. తద్వారా భారత దేశపు పంచాయితీ రాజ్ ఫాదర్‌గా ప్రశంసించ బడ్డాడు. 1952, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన సమాజ అభివృద్ధి కార్యక్రమం ప్రాతి పదికగా, జాతీయాభివృద్ధి మండలి 1957, జనవరి, 16న బల్వంత్ రాయ్ గోపాల్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీ క్షించి, గ్రామ పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3 - అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేస్తూ, తన నివేదిక ను 1957, నవంబరు 24న జాతీయాభివృద్ధి మండలికి సమర్పించిం ది. కమిటీ నివేదికను జాతీయాభివృద్ధి మండలి 1958, జనవరిలో ఆమోదించింది. ఈ నివేదికలోని అంశాల అమలు వివిధ రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థఏర్పాటుకు ప్రయత్నించాయి. భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచ నంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్ జిల్లాలోని, సికార్ అనే ప్రాంతంలో ఈ విధానా న్ని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం..."నేడు ప్రారంభమ వుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడతాయి''. మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1959, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్లోని రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వద్ద నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెహ్రూ ప్రారంభించారు. బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు... దేశంలో 3 అంచెల పంచాయతీ రాజ్ విధానం ఏర్పాటు చేయాలి. 1) జిల్లా స్థాయిలో - జిల్లా పరిషత్, 2) బ్లాకు స్థాయిలో - పంచాయతీ సమితి, 3) గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నిక లను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమ బద్ధంగా ఎన్నికలు జరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కింది స్థాయి లో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయుల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరి పాలనా, వనరుల, ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేయాలని బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగా పరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్ వ్యవస్థ యొక్క ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్య సాధన కోసం స్వాతంత్ర్యానంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తనవంతు కృషి చేస్తూనే ఉన్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## పాత్రికేయ కురువృద్ధులు నందూరి - ఏప్రిల్ 24...నందూరి రామమోహనరావు జయంతి



తెలుగు పత్రికలతో పరిచయం ఉన్న వారికి నందూరి రామమోహనరావు పేరు సుపరిచితమే. అయన సమాజం పట్ల నిబద్ధత కలిగిన సంపాదకులు. ఆయన ఎంతో మందికి గురు తుల్యులు, మార్గ నిర్దేశకులు. మరెంతో మందిని పాత్రికేయులుగా తీర్చి దిద్దిన గురువులు. పాత్రికేయునిగానే కాక, రచయితగా కూడా ప్రఖ్యాతి గాంచారు. పత్రికారంగంలో అంతటి సంగీత సాహిత్య కళా మర్మాలెరిగిన వ్యక్తి చాలా అరుదు. నందూరి రామమోహనరావు (ఏప్రిల్ 24, 1927– సెప్టెంబర్ 3, 2011) తెలుగు పాత్రికేయరంగ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన మేధావి. చాలాకాలం ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదక బాధ్యతలు నిర్వహించారు. "బాల" అనే పత్రికలో, ఆంధ్రపత్రిక లోనూ 1940 వ దశకంలో అయన రచనలు ఎన్నో ప్రచురింప బడ్డాయి. "నరావతారం", "విశ్వరూపం" ఈయన ప్రముఖ రచనలు. సామాన్య జనాలకు సైన్సు విషయాలను పరిచయం చేయడంలో నందూరి కృషి మరవ లేనిది.

అయన ఆంధ్రపత్రికలో మార్క్ ట్వేయిన్ నవలలకు తెలుగు అనువాదాలు కూడా చేసారు. దశాబ్దాల క్రితం నందూరి ఆంధ్రవార పత్రికలో పిల్లల కోసం రాబర్ట్ లూయీ స్టీవెన్సన్ కాంచన ద్వీపం, మార్క్ ట్వేన్ టామ్ సాయర్, హకల్ బెరీ ఫిన్, రాజూ పేద, విచిత్రవ్యక్తి అనువాద రచనలు ఆకట్టుకునేవి. అనువాదం కూడా మరో భాష నుంచి అనువాదాన్ని చేసినట్లు కాకుండా తెలుగులో అచ్చు స్వీయ రచనలానే వుండేది. ఆంధ్రపత్రిక ద్వారా ఆయన జర్నలిస్టు జీవితం ప్రారంభించి, 1948 నుంచి 1960 వరకు ఆయన ఆంధ్ర పత్రికలో పనిచేశారు. 1960లో సహ సంపాదకులుగా 'ఆంధ్రజ్యోతి'లో కాలూనారు. 1960 నుంచి 1994 దాకా%ొ%దాదాపు మూడున్నర దశాబ్దలు ఆయన 'ఆంధ్రజ్యోతి'లో రచనా జైత్ర యాత్ర కొన సాగించారు. ఆయన సంపాదకీయ రచనా వైశిష్ట్యం పాఠకులపై చాలా ప్రభావం చూపేది. తొలినాళ్లలో సంపాదకులు నార్ల వెంకటేశ్వర రావుతో కలసి పని చేశారు. నార్ల తర్వాత 1980 లో నందూరి 'ఆంధ్రజ్యోతి' సంపాదకులుగా పూర్తిస్థాయి బాధ్యతలు భుజ స్కందాలపై వేసు కున్నారు. ఆయన 1962, 1978, 1984, 1992 లలో అమెరికాలో, 1982లో రష్యా లోను పర్యటించారు. ఆరు దశాబ్దాల కాలం గడిచినా, నందూరి నాటి పుస్తకాలకు ఆదరణ తగ్గక పోవడం విశేషం. నందూరి ఖగోళ, భౌతిక శాస్త్రాలను పరిశోధించి 'విశ్వరూపం' అనే పుస్తకం రచించారు. మానవాళి పరిణామ క్రమానికి సంబంధించిన నరావతారం, తత్త్వశాస్త్రాన్ని సులువుగా వివరించే 'విశ్వ దర్శనం' ఆయన కలం నుంచి జాలువారినవే. నందూరి.. సవ్యసాచి పేరుతో రాజకీయ వ్యంగ్య రచనలు, హరివిల్లు పేరుతో బాల గేయాలు, ఉషస్విని పేరిట కవితలు రచించారు. మిత్రలాభం, మిత్ర భేదం (పంచతంత్ర కథలు) పేరిట బాపు వేసిన బొమ్మలకు నందూరి మాటలను అందించారు. ఇంద్రగంటి శ్రీకాంత శర్మతో కలిసి 'మహా సంకల్పం' అనే సంకలనాన్ని వెలువరించారు. సంపాదకీయాల సంకలనం అను పల్లవి, చిరంజీవులు, వ్యాఖ్యావళి తదితరాలు ఆయన కలం నుండి జాలువారిన రచనలే. నందూరి రాసిన ఐదు పుస్తకాలను న్యూస్టూడెంట్ బుక్ సెంటర్ అధినేత బాబ్జీ ప్రచురించి 2006 మే 9వ తేదీన ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించి, ఆయనను సత్కరించారు. ఆంధ్రపత్రికలో పని చేసే రోజుల్లో కొడవటిగంటి కుటుంబరావు, పండితారాధ్యుల నాగేశ్వరరావు, తెన్నేటి సూరి, పిలకాగణపతిశాస్త్రి వంటి దిగ్గజాలతో సాహిత్యంపై చర్చించేవారు. అలాగే ఆరుద్ర, శ్రీశ్రీ లతోపాటు 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు రామచంద్రమూర్తి, తదితలతో నందూరికి సంబంధం, అనుబంధం ఉండేది. నరావతారం, విశ్వరూపం, విశ్వదర్శనం - భారతీయ చింతన విశ్వదర్శనం - పాశ్చాత్య చింతన అనుపల్లవి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం) చిరంజీవులు (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం), వ్యాసావళి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం) అక్షరయాత్ర (సాహిత్య, సాహిత్యేతర వ్యాస సప్తతి), ఉషస్విని (కవితా సంపుటి) చిలక చెప్పిన రహస్యం (పిల్లల నవల), మయూర కన్య (పిల్లల నవల), హరివిల్లు (పిల్లల గేయాలు) వంటి రచనలు చేసారు. అభినందన (హైదరాబాదు) సంస్థ నుంచి ముట్నూరి కృష్ణారావు అవార్డు (1988), జూలూరి నాగ రాజారావు (హైదరాబాదు) స్మారక అవార్డు (1989), మద్రాసు తెలుగు అకాడెమీ "ఉగాది వెలుగు" అవార్డు (1989), కళాసాగర్ (మద్రాసు) అవార్డు, అభిరుచి (ఒంగోలు) సంస్థ వారి "పాత్రికేయ రత్న" అవార్డు, ."జమీన్ రైతు" వజ్రోత్సవంలో నెల్లూరి వెంకట్రామా నాయుడు స్మారక అవార్డు (1990), ఆలూరి నారాయణరావు స్మారక ట్రస్టు (విజయవాడ) వారి సి.వై.చింతామణి అవార్డు, తెలుగు యూనివర్సిటీ వారి ఆనరరీ డాక్టరేట్ (1991), అమెరికన్ తెలుగు అసోసియేషన్ వారి "శిరోమణి" అవార్డు (1992), క్రాంతి విద్యా సంస్థల (విజయవాడ) నుంచి ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1994), రామకృష్ణ జైదయాళ్ హార్మొనీ అవార్డు (1994), సిద్ధార్థ కళా పీఠం (విజయవాడ) వారి విశిష్ట వ్యక్తి అవార్డు (1994), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1996), తెలుగు యూనివర్సిటీ వారి తాపీ ధర్మారావు స్మారక అవార్డు (1997), అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి ప్రతిభామూర్తి అవార్డు (1998), తదితర అవార్డులు అందుకున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# లెక్కలో తేడాలో.. పొంతనలేని ఖర్చులు

పెద్దపల్లి : జిల్లాలోని స్థానిక సంస్థలు, మార్కెట్ కమిటీలు, గ్రంథాలయాల్లో రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు తేలింది. నిధుల ఖర్చులో వ్యత్యాసం కనిపిస్తోంది. అవసరమైన ఆధార పత్రాలు లేకుండానే ఖర్చు చేసినట్లు స్పష్టమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా ఆడిట్ శాఖ నిర్వహించిన తనిఖీల్లో పాలకుల లోపాలు బహిర్గతమయ్యాయి. నిధుల ఖర్చులో అభ్యంతరాలపై నోటీసులు జారీ చేయనున్నారు. నిర్ణీత గడువులోపు ఆధారపత్రాలు సమర్పించకుంటే రికవరీ జారీ చేస్తారు.

**జిల్లా పరిషత్తులో అత్యధికం**

జిల్లా, మండల పరిషత్తులు, గ్రామ పంచాయతీలకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఆర్థిక సంఘం, ఇతర అభివృద్ధి నిధులు పక్కదారి పట్టకుండా ప్రతీపైసా లెక్కిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన అభివృద్ధి పనులపై ఆడిట్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో దస్త్రాలను పరిశీలించారు. మంజూరు చేసిన నిధులు, ఖర్చుల్లో వ్యత్యాసాన్ని గుర్తించారు. జిల్లాలో స్థానిక సంస్థలు, దేవాలయాలు, మార్కెట్ కమిటీల్లో మొత్తం 3,431 అభ్యంతరాలకు రూ.62,87,42,110 వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. అత్యధికంగా జిల్లా పరిషత్తులో



11 అభ్యంతరాలకు రూ.55.90 కోట్లు వ్యత్యాసం ఉంది. గ్రామ పంచాయతీల్లో అత్యధికంగా అభ్యంతరాలు 3,021 వచ్చాయి.

**నోటీసులు జారీ**

అభివృద్ధి పనులకు సంబంధించి నోటీసులు జారీ చేసేందుకు ఆడిట్ శాఖ సిద్ధమవుతోంది. నాలుగు నెలల్లోపు ఆయా నోటీసులకు సరైన ఆధారాలతో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ సమాధానం ఇవ్వకుంటే మరోసారి నోటీసులిస్తారు. తర్వాత ప్రత్యేకంగా నోటీసులు ఇచ్చి తనిఖీలు చేస్తారు. తనిఖీల్లో అనుమానం ఉంటే మరోసారి కూడా వెళ్లి పరిశీలిస్తారు. వీటిన్నంటికి స్పందించకుంటే చివరిసారిగా రికవరీ నోటీసులు ఇస్తారు.

**రికార్డుల నిర్వహణ అధ్వానం**

నిధుల ఖర్చులో పొంతన లేదు. మంజూరైన నిధులకు జీఎస్టీ, ఇతర పన్నులు తిరిగి చెల్లించడం లేదు. పంచాయతీల్లో నిధులకు సంబంధించి నగదు పుస్తకం, ఆన్‌లైన్ నమోదులో తేడా ఉంది. గతేడాదిలో పన్నుల రూపంలో వచ్చిన నిధులను రాబట్టుకోవడం లేదు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, ఆడిట్ శాఖకు చూపకపోవడం వంటి లోపాలున్నాయి.

# చెత్త బండి.. మరమ్మతులో ఉంది!

జగిత్యాల : జిల్లాలోని 5 పురపాలికల్లో పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగించే ఆటోలు, ట్రాక్టర్లు, టిప్పర్లు, బ్లేడ్‌ట్రాక్టర్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తడంతో వాటిని వెంటనే పరిష్కరించేందుకు బల్దియాలు శ్రద్ధ వహించడంలేదు. ఫలితంగా పట్టణాల్లోని అత్యధిక వార్డుల్లో చెత్త సేకరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నిత్యం ఏదో ఒక వార్డులో చెత్త సేకరణ వాహనాలు రాక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పురపాలికల్లో 25 వాహనాలు



మరమ్మతులోనే ఉండటం గమనార్హం. నిబంధనల మేరకు వాహనాల నిర్వహణకు ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిత్యం వాహనాలపై పర్యవేక్షణ ఉండాలి. మరమ్మతులను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాల్సి ఉంటుంది. కానీ పురపాలికలు ఇవి అమలు చేయడం లేదు. ఆటోలు మరమ్మతుకు గురైతే రూ.లక్షల్లో బిల్లులు చూపి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.మెట్‌పల్లి పురపాలికలో రూ.14 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రం. వాహనం కొనుగోలు చేసిన కొన్నాళ్లకే మూలన పడింది. మరమ్మతుకు నోచుకోక ఇలా పక్కనబెట్టారు.

జగిత్యాల పురపాలికలో రూ.40 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రం రెండేళ్లుగా మూలన పడేశారు. మరమ్మతు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు.

**ఏటా రూ.25 లక్షలు**

జిల్లా కేంద్రమైన జగిత్యాలలో ఏటా చెత్త సేకరణ వాహనాల పేరిట రూ.25 లక్షలు వ్యయం చేస్తున్నారు. అయినప్పటికీ వాహనాల కొరత తీవ్రంగా ఉంది. బల్దియాలో 47 ఆటోలు, 12 ట్రాక్టర్లు, 1 జేసీబీ, 2 టిప్పర్లు, 1 బ్లేడ్ ట్రాక్టరు, 1 స్వీపింగ్‌యంత్రం ఉన్నాయి. ప్రస్తుతం 11 ఆటోలు మరమ్మతులో ఉన్నాయి. ఏడాది కిందట కొనుగోలు చేసిన 5 వాహనాలు సైతం మరమ్మతు దశకు చేరడం నిర్వహణ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. తరచూ మరమ్మతుల సాకుచూపి రూ.వేలల్లో ఖర్చయ్యే వాహనాలకు సైతం అడ్డగోలు బిల్లులు చూపి అక్రమాలకు తెరలేపుతున్నారు.జగిత్యాలలో 67 వాహనాలు చెత్త సేకరణలో వినియోగిస్తుండగా వీటిలో 11 ఆటోలు మరమ్మతులో ఉన్నాయి. మెట్‌పల్లిలో చెత్త సేకరణకు 36 వాహనాలున్నాయి. వీటిలో 4 ఆటోలు, 2 టిప్పర్లు పనిచేయడంలేదు. రాయికల్ పురపాలికలో 7 చెత్త సేకరణ వాహనాలుండగా ఒకటి మరమ్మతుకు గురైంది. కోరుట్ల పట్టణంలో 45 వాహనాలకుగాను 5 వాహనాలు మరమ్మతులో ఉన్నాయి. ఉన్న ఒక్క స్వీపింగ్‌యంత్రం పనిచేయడంలేదు. ధర్మపురిలో 7 వాహనాలుండగా ఒకటి పనిచేయడంలేదు.

# లక్ష్యం వైపు వడివడిగా అడుగులు



పెద్దపల్లి: ప్రభుత్వం సీఎంఆర్(కస్టమ్ రైస్ మిల్లింగ్) కింద ఇచ్చే లెవీ కోటాను పూర్తి చేయడానికి ఏళ్ల తరబడి జాప్యం చేసే మిల్లర్లు గడిచిన వానాకాలం కోటాను ఇవ్వడానికి మాత్రం పోటీ పడుతున్నారు. ప్రారంభించిన మూడు నెలల వ్యవధిలోనే లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో ఇప్పటికే 62 శాతం పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకంతో పౌర సరఫరాల విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బియ్యం సేకరణ చేపట్టడంతో అందివచ్చిన అవకాశాన్ని మిల్లర్లు వినియోగించుకుంటున్నారు.

**వారికి అవసరం.. వీరికి అవకాశం**

గత వానాకాలంలో సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున ప్రభుత్వం బోనస్ చెల్లించింది. ఈ మేరకు సేకరించిన ధాన్యంతోనే సన్న బియ్యం పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో రెండు నెలలుగా లెవీ సేకరణపై దృష్టి సారించింది. సన్న ధాన్యం తీసుకున్న మిల్లర్లు నిర్దేశిత సమయంలో సీఎంఆర్ కోటాను పూర్తి చేయడానికి లక్ష్యాన్ని నిర్దేశించడంతో పాటు ఎప్పటికప్పుడు మిల్లుల్లో నిల్వలపై తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రభుత్వానికి సన్న బియ్యం అత్యంత అవసరమైనందున నాణ్యతా ప్రమాణాలపై పౌర సరఫరాల అధికారులు కాస్త ఉదాసీనంగా ఉంటారన్న భావనతో కోటాను త్వరితగతిన పూర్తి చేయడానికే మిల్లర్లు మొగ్గు చూపుతున్నారు.

**మొదటిసారి బ్యాంకు గ్యారంటీ విధానం**

2018 సీజన్‌కు సంబంధించిన కోటాను ఇప్పటికీ కొందరు మిల్లర్లు పూర్తి చేయలేదు. వీరికి జూన్ 6 వరకు ప్రభుత్వం గడువు పొడిగించింది. నిబంధనల మేరకు ప్రతి సీజన్‌కు సంబంధించిన లెవీ కోటాను మరుసటి సీజన్ ప్రారంభమయ్యే నాటికి పూర్తి చేయాలి. ఇందుకోసం అధికారులు సమీక్షలు నిర్వహిస్తూనే మిల్లర్లకు లక్ష్యాలు నిర్దేశిస్తున్నారు. 2022-23 యాసంగిలో మిల్లర్లకు ప్రభుత్వం 3,53,764 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించింది. బియ్యం సకాలంలో ఇవ్వకపోవడంతో మిల్లర్ల వద్ద మిగిలిపోయిన 2.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కోసం వేలం నిర్వహించారు. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఈ ఏడాది మొదటిసారి బ్యాంకు గ్యారంటీలు ఇచ్చిన మిల్లర్లకే ధాన్యం కేటాయిస్తోంది.

**నాణ్యతపై దృష్టి సారించాల్సిన తరుణమిదే**


బియ్యపు గింజ పరిమాణంతోపాటు రంగు, నూక శాతం తదితర అంశాలపై ఎఫ్‌సీఐ కఠినంగా వ్యవహరిస్తోంది. నాణ్యతలో ఏమాత్రం తేడాలున్నా నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పౌర సరఫరాల శాఖ మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించడం మిల్లర్లకు కలిసివస్తోంది. ప్రస్తుతం సేకరిస్తున్న బియ్యం మొత్తం రేషన్ దుకాణాలకే చేరుతుండటం లెవీ ప్రక్రియ వేగవంతమయ్యేందుకు దోహదపడుతుంది. ఈ పరిస్థితుల్లో రేషన్ దుకాణాల్లోని బియ్యంలో నూక శాతం పెరగకుండా చూడాల్సిన బాధ్యత పౌరసరఫరాల శాఖదే.

# గనుల్లో అక్రమాలకు చెక్



సిరిసిల్ల: ప్రభుత్వం గనుల లీజు బకాయిల చెల్లింపులకు ఓటీఎస్ (వన్‌టైం సెటిల్‌మెంట్) విధానం తీసుకొచ్చింది. ఇటీవల ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే మార్గాలపై అధికారులు దృష్టిసారించారు. అందులో గనులశాఖలో ఏళ్ల తరబడి సీనరేజీ రూపంలో రావాల్సిన ఆదాయంపై అధ్యయనం చేశారు. ఉమ్మడి జిల్లాలో నిబంధలకు విరుద్ధంగా గ్రానైట్, బిల్డింగ్ స్టోన్, రోడ్‌మెటల్ తవ్వకాలు జరుపుతున్న 91 గనులను ఇదివరకే గుర్తించారు. వీటిపై ఈటీఎస్ (ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్) సర్వేసైతం చేపట్టారు. అక్రమాలు జరిగిన క్వారీలను గుర్తించి జరిమానాలు విధిస్తూ నోటీసులు జారీ చేశారు. మరికొన్నింటిని నిషేధిత జాబితాలో చేర్చారు. ఏడాదిలోపు ఓటీఎస్ ద్వారా రాయితీలు, వాయిదాలతో గనుల యజమానులు జరిమానాలను చెల్లించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా సిరిసిల్ల, కరీంనగర్‌లోని పలు క్వారీల్లో ఉల్లంఘనలు ఎక్కువగా జరిగినట్లు అధికారులు గుర్తించారు. వీటిలో లీజు గడువు దాటినా.. హద్దులు మీరి తవ్వకాలతోపాటు అనుమతి తీసుకోకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పన్నులు ఎగవేస్తున్నట్లు గుర్తించారు. ఇలా ఒక్క రాజన్నసిరిసిల్ల జిల్లాలో రూ.129 కోట్ల బకాయిలను గనులశాఖ గుర్తించింది. కరీంనగర్, జగిత్యాల జిల్లాలోనూ భారీగానే ఉన్నాయి. క్వారీల అనుమతులు ఇచ్చిన విస్తీర్ణంలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపిన వాటికి సీనరేజీపై ఐదు రేట్లు ఎక్కువ జరిమానా విధించారు. ఓటీఎస్‌లో రెండింతలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. కొన్నిచోట్ల ఒక చోట అనుమతి తీసుకుని మరోచోట తవ్వకాలు జరిపినట్లు ఈటీఎస్ సర్వేలో గుర్తించారు. ఇప్పటికీ బ్లాక్‌చేసిన క్వారీలు తమ జరిమానాలో 20 శాతం చెల్లించి నిషేధిత జాబితా నుంచి తొలగించుకోవచ్చు. మిగతా జరిమానాను ఏడాదిలోపు నాలుగు వాయిదాల్లో చెల్లించవచ్చు. **నివేదికలు పంపుతున్నాం** జిల్లాలో 20 క్వారీల్లో ఈటీఎస్ సర్వే చేశాం. వాటిపై లీజుదారులకు నోటీసులు అందజేశాం. ఇప్పటి వరకు ఆరుగురు తవ్వకాలు జరిపి, విక్రయించిన మెటీరియల్‌పై నివేదిక సమర్పించారు. ప్రభుత్వ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు మినహా యించి మిగతా ఎంత చెల్లించాల నేది లెక్కతేల్చాల్సి ఉంది. మరికొం దరు యజమానులు ముందుకొచ్చి జరిమానా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఓటీఎస్ విధానంలో పురోగతిపై ప్రతివారం రాష్ట్ర ఉన్నతాధికా రులకు నివేదికలు పంపుతున్నాం.క్రాంతికుమార్, గనుల శాఖ ఏడీ, రాజన్నసిరిసిల్ల

# గిరిజన గ్రామం.. ఉద్యోగుల నిలయం



కోనరావుపేట: అదో మారుమూల అటవీ ప్రాంతంలోని గిరిజన గ్రామం. మూడు దశాబ్దాల క్రితం ఇక్కడి ప్రజలు జీవనం సాగించడానికి అటవీ ప్రాంతంపై ఆధారపడేవారు. మొర్రి, తునికి పండ్లు, ఇప్ప పువ్వు సేకరణ, వంట చెరకు విక్రయించి జీవనం సాగించేవారు. తండాలో కనీస సౌకర్యాలు లేవు. విద్యతోనే అభివృద్ధి, గుర్తింపు, విలువ లభిస్తుందని... తల్లిదండ్రుల కష్టాలకు పరిష్కారం లభిస్తోందని ఇక్కడి యువత భావించారు. కాలినడకన కిలో మీటర్ల దూరం వెళ్లి చదువు కొనసాగించారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. ఉన్నత విద్య అభ్యసిస్తూ పోటీ పరీక్షలు రాసి ప్రతిభ చాటుతున్నారు. ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై ఆదర్శంగా నిలుస్తున్నారు.

**140 జనావాసాలు... 80కి పైగా ఉద్యోగులు**

కోనరావుపేట మండలం జైసేవాలాల్ గిరిజన తండా. వట్టిమల్ల గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామంగా కొనసాగింది. గత ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయగా జైసేవాలాల్ గిరిజన తండా గ్రామ పంచాయతీగా ఏర్పడింది. గ్రామంలో 612 మంది జనాభా ఉండగా వీరిలో 317 పురుషులు, 304 స్త్రీలు ఉన్నారు. 140 జనావాసాలు ఉండగా 80 పైగా వివిధ విభాగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో ప్రభుత్వ ఉపాధ్యాయులు-12, బ్యాంకు ఉద్యోగులు-5, వివిధ ప్రభుత్వ శాఖలు-12, వైద్య వృత్తి-1, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్-52 మంది పనిచేస్తున్నారు. తండా ప్రజలు స్థానికంగా వరిసాగు చేస్తూ మెరుగైన దిగుబడి సాధిస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉద్యోగులందరూ సంఘంగా ఏర్పడి గ్రామంలోని యువతకు తోడ్పాటు అందిస్తున్నారు. ఉన్నత చదువులు అభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న వారికి సూచనలు, సలహాలు ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. గ్రామాభివృద్ధికి సైతం సహకరిస్తున్నారు.

**1989లో ఉద్యోగం సాధించా**నేను 7వ తరగతి చదువుతుండగానే 1989లో యూనియన్ బ్యాంకు మెట్‌పల్లి శాఖలో అటెండర్‌గా ఉద్యోగం సాధించా. నిమ్మపల్లిలో ప్రాథమిక విద్య అభ్యసించడానికి సుమారు 5 కిలోమీటర్లు కాలినడకన వెళ్లా. తల్లిదండ్రులు పడుతున్న కష్టం, ఉద్యోగంతోనే కుటుంబ భద్రత, గుర్తింపు లభిస్తుందని భావించా. సర్కారు కొలువు సాధంచడమే లక్ష్యంగా చదివాను. ప్రస్తుతం కరీంనగర్ యూనియన్ బ్యాంకులో బ్రాంచి మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నా. భూక్యా బీమ్లానాయక్, యూనియన్ బ్యాంకు మేనేజర్, కరీంనగర్

**కష్టపడి చదివితే విజయం** తండా నుంచి సర్కారు కొలువు సాధించిన వారిని ఆదర్శంగా తీసుకున్నా. డీఎస్సీ 2002లో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యా. ప్రస్తుతం గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. నేటి యువత చదువుకోవడానికి ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోంది. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా కష్టపడి చదవాలి.

శర్మాన్ నాయక్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

# ఉన్నవి తాగునీటికే..

మామడ: మండుతున్న ఎండలకు రోజురోజుకూ నీటి వనరుల్లో జలమట్టం తగ్గిపోతోంది. చిన్న కుంటల నుంచి పెద్ద జలాశయాల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. పలు జిల్లాలకు తాగు, సాగు నీటిని అందించే శ్రీరామసాగర్ ప్రాజెక్టుపైనా వేసవి ప్రభావం భారీగానే కనిపిస్తోంది. ప్రస్తుతం సరస్వతి కాలువకు మినహా మిగతా వాటికి నీటి విడుదల నిలుపుదల చేశారు. ఉన్న కాస్త నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు.

**ఆ జలం ఎంతో విలువైనది**

మిషన్ భగీరథ ద్వారా పోచంపాడు ప్రాజెక్టు నుంచి నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాలకు నీటి సరఫరా అవుతోంది. వేసవిలో వందలాది గ్రామాలకు ఆ నీరే ఆధారం. ప్రస్తుత ఎద్దడి



పరిస్థితుల దృష్ట్యా ఎక్కడా చుక్క నీరు వృథా చేయకపోవడం మంచిది. ఇప్పటికీ చాలా మంది కుళాయిలను అలానే వదిలేస్తున్నారు. పైప్‌లైన్ల లీకేజీలను పట్టించుకోవట్లేదు. ప్రాజెక్టు ఎండుతున్న తీరు, అక్కడ నీటిని విడుదల చేసేందుకు చేస్తున్న కసరత్తు, వర్షాకాలం వరకు సర్దుబాటుకు చేసే ప్రణాళిక గమనిస్తే ఎంత పొదుపుగా వాడాలో తెలుస్తుంది.

**రోజుకు 360 క్యూసెక్కులు..**

ప్రాజెక్టు సామర్థ్యం 80.5 టీఎంసీలుకాగా ప్రస్తుతం 11.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జిల్లాలో వరి పంట చివరి దశలో ఉన్నందున సరస్వతి కాలువకు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథ కోసం 231 క్యూసెక్కులు(ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు 63) వదులుతున్నారు. ఎత్తిపోతల పథకాలు, ఇతర కాలువలకు నిలిపివేశారు. రోజుకు 359 క్యూసెక్కుల నీరు ఎండలకు ఆవిరవుతోంది. జలాశయంలోకి 1 జూన్ 2024 నుంచి ఇప్పటి వరకు 289.345 టీఎంసీల నీరురాగా 285.515 టీఎంసీలు బయటకు విడుదలైంది. వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చే వరకు ఉన్న నీటిని లెక్కలేసుకుంటూ వాడుకోవాల్సిందే..

# పైసల 'పంచాయతీ'

మామడ : గ్రామపంచాయతీ కార్యాలయాల కోసం భవనాలు మంజూరు కావడంతో స్థానికులు సంతోషపడ్డారు. అప్పటి సర్పంచులు, ఇతర వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ పనులు కదా పని చేస్తే బిల్లు వస్తుందని భావించారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టారు. నిర్మించి నెలలు గడుస్తున్నా డబ్బులు రాక తెచ్చిన చోట వడ్డీ కట్టేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. తమ ఆస్తులు అమ్ముకునే దుస్థితి నెలకొందని వాపోతున్నారు.భవనాలు నిర్మించి అప్పులపాలయ్యాం. మాకు బిల్లులు ఇప్పించండంటూ గిరిజనులంతా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. దాదాపు ఆరు నెలల క్రితమే వీరంతా రాష్ట్ర సచివాలయానికి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయినా ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు.

జిల్లాలో ఐటీడీఏ నుంచి దాదాపు అన్ని పంచాయతీ భవనాలను నిర్మించిన వారు మధ్యతరగతికి చెందిన వారే. చేసిన అప్పులను ఎలా చెల్లించాలో తెలియక తలపట్టుకుంటున్నారు. నిధులు రాక బయట తిరిగే పరిస్థితి లేదని మొండిగుట్ట పంచాయతీ మాజీ సర్పంచి కిచ్యానాయక్ వాపోయారు.సారంగాపూర్ మండలం కుప్టితండా, పొట్యాతోపాటు జిల్లాలోని మరో రెండు చోట్ల పనులు వంద శాతం పూర్తి చేశారు. వాటిలో కార్యాలయాలు సైతం నిర్వహిస్తున్నారు. అలాంటి చోట్లా డబ్బులు ఇవ్వకపోవడం శోచనీయం.

ఈ చిత్రంలో కనిపిస్తున్న గ్రామపంచాయతీ భవనం మామడ మండలం రాసిమెట్ల గ్రామానిది. దీనిని స్థానికుడు రూప్‌సింగ్ అనే వ్యక్తి నిర్మించారు. ఏడాది క్రితమే ఈ పని పూర్తి దశకు చేరుకుంది. ఇందుకు ఆయన రూ.15 లక్షలకుపైగానే ఖర్చు చేశారు. ఇప్పటికీ ఆయనకు ప్రభుత్వం నుంచి నయా పైసా రాలేదు. అప్పు తెచ్చిన డబ్బులకు నెలకు రూ.30 వేల వరకు వడ్డీ చెల్లించాల్సి వస్తోందని రూప్‌సింగ్ వాపోతున్నారు. చేతిలో చిల్లి గవ్వ లేక మిగిలిన కొద్ది పనులను ఆపేశారు. వ్యవసాయంలో వచ్చిన పైసలూ బాకీలు కట్టేందుకే పోతున్నాయని తన దయనీయ పరిస్థితిని వివరించారు.

ఎస్టీ ఎస్డీఎఫ్‌లో జిల్లాలో నిర్మించిన భవనాల వివరాలు
మంజూరైన మొత్తం గ్రామ పంచాయతీలు 42
పనులు చివరి దశకు చేరుకున్నవి 26
పూర్తయినవి 04 పనులు ప్రారంభం కానివి 12
ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు దాదాపు రూ.6 కోట్లు

# కేంద్ర సిలబస్ బోధనకు వేళాయె

కొత్తగూడెం : సింగరేణి తొలిసారి తన సొసైటీకి చెందిన ఓ విద్యాసంస్థలో సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్‌ను ప్రవేశపెడుతోంది. గతేడాది కాలంగా ఈఆలోచన చేస్తోంది. ఈనేపథ్యంలో రామగుండం-2 ఏరియాలోని సెక్టార్-3 పాఠశాలలో సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేస్తామంటూ కొద్దినెలల క్రితం 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్' బోర్డు అనుమతి కోరింది. ఆ బోర్డు ఈనెల 19న అనుమతి పత్రాన్ని మంజూరు చేసింది. దీంతో 'సెక్టార్-3'లో కేంద్ర సిలబస్ బోధన కొత్త విద్యా సంవత్సరం నుంచి కొనసాగనుంది. **అభిప్రాయ సేకరణ** సింగరేణికి తొమ్మిది పాఠశాలలున్నాయి. వాటిల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని కొన్నేళ్లుగా డిమాండ్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో గతేడాది ఏప్రిల్‌లో సంస్థ ఉద్యోగుల అభిప్రాయాలను సేకరించింది. 70 శాతం మంది పిల్లల తల్లిదండ్రులు కేంద్ర సిలబస్ వైపు మొగ్గుచూపారు. దీంతో ప్రయోగాత్మకంగా ఒక పాఠశాలలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టేందుకు నిర్ణయించింది. **అక్కడే ఎందుకంటే..**'సెక్టార్-3' పాఠశాల గతేడాది పది వార్షిక ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించింది. ఈ ఘనతను భూపాలపల్లి పాఠశాల కూడా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో తొలిసారిగా సీబీఎస్ఈ సెక్టార్-3 విద్యాలయాన్ని యాజమాన్యం ఎంపిక చేసింది. ప్రయత్నం ఇక్కడ విజయవంతంగా అమలైతే, రీజియన్‌కు ఒకటి చొప్పున పాఠశాలలో ప్రారంభిస్తారు. కొత్తగూడెం రీజియన్‌లో జిల్లా కేంద్రంలోని సింగరేణి ఉన్నత పాఠశాలకు ఈ అవకాశం దక్కే వీలుంది.

**దశలవారీగా అప్‌గ్రేడ్**ముందుగా 1-8 తరగతుల్లో సెంట్రల్ సిలబస్‌ను అమలు చేయనున్నారు. ఆ తర్వాత ఒక్కో ఏడాదికి పెంచుతూ పోతారు. అలా రెండేళ్లలో పదో తరగతి వరకు కొత్త విధానం అమలు అవుతుంది. ఇలా కాకుండా ఒకేసారి పది వరకు కొత్త సిలబస్‌ను బోధిస్తే ఉత్తీర్ణత శాతంపై ప్రభావం పడుతుందని ఎడ్యుకేషన్ సొసైటీ అధికారులు భావిస్తున్నారు.

**ప్రమాణాల ప్రకారం వసతులు** సీబీఎస్ఈ బోర్డు అనుమతి కావాలంటే పాఠశాలల్లో కొన్ని ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. అధునాతన గ్రంథాలయం, క్రీడాప్రాంగణం, నాణ్యమైన బోర్డులు, 40 మంది విద్యార్థుల సామర్థ్యం.. అన్ని వసతులతో కూడిన తరగతి గదులు వీటిలో ముఖ్యమైనవి. 'సెక్టార్ 3' ఆయా ఏర్పాట్లకు సంబంధించి సొసైటీ ముందే తగిన కసరత్తు చేసింది.

# బోర్డులకే పరిమితం!

సారంగాపూర్: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. యువత, విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో రూ.2.20 లక్షల వ్యయంతో ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు. సారంగాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో, బీర్‌పూర్ మండలంలోని 15 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో స్థలాభావంతోపాటు గ్రామాలకు దూరంగా ఉండడం, సరైన వసతులు లేకపోవడంతో బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు. మరిన్ని గ్రామాల్లో పరికరాలను పక్కన పడేయడంతో నిరుపయోగంగా ఉన్నాయి. క్రీడా ప్రాంగణాల్లో కబడ్డీ, వాలీబాల్ కోర్టులతోపాటు లాంగ్‌జంప్, వ్యాయామం చేసేందుకు ఒకటి, రెండు వరసల లైన్లు ఏర్పాటు చేయాలి. కానీ స్థల సమస్య ఉన్న పంచాయతీల్లో ప్రత్యామ్నాయ పద్ధతుల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. గ్రామాలకు దూరంగా,



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. చాలా ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

మ్యాడారం తండా పరిధిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం. పిచ్చిమొక్కలతో ఉన్న అటవీ ప్రాంతంలో బోర్డు ఏర్పాటు చేసి వదిలేశారు. నాయకపుగూడెం పంచాయతీ వద్ద స్థలం లేకున్నా కేవలం బోర్డు ఏర్పాటు చేశారు. ఇలా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు వినియోగంలో లేక నిధులు వృథా అయ్యాయి.

**పరికరాలు ఏమైనట్లు?**

ఆట వస్తువులను గ్రామపంచాయతీలకు అందించారు. కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయగా కొన్ని పంచాయతీలలో వస్తువులను ఏం చేశారో తెలియని పరిస్థితి. రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించిన ప్రాంగణాల తోపాటు అందించిన పరికరాలు వినియోగంలో లేకపోవడంతో యువత ఆటలకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా వినియోగంలోకి తెచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని యువకులు కోరుతున్నారు.

# నారీ.. స్వయం ఉపాధి దారి!

ఉట్నూరు : వనితలు ఆర్థికాభివృద్ధి సాధించేలా ఆయా ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఒకడుగు ముందుకేసి స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయిస్తూ ఉపాధి కల్పన దిశగా నడిపిస్తోంది. బ్యాంకులు అందించే రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, పెరటి కోళ్ల పెంపకం చేస్తూ మహిళలు స్వయం ఉపాధి పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారు ఆర్థికంగా ఎదిగేలా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెరటి కోళ్ల పెంపకం నిర్వహణ సామర్థ్యం కలిగిన మహిళా సంఘాలను గుర్తించింది. ఉట్నూరులో 34 గ్రామైఖ్య, 654 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో 6,826 మంది సభ్యులు ఉన్నారు. వారికి వారం రోజుల పాటు హైదరాబాద్‌లో టిఫిన్లు, భోజనం తయారీ, కోళ్ల పెంపకంపై శిక్షణ ఇప్పించారు. శిక్షణ పొంది ఆసక్తి కలిగిన వారికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బ్యాంకు ద్వారా రూ.2 లక్షలు రుణ సాయం అందించారు.

**ఉదయం, సాయంత్రం కిటకిట**

ఉట్నూరులోని కుమురం భీం ప్రాంగణం నిత్యం విద్యార్థులు, ఉద్యోగులతో ఉదయం, సాయంత్రం కిటకిటలాడుతూ ఉంటుంది. ఇక్కడే ఇందిరా మహిళా క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, పలు శాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, ఆయా సమావేశాలకు వచ్చిన వారు టిఫిన్, టీ, కాఫీ, సమోసా, పూరి, చపాతి, భోజనం తిని వెళ్తున్నారు. బయటి కంటే ఇక్కడే నాణ్యతతో వంటలు ఉంటున్నాయని, తక్కువ ధరలకు అందిస్తున్నారని కితాబిస్తున్నారు.

**పెరటి కోళ్లు.. ఆదాయ లోగిళ్లు**

నాటుకోళ్ల పెంపకం మహిళా సంఘాలకు మంచి ఆదాయ మార్గంగా మారింది. మార్కెట్‌లో వీటి మాంసానికి ఎక్కువ డిమాండ్ ఉండటంతో మహిళలు కూడా ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో కోడి పిల్ల ధర రూ.110



నిర్ణయించి ఒక్కో కేంద్రానికి వెయ్యి కోడి పిల్లలను పంపిణీ చేస్తున్నారు. మూడు నెలలు పెంచితే నాలుగింతల ఆదాయం వస్తోంది.

**ఆసక్తి ఉన్న వారికి చేయూతనిస్తాం**

మహిళా సమాఖ్య గ్రూపు సభ్యులు ఆసక్తి చూపితే వారికి శిక్షణ ఇప్పిస్తాం. మహిళలకు ఆర్థికంగా తోడ్పాటు ఇవ్వడమే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యం. ప్రస్తుతం ఉన్న మహిళలు ఆర్థికంగా రాణిస్తున్నారు. వారి శ్రమకు తగిన ఆదాయం వస్తోంది.

అనిల్, ఏపీఎం, ఉట్నూరు

ఖర్చులు పోనూ రూ.10 వేలు మిగులుతున్నాయి

క్యాంటీన్‌లో విద్యార్థులు, ఉద్యోగులు వచ్చి టిఫిన్, టీ, భోజనం చేయడంతో పాటు ఇంటికి పార్సిల్ తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం ఖర్చులు పోనూ నెలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు మిగులుతుండటంతో ఆనందంగా ఉంది.

బొడ్డు స్వప్న, క్యాంటీన్ నిర్వాహకురాలు, ఉట్నూరు

# కట్టేస్తున్నారు గంతలు.. అంతస్తులు



హైదరాబాద్: చట్టాలు తయారు చేయడం.. అమలు చేయడమే మా పని.. మేము మాత్రం పాటించం అన్నట్లుగా ఉంది కొందరు అధికారుల తీరు. గచ్చిబౌలిలోని గోపన్‌పల్లి గ్రామం టీఎన్జీవో కాలనీలోని వందలాది అక్రమ నిర్మాణాలే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వ అధికారులే అనుమతి లేకుండా భవనాలు నిర్మిస్తుండటం గమనార్హం.

**గుహల్లాంటి గదులు..**

మూడంతస్తులు కట్టాల్సిన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఏడు, ఎనిమిది అంతస్తులు నిర్మిస్తున్నారు. బహుళ అంతస్తుల్లో గుహల్లాంటి గదులు నిర్మించి నివాస సముదాయాలను హాస్టళ్లుగా, కో-లివింగ్ ఫ్లాట్లుగా మార్చుతున్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న టీఎన్జీవోలే ఇలా చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోపన్‌పల్లిలో కొందరు సొసైటీ సభ్యులు ఒక్కో భవనం నుంచి రూ.లక్షలు వసూలుచేసి అదనపు అంతస్తులకు అనుమతి ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. తమఇళ్లకు ఆనుకొని గోడలు కడుతున్నారని ఫిర్యాదు చేసినా సొసైటీ పట్టించుకోవట్లేదంటూ ఓఅధికారి ఇటీవల జీహెచ్‌ఎంసీని ఆశ్రయించారు.

**అద్దెల కోసం కక్కుర్తి..**

ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం గచ్చిబౌలి గోపన్‌పల్లిలో 158 ఎకరాల భూమిని కేటాయించింది. మొదటిదశ లేఅవుట్‌లోని ఇళ్ల స్థలాలన్నీ రిజిస్ట్రేషన్ అయ్యాయి. వాటికి బల్దియా నుంచి నిర్మాణ అనుమతులు జారీ అవుతుండగా దాదాపు 99శాతం భవనాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణమవుతున్నాయి. రెండో దశ లేఅవుట్‌లోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ నిలిచిపోవడంతో యజమానులకు నిర్మాణ అనుమతులు మంజూరు కావడం లేదు. అయినా కొందరు ఇల్లు కట్టుకోండి తాము అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. అంతస్తుకు రూ.4 లక్షల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గోపన్‌పల్లిలో ఇంటి అద్దె విలువ విపరీతంగా పెరిగింది. అదే అదనుగా ఖాళీ స్థలాల యజమానులు 7, 8 అంతస్తులు నిర్మించి భవనాల్లో హాస్టళ్లను నడిపిస్తున్నారు. కొందరు హొటళ్లు, వ్యాయామశాలలు, కో-లివింగ్ కేంద్రాలను నడిపిస్తున్నారు.

**నిబంధన ప్రకారం..**

120 గజాల నుంచి 240గజాల విస్తీర్ణంలోని స్థలంలో జీం2 నిర్మాణానికి మాత్రమే అనుమతి ఉంటుంది. ఇంటి ముందు కనీసం 1.5 మీటర్ల సెట్ బ్యాక్ వదలాలి. మిగిలిన మూడు వైపులా ఒక మీటరు సెట్‌బ్యాక్ వదలాలి. గోపన్‌పల్లి టీఎన్జీవో కాలనీలో ఆయా నిబంధనలు భూతద్దం పెట్టి వెతికినా కనిపించవు. ఉన్నంతలో ఇల్లు కట్టుకుని ఉంటున్న అధికారులకు ఈ అక్రమ నిర్మాణాలు తలనొప్పిగా మారాయి. రాజేంద్రనగర్, వనస్థలిపురం ప్రాంతాల్లోని ఎన్‌జీవో కాలనీల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి.

# స్వచ్ఛ సాగర్ కలేనా?



హైదరాబాద్: హుస్సేన్‌సాగర్ కంపుకొడుతోంది. సేద తీరుదామని వచ్చే సందర్శకులు క్షణం నిల్చోలేని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ పేరుకుపోయిన మురుగుతో ముక్కు పుటాలదిరేలా ఘాటు వాసనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. లుంబినీ పార్కు, సెక్రటేరియట్, ఎన్టీఆర్ గార్డెన్, నెక్లెస్ రోడ్డు, జలవిహార్, పీపుల్స్‌ప్లాజా వచ్చే సందర్శకులకు ఇబ్బందిగా మారింది.

**500 ఎంఎల్‌డీల మురుగు..**

నిత్యం 500 ఎంఎల్‌డీల వ్యర్థ జలాలు సాగర్‌లో కలుస్తుండగా, సెలవు రోజుల్లో శుద్ధి చేయకుండానే వదులుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. బాలానగర్, జీడిమెట్ల, పాశమైలారం పారిశ్రామికవాడల నుంచి రసాయనాలు నేరుగా సాగర్‌లో కలుస్తున్నాయి. మురుగు లేని, దుర్వాసన రాని సాగర్ కోసం ఏటా ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా, సమస్య పునరావృతమవుతోంది. సాగర్‌లో మురుగు చేరుతుండటంతో నీటిలో కరిగిన ఆక్సిజన్ పరిమాణం క్రమంగా తగ్గుతోంది. సాధారణంగా లీటరు నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ పరిమాణం 4 ఎంజీలు ఉండాలి. స్థానికంగా 3.2 మాత్రమే ఉంది. బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ) లీటరు నీటిలో 3 ఎంజీల కంటే తక్కువ ఉండాలి. కానీ పరిమితికి మించి ఉంది.

**విముక్తి ఇలా..**

ఎగువ నుంచి జలాశయంలోకి వచ్చే మురుగు, వ్యర్థ జలాల కట్టడి.


జలాశయంలో నీటిని ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్ అవసరాలకు వాడుకునేలా శుద్ధి చేయడం

పికెట్ నాలా వద్ద 30 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగుశుద్ధి కేంద్ర నిర్మాణం

హుస్సేన్‌సాగర్ వద్ద ఉన్న ఎస్టీపీల ఆధునికీకరణ

శుద్ధి చేసిన నీరు మాత్రమే జలాశయంలోకి చేరేలా ఏర్పాటు, వ్యర్థాల తొలగింపు జలాశయంలో నేరుగా పూజా సామగ్రి పడేయకుండా ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు.

# విద్యార్థులూ.. ముందే సిద్ధం చేసుకోండి



మంథని : ఇది ఫలితాల సమయం.. ఇంటర్, పదో తరగతి, జేఈఈ మెయిన్, అడ్వాన్స్, ఈఏపీసెట్, పాలిసెట్.. ఇలా అకాడమిక్, ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటి ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు వివిధ ధ్రువపత్రాలు అవసరమవుతాయి. ఇందులో ఈడబ్ల్యూఎస్(ఎకనామికల్లీ వీకర్ సెక్షన్) ఒకటి. విద్య, ఉద్యోగావకాశాల్లో అగ్ర వర్ణాల్లోని పేదలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తున్నందున ఈ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. దరఖాస్తు గడువు సమీపించాక కార్యాలయాలకు పరుగు తీసే బదులు ముందే సిద్ధం చేసుకుంటే ఒత్తిడి ఉండదు. ప్రవేశాలు ఆరంభమయ్యే సమయంలో తీసుకుంటే సాంకేతిక సమస్యలతో జాప్యం జరిగే ప్రమాదం ఉంది.

**దరఖాస్తుకు జత చేయాల్సినవి**

ఆధార్, అభ్యర్థి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, రేషన్ కార్డు, అఫిడవిట్, ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల హామీ పత్రాలు జత చేసి మీ సేవ కేంద్రాల్లో నిర్ణీత రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ, డీటీ, తహసీల్దారు తనిఖీ చేసి, 15 రోజుల్లో ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు.

**అర్హులు ఎవరు?**

కుటుంబ సభ్యుల(తల్లిదండ్రులతో పాటు 18 సంవత్సరాలకు పైబడిన వారందరు) మొత్తం ఆదాయం ఏడాదికి రూ.8 లక్షలలోపు ఉండాలి. 5 ఎకరాలలోపు భూమి కలిగి ఉండాలి. నివాస గృహం 1000 చదరపు అడుగుల కన్నా తక్కువ విస్తీర్ణంలో ఉండాలి.

ఇంటి స్థలం పంచాయతీల్లో 200 గజాల కంటే, పురపాలిక/నగరపాలికల పరిధిలో 100 గజాలలోపు ఉండాలి.

క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలు సరైనవేనని అధికారులు నిర్ధారించాల్సి ఉంటుంది.

**ఏడాది వరకు చెల్లుబాటు**క్షేత్ర స్థాయి విచారణ ఉన్నందున సరైన పత్రాలనే జత పరచాలి. అర్హులని తేలితేనే ధ్రువపత్రం జారీ చేస్తారు. ప్రవేశాల సమయానికి కాకుండా ముందుగానే దరఖాస్తు చేసుకుంటే ఆందోళన ఉండదు. ధ్రువపత్రం జారీ తేదీ నుంచి ఏడాది వరకు చెల్లుబాటవుతుంది. జి.కుమారస్వామి, మంథని తహసీల్దారు

# అందుబాటులోకి వస్తే.. ప్రాణాలకు రక్షే!

రాయపట్నం : నుంచి వెల్గటూరు మధ్యలో ద్విచక్రవాహనంపై ఇద్దరు యువకులు వెళ్తుండగా.. ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఘటనా స్థలంలోనే ఒకరు మృత్యువాత పడగా.. మరొకరిని కరీంనగర్‌కు ప్రాణాపాయ స్థితిలో తరలించారు. ఆలస్యం కావటం, సకాలంలో వైద్య సేవలందక మృత్యువాత పడ్డాడు.

ఓ యువకుడు ధర్మపురి-జగిత్యాల మధ్య నేరెళ్ల గుట్ట వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తూ లారీని తప్పించబోయి.. కల్వర్టును ఢీ కొట్టాడు. తలకు రక్తస్రావం కాగా.. జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు.

న్యూస్‌టుడే, ధర్మపురి: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ట్రామాకేర్ సెంటర్ అందుబాటులో లేకపోవటంతో రోడ్డు ప్రమాదం, ఇంకేదైనా అనుకొని సంఘటన జరిగి తలకు తీవ్ర గాయాలైతే బాధితులను హైదరాబాద్‌కు తరలించాల్సిందే. ఈ క్రమంలో సరైన సమయంలో చికిత్స అందక బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టి రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ రహదారులపై 90 ట్రామా కేర్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం పాశిగాం వద్ద 25 ఎకరాల ఖాళీ స్థలంలో



కేంద్రం ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రాష్ట్ర ఆరోగ్య మంత్రికి విన్నవించారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి ప్రతిపాదనలు పంపించేలా చర్యలు తీసుకుంటున్నారు. పాశిగాం వద్ద ట్రామా కేంద్రం ఏర్పాటుతో చొప్పదండి, ధర్మారం, పెద్దపల్లి, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్లలలో రోడ్డు ప్రమాదాల బాధితులను గంట వ్యవధిలోనే ఇక్కడికి తరలించే వీలుంటుంది.

**నిత్యం ప్రమాదాలు**

ప్రధాన రహదారులపై ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయి. అయితే సకాలంలో వైద్య అందక చాలామంది మృత్యువాత పడుతున్నారు. ధర్మపురి, జగిత్యాల రహదారులపై ప్రమాదాలు జరిగితే 70 కిమీల దూరంలోని కరీంనగర్‌కి వెళ్లేలోపు క్షతగాత్రులు ప్రాణాలు పోతున్నాయి. దీంతో ధర్మపురి నియోజకవర్గంలో ట్రామా కేర్ కేంద్రం ఏర్పాటు చేసినట్లయితే పలు ప్రాంతాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

# అత్యవసరమైతేనే.. అదీ జాగ్రత్తలతోనే..

గోదావరిఖని : ఎండలు తీవ్రం కావడంతో జిల్లా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. పనుల నిమిత్తం తప్పనిసరి పరిస్థితుల్లో మండుటెండల్లో వెళ్తూ అస్వస్థతకు గురవుతున్నారు. ఇటీవల తీవ్రమైన జ్వరం, ఒళ్ల నొప్పులు, వాంతులు, విరేచనాలతో గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రికి వచ్చేవారి సంఖ్య గత పది రోజులుగా పెరుగుతోంది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం బయటకు వెళ్లకూడదని.. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వెళ్లి పనులు చేసుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జాగ్రత్తలు తీసుకుంటేనే ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందే అవకాశముందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కథనం

**బాధితుల చికిత్సకు ఏర్పాట్లు**

తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఎండ నుంచి రక్షణగా గొడుగు ఉపయోగించాలి.

పిల్లలను మధ్యాహ్నం వేళలో ఎట్టి పరిస్థితుల్లో బయటకు వెళ్లకుండా చూడాలి. సాయంత్రం వేళల్లో మాత్రమే అనుమతించాలి. మధ్యాహ్నం క్యారం, చెస్ వంటి ఇండోర్ గేమ్స్ ఆడేలా ప్రోత్సహించాలి.

దాహం వేసినప్పుడు కూల్ డ్రింకులు, టీ, కాఫీల జోలికి వెళ్లకుండా పళ్ల రసాలు, ఓఆర్ఎస్, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగాలి.

వడదెబ్బ బాధితుల శరీరాన్ని తడిగుడ్డ, ఐస్ ప్యాక్‌తో తుడవటంతో శరీర ఉష్ణోగ్రత తగ్గించవచ్చు. గాలి తగిలేలా చూడాలి. సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించాలి.

వడదెబ్బ బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాట్లు చేశారు.



ఆసుపత్రిలో ఈ నెల 16న 957 మంది, 17న 1029 మంది ఓపీ తీసుకోగా.. అందులో సుమారు 200కు పైగా జ్వరం తదితర లక్షణాలతో చికిత్స కోసం వచ్చిన వారే ఉన్నారు. 15 నుంచి 20 శాతం మంది ఎండ తీవ్రతతో అనారోగ్యానికి గురైన పెద్దలు, పిల్లలు, వృద్ధులు ఉంటున్నారు. వీరిలో రోజు ఇద్దరు లేదా ముగ్గురు ఇన్ పేషెంట్లుగా చేరుతున్నారు.

అవయవాలపై ప్రభావం

కొద్ది రోజులుగా గోదావరిఖనిలో మూత్రపిండ బాధితుల సంఖ్య పెరుగుతోంది. వారంలో సుమారు 50 మంది మూత్రపిండ సమస్యలతో ఆసుపత్రికి వస్తున్నారు. నీరు ఎక్కువగా తాగటంతో చాలా వరకు ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు. నీరు తక్కువగా తీసుకుంటే మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి. ఎండ తీవ్రతతో డీహైడ్రేషన్ కారణంగా మూత్రపిండాలతో పాటు వివిధ అవయవాలపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.

డాక్టర్ నిశాంత్, సహాయ ఆచార్యులు (యూరాలజీ), గోదావరిఖని

చురకలు



# పల్లెల్లో ఆర్థిక సౌరభాలు

నల్గొండ : రైతులు, మహిళా సంఘాలు, ఇతరులు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అర్హులకు ప్రయోజనం అందించేందుకు పీఎం కేయిఎస్‌యుఎం-ఏ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని, బంజరు భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రెడ్కో సంస్థ అర్హత కలిగిన రైతుల నుంచి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నిలకడగా 25 సంవత్సరాల పాటు ఆదాయం పొందే ప్రాజెక్టు ఇది. ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హులెవరంటే..రైతులు(వ్యక్తిగతంగా), రైతు ఉత్పత్తి సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మండల గ్రామ సమాఖ్యలు, పంచాయతీ స్థానిక సంస్థలు భూమిని లీజుకు తీసుకొని కూడా సౌర ప్లాంట్ యూనిట్‌ను నిర్ణీత సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవచ్చు.

ముఖ్యాంశాలిలా..

మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం

ఒక్కో యూనిట్ సామర్థ్యం: 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల



వరకు.ఒక మెగావాట్ సౌర విద్యుదుత్పత్తికి మూడున్నర నుంచి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.

ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీ-ఈఆర్సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం కొనుగోలు చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: %www.tgredco.telangana.gov.in% ను సంప్రదించాలి.

పూర్తి సమాచారం, సందేహాలు నివృత్తికి..రెడ్కో జిల్లా కార్యాలయం నల్గొండలో సంప్రదించాలి. టెలిఫోన్ నంబర్: 08682 224447, చరవాణి నెంబరు: 98318 78596, 63049 03923 సంప్రదించవచ్చు.

**భూములు పరిశీలిస్తున్నాం**

పాండురంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ

ఉపయోగంలో లేని భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిపై మహిళా సంఘాలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసి సమాచారం పొందవచ్చు. కలెక్టర్ ఆదేశంతో నల్గొండ జిల్లాలో సౌర విద్యుదుత్పత్తికి కావాల్సిన ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పరిశీలించాల్సి ఉంది.

# నాణ్యతా ప్రమాణాలు పట్టేదెవరికి?

పెద్దపల్లి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉద్దేశించిన ఈ-నామ్ వ్యవస్థ వ్యాపారులకు వరంగా మారింది. పెద్దపల్లి మార్కెట్‌లో రైతులు తెచ్చిన పత్తికి నాణ్యతతో సంబంధం లేకుండా ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ విషయంలో భారత పత్తి సంస్థ(సీసీఐ) చెల్లించే మద్దతు ధరను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రస్తుత సీజన్ ఆరంభంలో 8 శాతం తేమ కలిగిన పత్తి క్వింటాలుకు రూ.7,520 ఉండగా ఇటీవల నాణ్యత తగ్గిందనే ఉద్దేశంతో సీసీఐ మద్దతు రూ.7,430కు కుదించింది. పత్తిలోని వివిధ ప్రమాణాల స్థాయిని బట్టి మద్దతు ధర అటు ఇటుగా మారుతోంది. **పట్టించుకోని అధికారులు**సీసీఐ పత్తిలో 8-12 వరకు తేమ శాతాన్ని అనుమతిస్తుంది. నిబంధనల ప్రకారం ఒక శాతం తేమ పెరిగితే ధర కూడా ఒక శాతం తగ్గుతుంది. 12 శాతం ఉంటే రూ.7,132కు కొనుగోలు చేస్తుంది. ఈ నిబంధనను వ్యాపారులకు వర్తింపజేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. శుక్రవారం పెద్దపల్లి మార్కెట్‌కు వచ్చిన పత్తిలో తేమ 18 శాతం ఉండగా ధర రూ.5003గా నిర్ణయించారు. ఈ మేరకు సంచిపై మార్కర్‌తో రాశారు. నిబంధనల ప్రకారం రూ.6,687 వరకు చెల్లించాలి. మార్కెట్‌లో నమోదైన గరిష్ఠ ధరను ప్రామాణికంగా తీసుకున్నా రూ.6,319 చెల్లించాలి. శుక్రవారం మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.7,022 వరకు నమోదైంది. అయితే ఇవేవీ వ్యాపారులకు ప్రామాణికంగా కనిపించడం లేదు.

**వ్యాపారికి నచ్చిందే ధర**

పెద్దపల్లి మార్కెట్‌లో 11 మంది క్రియాశీలక అడ్తీదారులుండగా వీరి వద్ద 7 నుంచి 8 మంది కొనుగోలుదారులు ఖరీదు చేస్తున్నారు.

వారం రోజులుగా ఇద్దరు, ముగ్గురు కొనుగోలుదారులే తీసుకుంటున్నారు. మిల్లర్లు మార్కెట్‌వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక ఆన్‌లైన్‌లో ఇతర మార్కెట్‌కు చెందిన ట్రేడర్లు కొనుగోలు చేసే స్థాయిలో వ్యవస్థం అభివృద్ధి చెందలేదు. నాణ్యతను నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేవు. సిబ్బందిని కూడా నియమించలేదు.

# బుక్కుతున్న డిపాజిత్తులు

నంద్యాల : పాములపాడు మండలం కనకయ్య కొట్టాలలో కేసీ కాల్వ 13వ డిస్ట్రిబ్యూటరీలో పనులు చేసినట్లు ఎం.బుక్కులు చేశారు. రూ.1.40 కోట్లతో చేసిన ఈ పనులకు సంబంధించి రూ.70 వేల డిపాజిట్ మొత్తం తిరిగి చెల్లించేందుకు రూ.5 వేల వరకు వసూలు చేశారు.బండి ఆత్మకూరు మండలం సంతజూటూరు నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలం వరకు జరిగిన పనులకు ఒక్కో బిల్లుకు రూ.1500 వరకు వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది.కేసీ కాల్వ పరిధిలో 2018లో చేసిన నీరు- చెట్టు పనుల డిపాజిట్ మొత్తాలకు సంబంధించి కొన్ని రోజులుగా ఎం.బుక్కులు చేస్తున్నారు. ఆయా పనులకు తుది(ఫైనల్) బిల్లు చేయాలంటే కచ్చితంగా నిర్ణీత మొత్తం లంచం ఇవ్వాల్సిందేనని కొంతమంది అధికారులు, సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే బిల్లులు చేయడం లేదని గుత్తేదారులు గగ్గోలుపెడుతున్నారు.

కార్యాలయంలో కాసుక్కూర్చున్నారు

ఉమ్మడి జిల్లా పరిధిలో కేసీ కాల్వ పొడవునా 2 వేల వరకు పనులు జరిగాయి. ఆయా పనులకు సంబంధించి గుత్తేదారులకు డిపాజిట్ మొత్తం రూ.3 కోట్ల వరకు చెల్లించాల్సిన ఉంది. నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 30 ఎం.బుక్కులకు సంబంధించి రూ.10 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. 500 మంది గుత్తేదారులకు ఒక్కొక్కరికి రూ.70 వేల నుంచి రూ.27 వేలు చొప్పున డిపాజిట్ మొత్తాలు తిరిగి ఇవ్వాల్సి ఉంది. రూ.27 వేలు రావాల్సిన గుత్తేదారుల నుంచి రూ.1500, రూ.70 వేలు రావాల్సిన వారి నుంచి రూ.2,500 వరకు కేసీ సిబ్బంది వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇవ్వకుంటే పక్కన పెట్టేస్తారుఅడిగినంత ఇవ్వకుంటే ఎం.బుక్కులు కార్యాలయాల్లోనే ఉండిపోతున్నాయి. ఈ మొత్తాలు త్వరగా ఇస్తే పే అండ్ అకౌంట్స్ కార్యాలయానికి వెళ్తాయి. లేదంటే కేసీ కార్యాలయా ల్లోనే పేరుకుపోతున్నాయి. నందికొట్కూరు, బండిఆత్మకూరు, గడివేముల, శిరివెళ్ల మండలాలకు చెందిన కొన్ని పనులకు అడిగినంత ఇవ్వకపోవడంతో రోజులకొద్దీ ఎం.బుక్కులు కార్యాలయంలోనే ఉండిపోయాయి. చివరికి గుత్తేదారులు దిగొచ్చాకే బిల్లులయ్యాయి. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ గుత్తేదారు అధికారులను ప్రసన్నం చేసుకోవడంతో పెద్ద మొత్తంలో బిల్లులు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.రూ.350 కోట్ల పనులకు చెల్లింపులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కేసీ కాల్వ పరిధిలో 2018లో నీరు- చెట్టు పనులు జరిగాయి. వీటిని సుంకేసుల ఆనకట్ట నుంచి చాగలమర్రి మండలం రాజోలి వరకు సుమారు 180 కి.మీల పొడవున చేపట్టారు. రూ.350 కోట్లు వెచ్చించి చెరువుల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్, ఆయకట్టు పరిధిలోని పొలాల్లో మట్టి రహదారులు వంటి పనులు చేశారు.

# పొదుపు మరిస్తే గడ్డుకాలమే!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో 1,218 గ్రామ పంచాయతీలు రెండు నగరపాలక సంస్థలు, 14 పురపాలికల్లో వచ్చే వేసవి నాటికి తాగునీటి కష్టాలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జనవరి నెలలోనే పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అవరోధాలు ఎదురవుతున్నాయి. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలతోపాటు పలు చెరువుల్లోని నీటిని శుద్ధి చేసి మిషన్ భగీరథ ద్వారా ఇళ్లకు నీళ్లందించే ప్రక్రియలో అక్కడక్కడ ఇబ్బందులున్నాయి. ముఖ్యంగా జగిత్యాల జిల్లాలోని 5 బల్దియాలకు, 346 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా నీళ్లందే విషయంలో లోపాలు పూర్తిగా తొలగిపోలేదు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోనూ 20శాతం గ్రామాలకు నీరందించే పథకాలదీ ఇదే పరిస్థితి. ఇంట్రా పైప్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం శాపంగా మారింది. ఇప్పటి నుంచే అధికారులు దృష్టి పెడితే వేసవిలో తాగు నీటి ఎద్దడి దరిచేరదు.

**సాగు అవసరాలకు వినియోగం**

ప్రధాన జలాశయాల్లోని నీటిని సాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎల్ఎండీ నుంచి ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని పంటలకు కాకతీయ కాలువ ద్వారా నిత్యం 4,229 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో గతేడాదితో పోలిస్తే ఈసారి ఇక్కడి జలాశయంలో నీటి మట్టం కొంత తగ్గింది. ఇదే తరహాలో వరి పంట కోసం ఏప్రిల్‌లోనూ చివరి తడికి నీళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. జాగ్రత్తగా నీటిని వినియోగించకుంటే వేసవిలో కరీంనగర్ కార్పొరేషన్‌లో తాగునీటి అవసరాలకు తిప్పలు పడాల్సి వస్తుంది. ఎల్లంపల్లి, మధ్యమానేరు జలాశయాలలో నీటి నిల్వ బాగున్నా.. పొదుపుగా వినియోగిస్తేనే వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. గతేడాదితో పోలిస్తే జగిత్యాల జిల్లాలో 15 శాతం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 6 శాతం లోటు వర్షపాతం నమోదైంది. కురిసిన వర్షాలు, నిల్వ ఉన్న నీళ్లను ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకోకుంటే తీరని నష్టం, కష్టం వాటిల్లే వీలుంది.

**లోపాలు సవరిస్తేనే!**

మిషన్ భగీరథ ద్వారా నాలుగు జిల్లాల్లో రూ.3,300 కోట్లు వెచ్చించి 1,351 నీటి ట్యాంకులను నిర్మించారు. 7,692 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. పంచాయతీలతోపాటు మరో 1,126 అనుబంధ గ్రామాలకు తాగునీటి సరఫరాను మెరుగుపర్చారు. అయితే 12 నియోజకవర్గాల పరిధిలో ఆరు గ్రిడ్‌ల ద్వారా శుద్ధ జలాలను అందించే విషయంలో ఇంకా లోపాలున్నాయి. ముఖ్యంగా 18,970 మోటార్లను ఏర్పాటు చేయగా వీటిలో నిత్యం సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రహదారులు, వాగులు, రైల్వే లైన్ల వద్ద భూగర్భ పైప్‌లైన్లలో లీకేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని నీటి సంప్‌లకు నీరు అందని దుస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఇలాంటి లోపాలను సవరించి తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. 'వచ్చే వేసవిలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా తగు శ్రద్ధ వహించాలి. ఇప్పటి నుంచే నీటి వనరుల్లో ఉన్న జలాలను సంరక్షించండి. లోపాలను సవరించుకోండి' ఇటీవల మంత్రి సీతక్క పంచాయతీ

# గుర్తింపు దక్కినా.. ఎదురు చూపులే!



మెట్‌పల్లి : మండలం ఆత్మకూర్ పల్లె దవాఖానా ఇది. 2023లో ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు దక్కింది. దీని ద్వారా మంజూరయ్యే నిధులతో మరింత అభివృద్ధి చేసుకోవచ్చని భావించారు. సుమారు రెండేళ్లు దగ్గర పడుతున్నా నిధులు విడుదల కాలేదు. నిధులు విడుదలైతే ప్రహరీ, ప్రధాన ద్వారం, ఇతర మౌలిక వసతులు, వైద్య సేవలకు అవసరమైన పరికరాలు సమకూర్చుకోవచ్చని భావిస్తున్నారు.

ప్రజలకు అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో సేవలందించడమే లక్ష్యంగా కేంద్రం జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలను(ఎన్‌క్యూఏఎస్) రూపొందించింది. ఈ ప్రమాణాలను పాటించే ప్రభుత్వ ఆసుపత్రులకు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు ఇవ్వడంతో పాటు మూడేళ్ల పాటు నిధులు మంజూరు చేస్తోంది. తద్వారా ఆయా ఆసుపత్రుల్లో వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులు మరింత మెరుగుపడి ప్రయోజనం చేకూరుతుందన్నది ఆలోచన. ఎన్‌క్యూఏఎస్ కింద మొదట్లో గుర్తింపు దక్కిన ఆసుపత్రులకు నిధులు మంజూరైనా, ఆ తర్వాత ఎంపికైన వాటికి రెండేళ్లుగా నిధులు రాలేదు. జిల్లా ఆసుపత్రులు, సామాజిక, పట్టణ, ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాల్లో అమలు చేస్తున్న ప్రమాణాలను అంశాల వారీగా తనిఖీ బృందాలు పరిశీలించి మార్కులు ఇస్తారు. వీటి ఆధారంగా ఆసుపత్రులకు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు వస్తుంది. ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు, కనీస వసతులు, రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితర నాణ్యత ప్రమాణాల ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు వచ్చిన తర్వాత ఆసుపత్రి స్థాయిని బట్టి మూడేళ్ల పాటు నిధులు విడుదల చేస్తారు. 2018 నుంచి ఎన్‌క్యూఏఎస్‌కు ఎంపికవుతుండగా మొదట్లో ఎంపికైన ఇబ్రహీంపట్నం, మేడిపల్లి, కథలాపూర్ పీహెచ్‌సీలకు నిధులు మంజూరయ్యాయి. ఆ తర్వాత మళ్లీ రెండోసారి ఈ మూడు ఎన్‌క్యూఏఎస్‌కు అర్హత సాధించాయి. వీటితో పాటు దశల వారీగా మరిన్ని పీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలు, పల్లె దవాఖానాలకు గుర్తింపు దక్కింది. రెండేళ్లుగా నిధులు విడుదల కావడం లేదని తెలుస్తోంది. నిధులు విడుదల చేస్తే ఆసుపత్రుల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందేలా దోహదపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎన్‌క్యూఏఎస్‌కు ఎంపికైన ఆసుపత్రులు

ఎంసీహెచ్ జగిత్యాల పీహెచ్‌సీలు - 6

యుపీహెచ్‌సీలు - 3

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు (పల్లె దవాఖానా) - 14

రెండు పల్లె దవాఖానాలకు..

- ఎన్.శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి

జిల్లాలో ఎన్‌క్యూఏఎస్ గుర్తింపునకు ఆసుపత్రులు ఎంపికవుతున్నాయి. ఇటీవల రెండు పల్లె దవాఖానాలకు గుర్తింపు వచ్చింది. ఎన్‌క్యూఏఎస్ గుర్తింపుతో మరింత ప్రయోజనం ఉంటుంది. త్వరలోనే నిధులు విడుదలవుతాయి.

# పేదలకు ఆవాసయోగం

సిరిసిల్ల: జిల్లాలో పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. స్థలం ఉండి ఇళ్లులేనివారికి ఎంపిక చేసిన గ్రామాల్లో ఇళ్లు మంజూరు చేసింది. స్థలంలేని వారికి గతంలో అసంపూర్తి దశలో నిలిచిపోయిన రెండు పడక గదుల నిర్మాణాలను పూర్తిచేసి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనికి ఇటీవల బడ్జెట్లో నిధులు కేటాయించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో నిధులు విడుదల చేయనున్నారు.

**అసంపూర్తి దశలో 702 గృహాలు**

జిల్లాలో 6,886 రెండు పడక గదుల ఇళ్లు మంజూరుకాగా అందులో 3,546 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 3,448 గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 702 ఇళ్లు అసంపూర్తి దశలో నిలిచిపోయాయి. వీటిలో సిరిసిల్ల నియోజకవర్గంలో 558, వేములవాడలో 144 ఇళు ఉన్నాయి. వీటిని పూర్తి చేయనున్నారు. జిల్లాలో రెండు పడక గదుల నిర్మాణ వ్యయం రూ.248.9 కోట్లు కాగా ఖర్చు చేసింది రూ.188.49 కోట్లు.నిర్మాణాలు పూర్తయినా.. కొన్ని చోట్ల మౌలిక వసతుల్లేక పంపిణీ జరగలేదు. లబ్ధిదారుల ఎంపిక కూడా జరిగింది. కారణం మౌలిక వసతుల్లేవు. గత ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.5.04 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.5.30 లక్షలు కేటాయించింది. అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్యుత్తు, తాగునీరు వంటి కనీస వసతుల కల్పనకు ఒక్కోఇంటికి రూ.75 వేలు అదనంగా కేటాయించారు.రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైన చోట మౌలిక వసతుల కల్పన కోసం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల కోసం రూ.151 కోట్లు, పట్టణ ప్రాంతాల కోసం రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వాటిలో వివిధ దశలో రూ.24 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. మౌలిక వసతులు కల్పిస్తే మరికొన్ని గృహాలు లబ్ధిదారులకు



అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రభుత్వం ఇటీవలి బడ్జెట్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యమిచ్చింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పేర్కొన్న ఆరు గ్యారంటీల్లో ఒక్కటైన ఇందిరమ్మ ఇళ్లను సాధ్యమైనంత ఎక్కువగా నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులను ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. వాటిని ఎల్-1, 2, 3 విభాగాల్లో ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. వీటిలో ఎల్-1లో స్థలం ఉన్నవారు. దీనిలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఇళ్లు మంజూరు చేశారు. ఎల్-2లో సొంత స్థలంలేని వారిని గుర్తించారు. ఎల్-3 జాబితాలోని దరఖాస్తులను ప్రభుత్వం ఏఐ (కృత్రిమ మేధ) ద్వారా మరోసారి పరిశీలించనుంది. దీనిలో గతంలో ఇందిరమ్మ ఇళ్లు పొందినవారు, ఇళ్లు, వ్యవసాయ స్థలాలు, ఇతర ఆస్తులు ఉన్నవారిని గుర్తిస్తుంది. దీనిలో ఏది ఉన్నా ఇళ్లు మంజూరు కాదు.

# కళ.. కలేనా..?

నారాయణగూడ: పబ్లిక్‌గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్ పదేళ్ల క్రితం వరకు చిన్నారులతో కళకళలాడింది. ప్రస్తుతం చిన్నారుల సందడి లేక వెలవెలబోతోంది. పిల్లలు వేసవి సెలవులను బాలభవన్‌లో ఆస్వాదిస్తారు. 1966లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దీన్ని ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా వేసవి శిబిరాలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించేవారు. బాలభవన్ తరఫున 'బాలశ్రీ, బాలసూర్య, బాలరత్న' పురస్కారాలు అందించేవారు. ప్రస్తుతం అవి లేవు. ప్రతినెలా బీసీ, ఓసీ పిల్లలకు నామమాత్రపు రుసుము రూ.50, ఎస్సీ, ఎస్టీ పిల్లలకు రూ.20 ఉండేది. ప్రభుత్వ పాఠశాలల నుంచి పిల్లలను బాలభవన్‌కు బస్సులో తీసుకొచ్చేవారు. ఇప్పుడా బస్సు నిరుపయోగంగా మారింది.



పోస్టులన్నీ ఖాళీ..బాలభవన్‌లో లైబ్రేరియన్, చిత్రలేఖనం, విజ్ఞానశాస్త్రం, తబలా గురువులు మినహా అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వారిలో ఒకరు జూన్‌లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. సంగీతం, తబలా, మృదంగం, కథక్, కూచిపూడి, జానపదం, నాటకం, కరాటే, స్కేటింగ్ గురువులు కావాలి. జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, ఆంగ్లం, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులను ఇక్కడికి పంపించారు. ఒకే పోస్టులో ముగ్గురు సైన్స్ టీచర్లున్నారు. ఒక ఉపాధ్యాయురాలికి రాష్ట్రస్థాయి బాధ్యతల్ని అప్పగించడంపై విమర్శలున్నాయి. మరో ఎస్జీటీ టీచర్‌ను లైబ్రేరియన్‌గా పంపించారు. పదేళ్లుగా ఇన్‌ఛార్జి డైరెక్టర్.. ఇంతకుముందు బాలభవన్‌కు ప్రత్యేకంగా డైరెక్టర్ ఉండేవారు. పదేళ్లుగా అదనపు బాధ్యతలతో ఈ వ్యవస్థ కొనసాగుతోంది.

# గోదావరి జలాల విడుదల

అశ్వాపురం : భీమునిగుండం కొత్తూరు సీతారామ ఫేజ్-1 పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను అధికారులు విడుదల చేశారు. ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ఫేజ్-2 పంప్‌హౌస్ వైపు నీళ్లు పయనిస్తున్నాయి. ములుగు జిల్లా తుపాకులగూడెంలో సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి విడుదల చేసిన 1,200 కూసెక్కుల గోదావరి జలాలు దుమ్ముగూడెం ఆనకట్టను చేరుకొని పొంగిపొర్లుతున్నాయి. బెల్‌మౌత్ వద్ద గోదావరికి, సీతారామ ప్రధాన కాల్వకు మధ్యనున్న మట్టి కట్ట తొలగింపు పనులు పూర్తయ్యాయి. గోదావరి జలాలు సీతారామ ప్రధాన కాల్వలోకి ప్రవేశించాయి. అమెర్దా వద్ద సీతారామ హెడ్ రెగ్యులేటర్ ద్వారాలను అధికారులు తెరిచారు. గోదావరి జలాలు



భీమునిగుండం కొత్తూరు ఫేజ్-1 పంప్‌హౌస్‌కు చేరుకున్నాయి. పంప్‌హౌస్‌లోని ఏ-3 విద్యుత్తు మోటారును ఆన్ చేసి డెలీవరీ సిస్టర్న్ ద్వారా సీతారామ రెండో ప్యాకేజీ ప్రధాన కాల్వలోకి విడుదలవుతున్నాయి. అక్కడి నుంచి పూసుగూడెంలోని ఫేజ్-2 పంప్‌హౌస్, కమలాపురంలోని సీతారామ ఫేజ్-3 పంప్‌హౌస్‌కు చేరుకుంటాయి. జలవనరులశాఖ ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆనకట్ట పైనుంచి గోదావరి జలాలు పొంగిపొర్లుతుండటంతో సీతారామ ప్రధాన కాల్వలోకి విడుదల చేస్తున్నామని తెలిపారు.

# విపత్తు దళం.. సింగరేణి బలం

శ్రీరాంపూర్: విపత్తుల సమయంలో ఆదుకోవడంలో సింగరేణి రెస్క్యూ సిబ్బందికి దేశవ్యాప్త గుర్తింపు ఉంది. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది ఆచూకీ కోసం శ్రమిస్తున్న సైన్యం, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు సింగరేణి నుంచి వంద మంది రెస్క్యూ బృందం ఉంది. ఎన్‌డీఆర్ఎఫ్‌తోపాటు సింగరేణి బృందం వెంటనే అక్కడికి వెళ్లి సహాయ పనుల్లో నిమగ్నమైంది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి దాదాపు 60 మంది రక్షక చర్యల్లో పాల్గొన్నారు.

సింగరేణి యాజమాన్యం రెస్క్యూ బృందాలను అత్యంత సమర్థంగా ఖర్చుకు వెనుకాడకుండా తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతం సింగరేణిలో 483 మంది సుశిక్షితులైన రెస్క్యూ సిబ్బంది ఉన్నారు. వీరంతా భూగర్భ గనుల్లో తమ రోజువారీ విధులు నిర్వర్తిస్తూనే, విపత్తుల సమయంలో సేవలు అందించడానికి ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందుతారు. కోల్ ఇండియా వెలికితీసే ఉత్పత్తిలో పది శాతం బొగ్గు ఉత్పత్తి చేసే సింగరేణి రెస్క్యూ సేవల్లో మాత్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ఉండే ఐఆర్ఎంబీ (ఇంటర్నేషనల్ మైన్స్ రెస్క్యూ బాడీ)లో కోల్ ఇండియాకు దక్కని సభ్యత్వం సింగరేణికి 2002లోనే లభించింది. దేశంలో ఎక్కడ విపత్తులు సంభవించినా, సహాయక చర్యల కోసం సింగరేణివైపు చూడటం జరుగుతోంది. హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్), హట్టి గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (హెచ్‌జీఎంఎల్), యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐ) లాంటి సంస్థలకు సింగరేణి విపత్తుల నిర్వహణపై ఆయా సంస్థలకు రెస్క్యూ బృందాలకు శిక్షణ ఇస్తోంది. అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లోనూ సింగరేణి సంస్థ పలు మార్లు బహుమతులు సాధించింది. ప్రస్తుతం సింగరేణి రెస్క్యూ జీఎం కె.శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ బి.మాధవరావు (డీజీఎం), శిక్షకులుగా అదనపు మేనేజర్ భాస్కర్‌రెడ్డి, డీవైఎస్ఈ నర్సింహమూర్తిలు గోదావరిఖని కేంద్రంగా సింగరేణి వ్యాప్తంగా రెస్క్యూ బృందాన్ని తీర్చిదిద్దుతున్నారు.

**వీరు అందించిన సేవల్లో కొన్ని..**

ఎనిమిదేళ్ల కింద కోల్ ఇండియాలో పైకప్పు కూలి అత్యంత విలువైన కంటిన్యూయస్ మైనర్ యంత్రం కూరుకుపోతే సింగరేణి రెస్క్యూ బృందం అధునాతన న్యూమటిక్ హైడ్రాలిక్ కట్టర్స్, స్లిట్టర్స్ సహాయంతో ఆ యంత్రాన్ని వెలికి తీసింది. కొత్తగూడెం సమీపంలోని కేటీపీఎస్‌లోని కేబుళ్లకు మంటలు అంటుకుని దట్టమైన పొగ కమ్ముకుంటే అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేని స్థితిలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రానైట్ గనిలో పేలుళ్ల సందర్భంగా పెద్ద బండకింద చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీశారు. సింగరేణిలో చోటు చేసుకున్న ప్రతీ విపత్తులోనూ రెస్క్యూ బృందం సహాయక చర్యలు చేపట్టిన ఘటనలు కోకొల్లలు. బోర్‌బావుల్లో పడినప్పుడు పిల్లల్ని కాపాడిన ఘటనలు అనేకం ఉన్నాయి. బోర్‌లోకి ఆక్సిజన్ సరఫరా చేయడం, చిక్కుకున్న పిల్లల కదలికల్ని గుర్తించడానికి సెర్చ్‌కామ్ ప్రోబ్ లాంటి అధునాతన వస్తువులు సింగరేణి సొంతం.

# కట్టేది పేదల నివాసాలే.. దస్త్రాల నిండా మోసాలే!!

విశాఖపట్నం: జిల్లాలో 'ఒక సెంటు' స్థలాల్లో నిర్మిస్తున్న గృహ నిర్మాణాల్లో పలు అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో అధికారుల తీరు విస్మయపరుస్తోంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే పూర్తయినట్లు దస్త్రాలు సృష్టిస్తున్నారు. సాంకేతిక వివరాల ద్వారా ఉ న్నతాధికారులను తప్పుదారి పట్టించి వారనుకున్న గుత్తేదారులకు బిల్లులు అందేలా చేస్తున్నారు. కొందరు అధికారులపై ఫిర్యాదులు వస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. జియోట్యాగింగ్‌లోనూ మోసాలే: ఒక సెంటు స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్ల వద్ద జియోట్యాగింగ్ సాంకేతికతను కొందరు పక్కదారి పట్టిస్తున్నారు. ఆయా లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకునేలా జియోట్యాగింగ్ ప్రక్రియకు సంబంధించిన వివరాలు యాప్ ద్వారా నమోదు చేస్తారు. లబ్ధిదారుడి ఇంటి నిర్మాణం ఏ స్థాయిలో ఉందో తెలిపే ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. ఇక్కడే అసలు మోసం సాగుతోంది. అసలైన




లబ్ధిదారుడికి చెందిన ఇల్లు కాకుండా పూర్తయిన వేరొకరి ఇంటిని అప్‌లోడ్ చేస్తున్నట్లు సమాచారం.

**ఎక్కడెక్కడంటే..**

నగరంలోని 22వ వార్డు లబ్ధిదారులకు పద్మనాభం మండలం విజయరాంపురం లేఅవుట్‌లో స్థలాలు కేటాయించారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం పూర్తికాకుండానే పూర్తయినట్లు పేర్కొనడంపై ఫిర్యాదులున్నాయి. ఈ లేఅవుట్‌లో ఓ మహిళ ఇల్లు ప్రస్తుతం పైకప్పు వరకే నిర్మించారు. కానీ మొత్తం పూర్తయినట్లు చూపిస్తున్నారు. మరో లబ్ధిదారు ఇల్లు పునాదుల వరకు నిర్మిస్తే... పైకప్పు వరకు నిర్మించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.మరో పది మంది ఇళ్లు పైకప్పు వరకే నిర్మించినా పూర్తయినట్లు ఆన్‌లైన్‌లో పేర్కొన్నారు.

పైకప్పు పూర్తయిన గృహ నిర్మాణాలు 42 ఉన్నట్లు, పునాదుల నుంచి పైకప్పు వరకు వచ్చినవి 17 ఉన్నట్లు తప్పుడు వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు సమాచారం. ఓ మహిళకు విజయరాంపురం లేఅవుట్‌లో కేటాయించిన స్థలంలో ఎటువంటి నిర్మాణం చేపట్టలేదు. ఆ స్థలాన్ని ఖాళీగా ఉంచారు. అయినా అక్కడ ఇల్లు పూర్తయినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చూపడం గమనార్హం.

పద్మనాభం మండలంలోని మద్ది, గొట్టిపల్లి..అలాగే పెందుర్తి, ఆనందపురం మండలాల్లో నిర్మిస్తున్న ఇళ్ల ప్రక్రియపైనా ఇదే తరహా ఆరోపణలున్నాయి.

# పురోగతిలేని పొగాకు మార్కెట్

పొదిలి : పొగాకు ధరలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వేలం కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా పురోగతి కనిపించడం లేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేదన్న సాకుతో వ్యాపారులు ఆచితూచి అడుగులేస్తున్నారు.

అక్కడ ఉత్పత్తి పెరిగిందని...: మన దేశంలో పండించిన పంటలో 65 నుంచి 70 శాతం ఇతర దేశాలకు ఎగుమతి అవుతుంది. బ్రెజిల్, జింబాబ్వే, టాంజానియా తదితర దేశాల్లోనూ ఈ సాగు ఎక్కువ. ఈ ఏడాది ఆయా ప్రాంతాల్లోనూ ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని... ఆ ప్రభావం మన మార్కెట్‌పైనా పడుతుందని చెబుతున్నారు. గత మూడేళ్లు ఆయా దేశాల్లో వర్షాభావం కారణంగా ఉత్పత్తి తగ్గడంతో... ఇక్కడి వ్యాపారులు గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా పోటీపడి కొనుగోలు చేశారు. దీంతో రైతులకు లాభాలు వచ్చాయి. ఈ ఏడాదీ అవే ధరలు కొనసాగుతాయన్న అంచనాతో బోర్డు నిర్దేశించిన లక్ష్యానికి మించి సాగు చేశారు. వాతావరణ ప్రతికూలతలు ఎదురైనా



వ్యయప్రయాసలకోర్చి ఉత్పత్తి చేశారు.

**సరాసరిన రూ.300 ఇస్తేనే గిట్టుబాటు...**

ప్రస్తుతం జిల్లాలోని అన్ని వేలం కేంద్రాల్లో గరిష్ఠ ధర కిలో రూ.280కు సీలింగ్ పెట్టుకొని వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గత పది రోజులుగా మీడియం, బ్రైట్ రకాలను కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 5.3 మిలియన్ కిలోల అమ్మకాలు జరగ్గా... సరాసరిధర రూ.262 మాత్రమే లభించింది. గిట్టుబాటు ధరలు సంఖ్యా తక్కువగానే ఉంది. బోర్డు అధికారులు నిర్దేశించిన ధరకు తీసుకునేందుకు వ్యాపారులు ఆసక్తి చూపకపోవడంతో ఎక్కువ బేళ్లు తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాపారుల మధ్య పోటీ పెంచేందుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది గిట్టుబాటు కావాలంటే సరాసరి ధర కిలోకు రూ.300కు తగ్గకుండా చూడాలని కోరుతున్నారు.

# మస్తర్లలో మాయాజాలం!

భీమవరం : భీమవరం పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికుల మస్తర్ల నమోదులో మతలబులు చెత్త సేకరణపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కొందరు విధులకు గైర్హాజరైనా యథావిధిగా హాజరు నమోదవుతుండగా.. మరికొందరు తమ స్థానంలో మరొకరితో పనిచేయిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ వ్యవహారాల్లో ప్రతి నెలా రూ.లక్షలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఎటు చూసినా చెత్త.. ఇప్పుడు స్వచ్ఛాంధ్ర, గతంలో స్వచ్ఛ సంకల్పం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినా భీమవరంలో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేమి, కార్మికులు విధులకు హాజరయ్యారో లేదో పరిశీలన లేదు. భీమవరంలోని ఏడు పారిశుద్ధ్య డివిజన్లలో 274 మంది ప్రైవేటు, దాదాపు 90 మంది శాశ్వత కార్మికులు ఉన్నారు. ప్రతి వార్డుకు శానిటరీ ఇన్‌స్పెక్టరు, మేస్త్రీలు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు ఉంటారు. ఆయా వార్డుల్లో ఎందరు కార్మికులు విధులకు హాజరవుతున్నారో పర్యవేక్షించాల్సిన బాధ్యత వీరిదే. కానీ ప్రతినెలా ముడుపులకు అలవాటు పడిన కొందరు అధికారులు కార్మికుల హాజరు నమోదులో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.చుక్క పెట్టి వదిలేసి.. శాశ్వత కార్మికుల్లో కొందరు వారి తరఫున వేరొకరిని నియమించి వారికి ఎంతో కొంత వేతనం ఇస్తుంటారు. కొందరైతే మస్తరు వేయించుకుని ఇంటికెళ్లిపోతారు. శాశ్వత, ప్రైవేటు సిబ్బందిలో ఎవరైనా పనికి రాకపోతే పర్యవేక్షణాధికారులు మస్తరు పుస్తకంలో చుక్క(.) ఉంచుతారు. తరువాత దాన్ని హాజరైనట్లుగా మారిస్తే ఆ రోజు వేతనంలో కొంత సొమ్ము వారి జేబుల్లోకి చేరుతుంది.మస్తరు మాట ఎలా ఉన్నా.. పనులు చేసినా చేయకపోయినా కొన్ని డివిజన్లలో నెల వారీ మామూళ్లుగా కార్మికుల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారని, ఇవి కాకుండా హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, చిరు వ్యాపారులు నుంచి నెలవారీ వసూళ్లు ఉంటాయనే ప్రచారం ఉంది.

# ఉద్యోగుల హేతుబద్ధీకరణకు రంగం సిద్ధం




కాకినాడ : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల హేతుబద్ధీకరణకు రంగం సిద్ధమైంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం సచివాలయాలను క్లస్టర్ వ్యవస్థగా మార్చనుంది. జనాభా ఆధారంగా సచివాలయ ఉద్యోగులను జనరల్ పర్పస్(మల్టీపర్పస్) ఫంక్షనరీలు, స్పెసిఫిక్(టెక్నికల్) ఫంక్షనరీలుగా విభజించేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 620 సచివాలయాలను 310 క్లస్టర్లుగా మార్చనున్నారు. ఈ మేరకు ప్రక్రియ పూర్తయినా ప్రభుత్వానికి నివేదిక పంపే క్రమంలో కొన్ని ప్రతిబంధకాలు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాల్లో మూడుకు పైగా సచివాలయాలు ఉన్నాయి. వీటిలో ఏ రెంటింటిని క్లస్టర్‌గా తీసుకోవాలన్న ప్రతిపాదనపై కొన్నిచోట్ల రాజకీయ ‌ోక్యంతో జాప్యం జరుగుతోంది.

**ఉద్యోగుల కేటాయింపు..**

గ్రామ సచివాలయంలో జనరల్ పర్పస్ ఫంక్షనరీలుగా పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్ 1-5), డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీసు, వార్డు సచివాలయంలో అడ్మిన్, ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శి, మహిళా పోలీసును కేటాయించింది. నీ స్పెసిఫిక్ పర్పస్ ఫంక్షనరీలుగా వీఆర్వో, ఏఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరీకల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్‌లను కేటాయించింది. నీ వార్డు సచివాలయంలో రెవెన్యూ కార్యదర్శి, హెల్త్ కార్యదర్శి, ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శి, శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి, ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులను కొనసాగించనున్నారు. ఈ మేరకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని 610 గ్రామ, వార్డు సచివాలయాల్లో 6,526 మంది ఉద్యోగులు ఉండగా, తాజా మార్గదర్శకాల ప్రకారం 1,766 మందితో జనరల్ పర్పస్ ఫంక్షనరీ జాబితా సిద్ధం చేశారు.

**జనాభా ఆధారంగా విభజన..**

సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించారు. ఏ-కేటగిరీలో 2,500 లోపు జనాభా ఉన్న చోట ఆరుగురు, బీ-కేటగిరీలో 2,501-3,500 మధ్య జనాభా ఉన్న చోట ఏడుగురు, సీ-కేటగిరీలో 3,501 ఆపైన ఉన్నచోట ఎనిమిది మంది ఉద్యోగులను కేటాయిస్తారు. ప్రస్తుతం సచివాలయాల్లో 8 నుంచి 12 మంది వరకు ఉద్యోగులున్నారు. కొన్నిచోట్ల అవసరాలకు మించి ఉన్నారు. మ్యాపింగ్ పూర్తయిన తర్వాత మిగిలిన ఉద్యోగులను ఆయా శాఖల్లో సర్దుబాటు చేస్తారు.

# ప్రగతికి పెద్దపీట.. పరిశ్రమలకు రాచబాట..



రాజానగరం: గత ఐదేళ్లుగా అభివృద్ధిలో వెనుకబడిన రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ఆదాయ వనరులు పెరగాలంటే పరిశ్రమలు, ఇతర సంస్థలు విరివిగా ఏర్పాటు కావాలన్న సత్యాన్ని గుర్తెరిగి ఆ దిశగా అడుగులు వేస్తోంది. తద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంతో పాటు.. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచే దిశగా కసరత్తు చేస్తున్నారు. ఆ క్రమంలోనే రాజానగరం మండలం కలవచర్లలో 104 ఎకరాల్లో పారిశ్రామికవాడ శరవేగంగా రూపుదిద్దుకుంటోంది.

**వసతుల కల్పనపై దృష్టి**

కలవచర్ల పారిశ్రామికవాడలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టి ప్రస్తుతం ఆ దిశగా కసరత్తు జరుగుతోంది. మే నెలాఖరు నాటికి రహదారులు, డ్రెయినేజీలు, విద్యుత్తు, మంచినీటి సౌకర్యం తదితరాలు సమకూర్చే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అధికారులు పనిచేస్తున్నారు. జూన్ మొదటి లేదా రెండో వారంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్థలాలు కేటాయించాలని నిర్ణయించుకున్నారు. మొత్తం 104 ఎకరాల పారిశ్రామికవాడను 369 స్థలాలుగా విభజించారు. వచ్చిన దరఖాస్తుల మేరకు 300 గజాల నుంచి ఒక ఎకరం వరకు స్థలం ఇవ్వడానికి ఏపీఐఐసీ ద్వారా చర్యలు తీసుకున్నారు. **విద్యుత్తు ఉపకేంద్రం మంజూరు**

ఈ పారిశ్రామికవాడలో విద్యుత్తు ఉపకేంద్రాన్ని సైతం ప్రభుత్వం మంజూరు చేసింది. పారిశ్రామిక అవసరాలకు విద్యుత్తు సమస్య తలెత్తకుండా ఈ ఉపకేంద్రం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కృషితో మంజూరైంది. పారిశ్రామికవాడకు చేరుకునేందుకు అనుసంధానంగా ఒకవైపు గండేపల్లి, మరోవైపు రాజానగరం, ఇంకోవైపు కోరుకొండ నుంచి కలుపుతూ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

**ఏకగవాక్ష అనుమతులు**


ఇక్కడ పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులన్నీ సింగిల్ విండో విధానం ద్వారా పొందేలా ఏర్పాటు చేశారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే వారికి ఇన్సెంటివ్ ఇవ్వడానికి సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని ద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది, నిరుద్యోగులకు ఉద్యోగకల్పన జరుగుతుంది. పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి జనరల్ కోటాలో 25 శాతం, బీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలో 45 శాతం రాయితీ ఇచ్చే విధంగానూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

**నాలుగు లక్షల మందికి ఉపాధి- బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే, రాజానగరం**

కలవచర్ల పారిశ్రామికవాడ ద్వారా దాదాపు నాలుగు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఉత్పాదక యూనిట్లు, కుటీర పరిశ్రమలు, ప్యాకింగ్ యూనిట్లు, చిన్న తరహా పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటవుతాయి. పారిశ్రామికవాడకు ప్రత్యేకించి విద్యుత్తు ఉపకేంద్రం మంజూరు చేసిన సీఎంకి, ఉపముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

# బెల్లం అమ్మకాలు బేలచూపు

అనకాపల్లి : అనకాపల్లి మార్కెట్‌కు వచ్చే బెల్లం ఏటేటా తగ్గుతోంది. ముగిసిన సీజన్‌లో 7.33 లక్షల బెల్లం దిమ్మలు అమ్మకం చేశారు. వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న మార్కెట్‌లో ఇంత తక్కువ దిమ్మలు రావడం ఇదే తొలిసారి.గతంలో ఒక నెలలోనే పది లక్షలకుపైగా దిమ్మల అమ్మకాలు జరిగాయి. అటువంటిది ఏడాది పొడవునా 7.5 లక్షల దిమ్మలూ రాలేదంటే మార్కెట్ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.అనకాపల్లి నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు బెల్లం ఎగుమతి చేస్తారు. ఆయా ప్రాంతాల్లో వ్యాపారుల వద్ద నల్లబెల్లం ఉందంటూ ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేస్తుండటంతో చాలా మంది బెల్లం కొనుగోలుకు ముందుకు రావడం లేదు. తద్వారా బెల్లం ధరలు తగ్గుతున్నాయి. 2023-24 సీజన్‌లో సగటున వంద కేజీల బెల్లం ధర రూ.3,901 ఉంటే.. 2024-25 సీజన్‌లో రూ.3,811కు పడిపోయింది. ఖర్చులు ఏటా పెరుగుతూనే ఉన్నాయి. గత సీజన్‌లో వంద కేజీల బెల్లం తయారీకి రూ.1,200 ఖర్చు కాగా, ముగిసిన సీజన్‌లో రూ.1,400కు పెరిగింది. గత సీజన్‌తో పోలిస్తే 18,591 దిమ్మలు తక్కువగా మార్కెట్‌కు వచ్చాయి. మార్కెట్‌కు ఏడాది పొడవునా బెల్లం రాదు. నవంబరు నుంచి ఏప్రిల్ వరకు భారీగా వస్తుంది. ముగిసిన సీజన్‌లో ఏ నెలలోనూ 2 లక్షల దిమ్మెలకు మించి రాలేదు. **రూ.39.29 కోట్ల వ్యాపారం..:** బెల్లం తక్కువగా రావడంతోపాటు ధరలు తగ్గడంతో 2024-25 సీజన్‌లో మొత్తం అమ్మకాల విలువ రూ.39.29 కోట్లు. గత రెండు దశాబ్దాల్లో ఇంత తక్కువ వ్యాపారం జరగడం ఇదే తొలిసారి. గత సీజన్‌తో పోలిస్తే రూ.2.82 కోట్లు తక్కువగా అమ్మకాలు



చేశారు.

**చేతి చమురు వదిలింది..**

ఎకరా విస్తీర్ణంలో చెరకు సాగు చేశా. గానుగాడితే 24 టన్నుల రసం వచ్చింది. బెల్లం తయారు చేస్తే రూ.92 వేలు వచ్చాయి. బెల్లం తయారీకి రూ.44 వేలు ఖర్చయ్యాయి. చెరకు సాగుకు రూ.58 వేలు పెట్టుబడి పెట్టా. ఇంటిల్లిపాదీ అందరం కష్టపడ్డాం. మా కూలీ లెక్క వేయకపోయినా రూ.10 వేలు నష్టం వచ్చింది. కూలీ పనికి పోయినా రోజుకు రూ.800 వచ్చేది. చేతి చమురంతా వదిలింది.

మారిశెట్టి అప్పలనాయుడు, రైతు, మునగపాక

# ఖర్చులు ఆకాశంలో.. ధరలు పాతాళంలో..

కనిగిరి : గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండుమిర్చి ధరలు పతనం కావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. పెట్టిన పెట్టుబడిలో 40 శాతం కూడా వెనక్కువచ్చే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. సాగు వేళ ఖర్చులు ఆకాశాన్నంటాయని..ప్రస్తుతం ధరలు పాతాళంలో ఉన్నాయని వారంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది మిరప సాగు ఒడిదొడుకులకు లోనైంది. వాస్తవంగా 1,59,382 హెక్టార్లతో సాగు చేయాల్సి ఉండగా, కేవలం 26,563 హెక్టార్లలోనే పంట వేశారు. చాలామంది రైతులు పొగాకు వైపు మళ్లారు. అయితే వర్షాలు, పురుగులు, తెగుళు వెంటాడటంతో దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఎకరాకు కనీసం పది క్వింటాళ్లు కూడా దిగుబడి రాకపోవడంతో వారంతా కుదేలయ్యారు. దీంతో ప్రస్తుత ధరలను బట్టి ఎకరాలకు రూ.లక్ష వరకూ నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. ఎకరాకు రూ.1.5 లక్షలకు



పైగా పెట్టుబడి పెట్టామని, కేవలం యాభై వేలే చేతికందే పరిస్థితి ఉందన్నారు.

**మూడో వంతుకు పడిపోయిన ధరలు:** దిగుబడి తగ్గినా..మంచి ధర లభిస్తే గట్టెక్కుతామని రైతులు భావించారు. అయితే అది కూడా నెరవేరలేదు. గుంటూరు, ఇతర మార్కెట్లకు తీసుకెళ్లినా కొనుగోలు చేసే నాథుడే కన్పించడం లేదని రైతులు నిర్వేదంతో చెబుతున్నారు. దళారులను సంప్రదిస్తే తక్కువ రేటుకు అడుగున్నారు. ప్రతి ఏటా క్వింటా రూ.20 వేలు పలికేది. ఈ ఏడాది మూడోవంతుకు పడిపోయింది. క్వింటా రూ.7 వేల నుంచి రూ.8 వేలకు కొనుగోలు చేస్తామని వ్యాపారులు చెబుతున్నారు. పంట సాగుకు కూలీలు, పురుగు మందుల ఖర్చు రెట్టింపయ్యిందని, కనీసం గిట్టుబాటు ధర లభించడం లేదని, అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కనిగిరి, పీసీ పల్లి, వెలిగండ్ల, పామూరు, సీఎస్ పురం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా మిర్చి పంట వేశారు. ఆ ప్రాంతంలో వానలు కురవడంతో కాయ రంగు మారిపోయిందని, దీంతో వ్యాపారులు ముఖం చాటేస్తున్నారని వారంటున్నారు.

**నాణ్యత ఉన్నా.. ధర ఇవ్వడం లేదు**

-మధుసూదన్‌రెడ్డి, మండాదివారిపల్లి

మార్కెట్‌కు నాణ్యమైన మిర్చిని తీసుకెళ్లినా, తగిన ధర ఇవ్వడం లేదు. నేను పదెకరాల్లో మిర్చి సాగు చేశా. ఎకరాకు రూ.1.50 లక్షలకు పైగానే ఖర్చు చేశా. దిగుబడి తగ్గింది. గిట్టుబాటు ధర కూడా లేదు. ఈ సారి రూ.పది లక్షలకు పైగా నష్టమొస్తోంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తే కొంతైనా గట్టెక్కుతాం.

# ఇక్కడ చెరువుండాలే..!

తాడేపల్లిగూడెం : ఒకప్పుడు తాగునీటి అవసరాలు తీర్చిన చెరువులు నేడు నామరూపాలు లేకుండా పోయాయి. మురికికూపాలుగా మారడమే కాకుండా కబ్జా కోరల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. దశాబ్దాలుగా వీటిని పట్టించుకునేవారు లేకపోవడంతో రికార్డుల్లో ఉన్న చెరువులు క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. జిల్లాలోని పలు పురపాలక సంఘాల్లో చెరువులు ఆక్రమణకు గురయ్యాయి.

జిల్లా కేంద్రం భీమవరంలో 27.73 ఎకరాల విస్తీర్ణంలో 14 చెరువులు ఉండేవి. వీరమ్మపార్కు, సోమగుండం, ఎడ్వర్డ్, ఇంగిలాయికుంట చెరువులు మాత్రమే మిగిలాయి. ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండు, మీ సేవా భవనం, పురపాలక వాహనాలు నిలిపేందుకు షెడ్డు నిర్మాణాలకు కొన్నింటిని పూడ్చేశారు. కూర్మయ్యపేట, ఇంగిలాయి కుంట తదితర చెరువులు కనిపించకుండా పోయాయి.

పొంతన లేని లెక్కలు.. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలో రెవెన్యూ దస్త్రాలు ప్రకారం సుమారు 100.26 ఎకరాల విస్తీర్ణంలో 23 చెరువులు ఉండాలి. కానీ పురపాలక రికార్డుల్లో 15 మాత్రమే ఉండటం గమనార్హం. మిగిలినవి పూర్తి స్థాయిలో ఆక్రమణకు గురై ఉనికిలో లేకుండా పోయాయి. శివాలయం, గొల్లగూడెం, భట్టువానిగుంట, అనంతమ్మ, పసర్ల, సిద్ధి, కొత్త కర్ర చెరువులు కేవలం రికార్డుల్లోనే ఉన్నాయి. తాడేపల్లిగూడెం భట్టువానిగుంట చెరువులో మురికి నీరు చేరి దుర్వాసన వస్తోందని స్థానికులు పూడ్చివేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో చాలా వరకు ఆక్రమణకు గురైంది. చెరువు ఉండాల్సిన ప్రాంతంలో భారీ గృహాలు ఉన్నాయి. నాలుగు ఎకరాల



విస్తీర్ణం ఉండాల్సిన చెరువు స్థలం నేడు ఒక ఎకరానికి పరిమితమైంది. నరసాపురంలో 15.72 ఎకరాల విస్తీర్ణంలో 6 తటాకాలున్నాయి. వీటి చుట్టూ నివాసాలు పెరుగుతున్నాయి. పొన్నపల్లి చెరువు పూర్తి స్థాయిలో ఆక్రమణకు గురై ఆనవాళ్లు కోల్పోయింది. ఇళ్ల స్థలాల పంపిణీకి తుంగపాటి చెరువును పూడేశ్చారు.

పాలకొల్లులో 11 మున్సిపల్ చెరువులకు గాను అయిదు ఆక్రమణకు గురయ్యాయి. పరగడ చెరువును పూడ్చి సామాజిక వర్గాల భవన నిర్మాణాలకు కేటాయించారు. బంగారువారి చెరువును సైతం పూడ్చి కాలనీలు ఏర్పాటు చేశారు. దేవాలయాలు, కల్యాణ మండపాల పేరిట ఆక్రమించుకున్నారు.ఆకివీడు నగర పంచాయతీలో 56 ఎకరాల విస్తీర్ణంలో 8 చెరువులు ఉండేవి. కొండయ్య, దొరగారు చెరువులు 30 శాతం ఆక్రమణల్లో ఉన్నాయి.'చెరువుల సంరక్షణకు కృషి చేస్తాం. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి స్వాధీనం చేసుకునే విధంగా మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం.' మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు అన్నారు.

## వెదుళ్లగెడ్డ.. ఇసుకాసురుల అడ్డా

బుచ్చెయ్యపేట: ప్రజలు తమ సొంత అవసరాల కోసం ఉచితంగా ఇసుక తరలించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. దీన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు ఇసుకతో వ్యాపారం చేస్తున్నారు. ఉచితం పేరుతో ఎక్కడపడితే అక్కడ తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రకృతి వనరులను దోచేస్తున్నారు. బుచ్చెయ్యపేట పరిధిలోని వెదుళ్లగెడ్డ ఇసుకాసురులకు అడ్డాగా మారింది. ఇక్కడ రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వంతెన, గ్రోయిన్లకు సమీపంలోనే తవ్వేస్తుండటంతో అవి దెబ్బతింటున్నాయి. బుచ్చెయ్యపేట మండలంలోని పెదపూడి, కరక, చింతపాక, తురకలపూడి, చిట్టియ్యపాలెం, త్రైపురం, రాజాం, కందిపూడి గ్రామాల మీదుగా గెడ్డ విస్తరించి ఉంది. వర్షాకాలంలో ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. దీనిపై వంతెనలు, గ్రోయిన్లు, ఆనకట్టలున్నాయి. కె.బి.రోడ్డులో రాజాంకు సమీపంలో వెదుళ్లగెడ్డపై మూడు దశాబ్దాల కిందట వంతెన నిర్మించారు. ఇసుక తవ్వకాల వల్ల వంతెన పునాదులు బయటపడ్డాయి. పిల్లర్ల చుట్టూ గోతుల్లో నీరు చేరింది. పెదమదిన, రాజాం గ్రామాలకు చెందిన కొంతమంది వెదుళ్లగెడ్డలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు



చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. పగలు మనుషులతో, రాత్రుళ్లు పొక్లెయిన్లతో తవ్వేస్తున్నారు. వంతెనకు సమీపంలో పెద్ద పెద్ద గోతులు పెట్టేశారు. వెదుళ్లగెడ్డ గర్భాన్ని గుల్ల చేశారు.

**రాజాంలో ఇసుక నిల్వలు..:** ఇసుక అక్రమార్కులు రాజాంలో స్టాకు పాయింట్ ఏర్పాటు చేశారు. వెదుళ్లగెడ్డ నుంచి ఇసుక ఇసుకువచ్చి అమ్మ యూపీ స్కూల్ లేఅవుట్ స్థలంలో నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి ట్రాక్టర్లు, లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు.

**కందకాలు తవ్వించి బాటల మూసివేత..:** వెదుళ్లగెడ్డలో ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను తహసీల్దారు లక్ష్మి శనివారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు రావడం చూసి ట్రాక్టర్ల డ్రైవర్లు అక్కడి నుంచి పరారయ్యారు. అప్పటికే లోడింగ్ చేసిన ఇసుకను అన్‌లోడ్ చేసి వెళ్లిపోయారు. ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా కందకాలు తవ్వించి బాటలు మూసివేయించినట్లు తహసీల్దారు చెప్పారు. తవ్వకాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**గ్రోయిన్‌కు దెబ్బ..**

కందిపూడి, చోడవరం మండలం తిమ్మన్నపాలెం గ్రామాల్లో ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు వెదుళ్లగెడ్డపై గ్రోయిన్ నిర్మించారు. దిగువనే ఇసుక తవ్వేయడంతో గ్రోయిన్ దెబ్బతింటోంది. ఇప్పటికే కొంతవరకు రాతికట్టు చెల్లాచెదురైంది. రాళ్లన్నీ దిగువకు కొట్టుకుపోయి పొలాలకు సాగునీరు అందదని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

## అనకొండలను అడ్డుకునేదెవరూ?

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం పట్టణంలోని కన్నేపల్లి మార్గంలో ఊరుకొండ వెనుక భాగంలో కొండను అక్రమార్కులు తవ్వేస్తున్నారు. సర్వే నంబరు 280లో 108.30 ఎకరాల భూమి కొండకు సంబంధించి ఉంది. ఎలాంటి అనుమతి లేకుండా పొక్లెయిన్‌తో బండరాళ్లను పెకిలించి మట్టిని తోడేస్తున్నారు. చాలా రోజులుగా ఈ వ్యవహారం నడుస్తోంది. రోజూ ఐదారు ట్రాక్టర్ల ద్వారా వందల ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.1,200–1,400 వరకు అమ్ముతున్నారు. తవ్వకాలతో ఆ ప్రాంతంలో భారీ ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. అక్రమార్కుల స్వార్థానికి కొండలు, గుట్టలు రూపు మారిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్లు వెళ్లే సమయంలో సమీపంలోని పొలాలు, రోడ్లు అధ్వానం



గా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్డీవో వసంత్‌బాబును వివరణ కోరగా మట్టి తవ్వకాలకు సంబంధించి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కొండను తవ్వి మట్టి అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. అధికారులను పంపి దాడులు చేయిస్తాం. వాహనాలు పట్టుబడితే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

## ఉపాధి కూలీలకు తీపి కబురు

నక్కపల్లి : ఉపాధి కూలీలకు నెలల తరబడి పేరుకుపోయిన బకాయిలను విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వేలాది మంది కూలీల ఖాతాల్లోకి నగదు త్వరలోనే జమ కానుంది. జిల్లాలో 24 మండలాల పరిధిలో 3.13 లక్షల మంది కూలీలు ఉన్నారు. సగటున సుమారు రెండు లక్షల మంది పనులకు వెళ్తున్నారు. వారం మొత్తం చేసిన పనికి సంబంధించిన వేతనాలను ఎప్పటికప్పుడే చెల్లిస్తుంటారు. ఏటా ఆర్థిక సంవత్సరం ముగింపులో భాగంగా వేతనాల చెల్లింపుల ఆలస్యమవుతుంటాయి. ఈ క్రమంలోనే కేంద్రం నుంచి నిధులు సకాలంలో రాకపోవడంతో 12 వారాలుగా చెల్లింపులు జరగలేదు. ఫలితంగా కూలీలు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కేంద్రం బకాయిలను విడుదల చేసింది.

బీ జిల్లాలో సుమారు 80 వేల మందికి రూ.59 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం చెరువుల అభివృద్ధి, కందకాల తవ్వకాలు, నీటి కుంటల పనులు జరుగుతున్నాయి. ఏప్రిల్ ముందు వరకు రోజుకు రూ.300 వేతనం ఇస్తుండగా, ఈ మొత్తాన్ని కేంద్రప్రభుత్వం రూ.307కు పెంచింది. ప్రస్తుతం మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం, రోలుగుంట, రావికమతం, వి.మాడుగుల, చోడవరం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, కశింకోట, దేవరాపల్లి, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల తదితర ప్రాంతాల్లో ఉపాధి పనులకు కూలీలు ఎక్కువగా వెళ్తున్నారు. నిధుల విడుదలతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మల్బరీ ఆకుతో మహర్దశ



మడకశిర : మల్బరీ ఆకును పట్టు పురుగుల పెంపకానికే కాకుండా ప్రత్యామ్నాయంగా ఇతర ఔషధాలకు వాడేందుకు విక్రయిస్తూ మంచి లాభాలు సాధిస్తున్నారు మడకశిర వాసులు. మల్బరీ సాగు చేసి బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తిని అత్యధికంగా సాగు చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానం సంపాదించుకున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా పట్టుగూళ్ల పెంపకం కష్టతరంగా మారడంతో పాటు ఉష్ణోగ్రతల్లో మార్పులతో పాలపురుగు, సప్పుడి, గంటుగూళ్లు వస్తుండడంతో పట్టు పురుగులను మధ్యలోనే పారవేస్తూ నష్టపోతున్నారు. ఇలాంటి తరుణంలో రైతులు పండించే మల్బరీ ఆకును ఎండబెట్టి విక్రయిస్తే మంచి ధరలు ఇస్తామని ఓ కంపెనీ తెలియజేయడంతో ఆ దిశగా అడుగులు వేస్తూ లాభాలు సాధిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల ఎకరాల్లో మల్బరీ సాగులో ఉంది. విజయవాడకు చెందిన ఓ మందుల కంపెనీ వారు ఎండిన మల్బరీ ఆకు, కొమ్మలను కొనుగోలు చేస్తూ రైతులకు సొమ్ము అందిస్తుండటంతో లాభాలు వస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మడకశిర ప్రాంతంలో కంపెనీ వారు మల్బరీ తోటలను పరిశీలించి మందులకు అవసరమైన నాణ్యతతో కూడిన తోటలను ఎంపిక చేసుకున్నారు.

**క్వింటా రూ.6వేలకు కొనుగోలు..**

నాణ్యమైన తోటలోని మల్బరీ ఆకు కొమ్మలతో సహా ముక్కలుగా కత్తిరించి ఎండబెట్టి క్వింటా రూ.6వేలతో కొంటున్నారు. ఇలా టన్ను రూ.60వేలు. పచ్చి ముక్కలైతే టన్ను రూ.10వేలతో కొంటున్నారు. పట్టుపురుగుల పెంపకంతో నష్టపోతున్న రైతులకు ఇది లాభదాయకంగా ఉంది. ఎకరాకు ఎండిన మల్బరీ ఆకు ఒకటి నుంచి 2 టన్నుల వరకు వస్తుంది.

**విజయవాడకు తరలింపు**

– ప్రతాప్‌రెడ్డి, రైతు, బుళ్లసముద్రం, మడకశిర మండలం

8 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నాను. ఆకును కడ్డితో సహా ముక్కలుగా చేసి ఎండబెట్టి విజయవాడలోని ఓ మందుల కంపెనీకి తీసుకువెళుతున్నాం. ఇటీవల రూ.2 లక్షలతో ఆకు కత్తిరించే యంత్రం కొనుగోలు చేశాను. ఇప్పటికే 5టన్నుల ఎండబెట్టిన మల్బరీ ఆకు, కడ్డీలను విజయవాడకు తీసుకెళ్లి టన్ను రూ.60వేలతో విక్రయించాను. దీంతో రూ.3లక్షలు రాగా ఇందులో కూలీ ఖర్చులు, లారీ బాడుగకు రూ.50వేలు పోను రూ.2.50లక్షలు ఆదాయం వచ్చింది. ప్రస్తుతం మరో 5 టన్నుల ఎండబెట్టిన మల్బరీ ఆకు ముక్కలు సిద్ధంగా ఉంచాం.

## వరి.. ఆశలు చెదిరి



కణేకల్లు : రబీలో వరి సాగు చేసిన రైతుల ఆశలు చెదిరిపోయాయి. పంట చేతికందే సమయంలో వర్షాలు అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీశాయి. కనీసం పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి. కణేకల్లు, బొమ్మనహాళ్, గార్లదిన్నె, పామిడి, శింగనమల, పెద్దపప్పూరు తదితర మండలాల్లో 30 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అంచనా. ఐఆర్ఆర్93, ఆర్ఎన్ఆర్, గంగాకావేరి, ఎన్ఎల్ఆర్ రకాలను రైతులు సాగు చేశారు. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి వ్యయం చేశారు.

**అన్నదాత కంటతడి**

కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని గనిగెర, బెణికల్లు, యర్రగుంట, గోనేహాళ్, శ్రీధరగట్ట, ఎల్బీనగర్, సింగేపల్లి తదితర గ్రామాల్లో ఈనెల 11న కురిసిన వడగళ్ల వర్షం కారణంగా గింజలు రాలిపోయి పంట మొత్తం తుడిచిపెట్టుకొని పోయింది. గోనేహాళ్ ఒక్క గ్రామంలోనే వేయి ఎకరాల వరకు వరి సాగు అయ్యింది. వర్షంతో ఈ గ్రామంలో రూ.5 కోట్ల మేర పంట నష్టం వాటిల్లింది. కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

**తెగుళ్లతో దిగుబడిపై తీవ్ర ప్రభావం**

తెగుళ్లు, చీడపీడలు వ్యాపించడంతో తెల్లకంకులు ఏర్పడి దిగుబడిపై ప్రభావం చూపింది. సాధారణంగా ఎకరాకు 40 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా.. వర్షానికి పాక్షికంగా దెబ్బతిన్న పంట పొలాల్లో 10–15 బస్తాలు, స్వల్పంగా దెబ్బతిన్న పొలాల్లో 30 బస్తాలు దిగుబడి రావడం గగనమైందని రైతులు వాపోతున్నారు.

**యంత్రాల అద్దె భారం**

ప్రస్తుతం వరి కోతలు ప్రారంభం అయ్యాయి. యంత్రాలకు వరి నూర్పిడికి గంటకు రూ.2,500 నుంచి రూ.2,600 వరకు అద్దె ఉంది. ఎకరా విస్తీర్ణంలో వరి కోత కోయడానికి 1.30 గంటలు పడుతుందని రైతులు తెలిపారు. వరిమళ్లు గాలివానకు నేలవాలితే ఎకరా విస్తీర్ణంలో కోయడానికి 2 గంటల వరకు సమయం పడుతుంది.

**గిట్టుబాటు ధర లేక రైతన్న విలవిల**

రబీలో వరి ధాన్యం ధరలు తగ్గిపోయాయి. దళారులు క్వింటాలు ధర రూ.2,020 నిర్ణయించారు. ప్రభుత్వం క్వింటాలు ఏ గ్రేడ్ రూ.2,320, బీ గ్రేడ్ రూ.2,300 ధర నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు బాజ్ పేరుతో 75 కిలోలకు మూడు కిలోల ధాన్యం దోపిడీ చేస్తున్నట్లు రైతులు వాపోయారు. ఈ విషయమై ఏవో సాయికుమార్ వివరణ కోరగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. **అప్పులే మిగిలాయి – మల్లికార్జున, రైతు, గోనేహాళ్**

సొంత పొలం రెండెకరాలతోపాటు మరో 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, మరో మూడెకరాల్లో పత్తి సాగు చేశా. పంట కోత చేసే సమయంలో కురిసిన వడగళ్ల వానకు రెండు పంటలు దెబ్బతిన్నాయి. వరి గింజలు రాలిపోవడంతో 10 లక్షల దిగుబడి నేలపాలైంది. రూ.5 లక్షల అప్పు మిగిలింది.

## ప్రక్షాళనకు వేళాయె!



పి.గన్నవరం: ఈ నెల 23 నుంచి కాలువలకు నీటిసరఫరా నిలిపివేయనున్నారు. తిరిగి జూన్ 1న తెరుస్తారు. వీటిమధ్య సుమారు 40 రోజుల వ్యవధి ఉంటుంది. ఈలోపు జలవనరులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ చేసి కాలువల్లో ఏర్పాటు చేసిన మురుగునీటి తూరలను తొలగించే చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. చెత్త, చెదారం వేయకుండా ప్రధానంగా గ్రామ పంచాయతీలు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలి. ఈ విషయంలో జలవనరులశాఖ అధికారులకు సహకరించాలి.

**సమగ్ర రక్షిత పథకాలకు..**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 45 వరకు సమగ్ర రక్షిత పథకాలు ఉన్నాయి. ఇవికాకుండా రాజమహేంద్రవరం, కాకినాడ కార్పొరేషన్లతో పాటు సామర్లకోట, పెద్దాపురం, మండపేట, అమలాపురం, ముమ్మిడివరం మున్సిపాలిటీలకు చెందిన తాగునీటి పథకాలకు కాలువ జలాలు సరఫరా చేస్తున్నారు. లక్షలాది మంది జనాభాకు తాగునీరు అందిస్తున్న గోదావరి పంట కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉంది.

**అన్నదాతల ఆవేదన**

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లల్లో సుమారు 9.50 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగవుతుంది. దీనికి ప్రధాన ఆధారం పంట కాలువలు. ఈ జలాలను కలుషితం చేస్తున్న తీరుతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు రోడ్కెక్కిన పరిస్థితులు ఉన్నాయి. ప్రధాన పంటకాలువలు 431, పిల్ల కాలువలు 2024 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయి. ప్రధాన పంటకాలువలు పది వరకు ఉంటే పిల్లకాలువలు వందల సంఖ్యలో ఉన్నాయి.

**లేఖలు పంపుతాం**

– కె.గోపీనాథ్, ఎస్.ఇ., జలవనరులశాఖ, ధవళేశ్వరం సర్కిల్

ఇళ్లనుంచి కాలువల్లో పెట్టిన రోజువారీ వాడకం నీటికి సంబంధించి తూరలు తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శులకు లేఖలు పంపుతాం. ఈ క్లోజర్ పిరియడ్‌లో చర్యలు తీసుకుంటాం. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటాం. పంటకాలువల్లో వ్యర్థాలు పడేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకుంటాం.

## లక్ష్య సాధనలో వెనుకడుగు

మాధవధార : జిల్లా రవాణా శాఖ 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ప్రభుత్వం గతేడాది (ఏప్రిల్ 2024 నుంచి ఈ ఏడాది మార్చి 2025) వరకు మొత్తం నిర్దేశించిన ఆదాయం రూ.522.79 కోట్లు కాగా.. రూ.447.80 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగింది.

మినహాయింపులు ఇవ్వడంతో: బ్యాటరీ, ఈవీ వాహనాలకు ప్రభుత్వం జీవిత కాలం పన్ను మినహాయింపు ఇచ్చింది. దీంతో ఈ ఏడాదిగా ఆ వాహనాలు కొనుగోలు ఎక్కువగా పెరగడంతో ఆ మేరకు ఆదాయం తగ్గింది. దీంతో పాటు విశాఖ జిల్లా కేవలం నగరానికి మాత్రమే



పరిమితమవ్వడంతో ట్రాన్స్‌పోర్టుతో పాటు రవాణా శాఖకు ఆదాయం వచ్చే వనరులన్నీ అనకాపల్లి జిల్లా పరిధిలోకి వెళ్లిపోవడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. వాహనాలకు సంబంధించిన వివిధ రకాల త్రైమాసిక పన్నులతో పాటు, దరఖాస్తు రుసుములు చెల్లించేందుకు రవాణా శాఖ నూతనంగా 'పరివాహన్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. చెల్లింపు సమయంలో తరచూ సర్వర్ సమస్యలు తలెత్తడంతో అనుకున్నట్లు పన్నులు చెల్లింపులు జరగలేదు. దీంతో లక్ష్యాన్ని సాధించడంలో వెనుకబడినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాదికి మరో 15 రోజుల్లో లక్ష్యాన్ని నిర్దేశిస్తారని, సర్వర్ సమస్య అప్పటికల్లా పూర్తిస్థాయిలో పరిష్కారమవుతుందని అధికారులు వెల్లడించారు.

## ఇండోర్ తెరుస్తున్నారు

గాజువాక : దశాబ్దకాలంగా మరుగునపడిన గాజువాక వికాస్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియానికి(రాజీవ్ క్రీడాప్రాంగణం) మహర్దశ పట్టింది. వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన దీనికి రూ.10.88 కోట్లతో సర్వహంగులతో పునఃప్రారంభానికి సిద్ధం చేశారు. నిన్నమొన్నటిదాకా ఎక్కడికక్కడ ధ్వంసమైన ఫ్లోరింగ్, పెచ్చులూడిన గోడలు, వర్షంవస్తే కారిపోయే పరిస్థితి ఉండేది. ఇప్పుడు కొత్తగా షటిల్, టెన్నిస్ కోర్టులు, ఓపెన్ ఆడిటోరియం, వాకింగ్‌ట్రాక్, ఆధునిక స్విమ్మింగ్‌పూల్ వంటి సదుపాయాలు క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చారు.

**'కూటమి' వచ్చాక..**

2012లో గాజువాక 65వ వార్డు వికాస్‌నగర్‌లో రూ.5 కోట్లతో ఇండోర్ స్టేడియాన్ని నిర్మించారు. అప్పటి జీవీఎంసీ మేయర్ పులుసు జనార్ధనరావు చొరవతో దీన్ని అందుబాటులోకి తెచ్చినా నిర్మాణంలో నాణ్యతాలోపం కారణంగా కొన్నాళ్లకే జీర్ణావస్థకు చేరుకుంది. ఆరు షటిల్‌కోర్టుల చెక్క ఫ్లోరింగ్ పాడైపోయి అడుగుతీసి అడుగేయడానికి వీలుండేదికాదు. ఆవరణలో సిమెంటు గోడలు బీటలు వారి, మెట్ల మార్గాలు ధ్వంసమై లోనికి వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఓపెన్ ఆడిటోరియం గ్యాలరీ చూస్తే భయంగొల్పేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడాకారుల అవసరాలను గుర్తించి రూ.10.88 కోట్లతో సదుపాయాలు మెరుగుపర్చడంతో సరికొత్త అందాలతో ఇండోర్ స్టేడియం ఆకట్టుకుంటోంది.

స్టేడియంలో సింథటిక్ కోర్టు మ్యాట్‌లు, మల్టీపర్పస్ ఫ్లోరింగ్, మోడ్రన్ లైటింగ్ సరికొత్త ఆకర్షణగా నిలిచాయి. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాల మేరకు సౌకర్యాలను మెరుగుపర్చారు.

ఇటీవల ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ బీఎన్ పాత్రుడు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ప్రాంగణాన్ని పరిశీలించి క్రీడాకారుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. స్టేడియం పక్కన స్విమ్మింగ్‌పూల్ చక్కగా తీర్చిదిద్దారు. దానిపక్కనే డ్రెస్సింగ్ రూమ్, వెయిటింగ్ హాలు సిద్ధం చేశారు. త్వరలోనే ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

లోటు తీరింది: క్రీడాకారులకు ఎప్పటి నుంచో కలగా మిగిలిన ఇండోర్ స్టేడియం సకల హంగులతో రూపుదిద్దుకోవడం సంతోషం కలిగిస్తోంది. ఇక్కడ స్విమ్మింగ్‌పూల్, వాకింగ్‌ట్రాక్ అందుబాటులోకి వస్తోంది. చిన్నారులకు ఉపయుక్తంగా ఉండేలా స్కేటింగ్ రింక్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

పొగిరి రామకృష్ణ, మెహర్‌నగర్

ఇతర మైదానాలపై దృష్టి: గాజువాకలో పలుచోట్ల క్రీడా మైదానాలు నిర్లక్ష్యంగా పడున్నాయి. ఇప్పుడిప్పుడే వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియం, వినాయకనగర్‌లోని క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయడం మంచి పరిణామం. ఆయా నివాసిత సంఘాలకు నిర్వహణ బాధ్యత అప్పగించాలి. ఎ.కె.బాషా, అజీమాబాద్

## అడగరని దందా.. ఆపే దమ్ముందా!!

ఆనందపురం : భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలంలోని రామవరం గ్రామంలో కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నా అటుగా స్థానిక, మండల రెవెన్యూ అధికారులు దృష్టి సారిస్తున్న పరిస్థితులు కనపడటం లేదు. రామవరం గ్రామం సర్వే నెంబరు 10, 11, 17ల్లో విస్తరించి ఉంది. వీటికి దగ్గరలో సర్వే నెంబరు 44(చీమల మెట్ట)ని గతంలో క్వారీ నిమిత్తం ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది సుమారు 15 ఎకరాల కొండ ప్రాంతం. క్వారీ లీజు పూర్తి కావడంతో అలా విడిచిపెట్టారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు కొంత స్థలంలో పశువుల పాకలు వేశారు.

గత ప్రభుత్వ కాలంలో పశువులు కట్టిన స్థలాల్లో ఒక్కొక్కటిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మరికొందరు పునాదులు వేసి ఆయా స్థలాల్ని అమ్మకాలు చేశారు. అందులో చేపట్టిన నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఎవరూ ప్రశ్నించక పోవడంతో మిగిలిన ఖాళీ స్థలంతో పాటు కొండ భాగంపైన ప్రస్తుతం చోటామోటా నాయకుల కన్ను పడింది. ప్రస్తుతం రాత్రుళ్లు యంత్రాల సాయంతో కొండని తవ్వగా వచ్చిన గ్రావెల్, రాయిని అమ్మేసుకుంటున్నారు.

ఎవరైనా ప్రశ్నిస్తే పక్కనే ఉన్న గ్రావెల్ కొండ బిల్లు చూపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మరో వైపు చదును చేసి స్థలంలో అక్రమంగా పునాదులు వేసి దర్జాగా రూ. లక్షలకు అమ్మేస్తున్నారు. వాటిలో శరవేగంగా జరుగుతున్న నిర్మాణాల గురించి రెవెన్యూ అధికారులు గానీ, పంచాయతీ రాజ్ అధికారులు గానీ ప్రశ్నించడం లేదని పలువురు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులకు తెలిసినా తెలియనట్లున్నారని, గడిచిన సాధారణ ఎన్నికల సమయం నుంచి విచ్చలవిడిగా ఈ దందా సాగుతోందనే విమర్శలు వస్తున్నాయి.

# చేనుకు చేవ.. రైతుకు తోవ

అనకాపల్లి : వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి సాగునీటి ఎద్దడి నివారణకు సేద్యపు కుంటలు ఎంతో ఉపయోగపడతాయి. వీటితో భూగర్భ జలాల వృద్ధితో పాటు రైతుకు అదనపు ఆదాయం వచ్చేలా కూటమి సర్కారు ఫారం పాండ్ ప్లస్ పేరుతో పంటకుంటలను తవ్విస్తోంది. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నేతలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 2025–26లో 17,900 పైగా సేద్యపు కుంటలు తవ్వాలన్నది లక్ష్యం. దీనికోసం రైతులను సన్నద్ధం చేసేందుకు అధికారులు, సిబ్బంది వీటితో కలిగే ప్రయోజనంపై అవగాహన కల్పిస్తున్నారు.



**ఈసారి ప్రత్యేకం..**

గతం కంటే భిన్నంగా రైతులకు బహుళ ప్రయోజనాలు కలిగేలా సేద్యపు కుంటలను నిర్మిస్తున్నారు. వర్షాల సమయంలో కుంటలోకి నీరు వచ్చే మార్గంలో సిల్ట్‌ట్రాప్ ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ఇసుక, మట్టి కుంటలో చేరి పూడిపోయే పరిస్థితి ఉండదు. గట్లపై పండ్లజాతి మొక్కలు, తీగజాతి కూరగాయల మొక్కలు నాటేలా ప్రణాళికలు చేస్తున్నారు. కుంటల్లో చేపలను పెంచడం ద్వారా రైతుకు ఆదాయం సమకూరుతుంది. దీంతోపాటు ఆ నీటిని పంటలకు ఉపయోగించడం ద్వారా సేంద్రియ ఎరువు అందుబాటులోకి రానుంది. ప్రతి పంచాయతీలోనూ 25 పంటకుంటలను నిర్మించేలా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు డ్వామా పీడీ పూర్ణిమాదేవి తెలిపారు.

**నిర్మాణం.. ఉపయోగం ఇలా..**

సేద్యపు కుంటకు అవసరమైన స్థలం : 2.5 సెంట్లు
ఎంత నీరు ఇంకుతుంది : 81 వేల లీటర్లు
విస్తీర్ణం బట్టి అందే వేతన మొత్తం : రూ. 36 వేలు
జీడి, మామిడి దిగుబడి : 30 శాతం పెంపు

# చెత్తకొండలు.. కరిగించేందుకు చర్యలు



నంద్యాల : 125 ఏళ్ల చరిత్ర కలిగిన నంద్యాల పురపాలక సంఘంలోని డంపింగ్‌యార్డులో లక్ష టన్నుల చెత్త పేరుకుపోయింది. 17 ఎకరాల్లో గుట్టల్లా పోగైన ఘన వ్యర్థాల తొలగింపు అధికారులకు సవాల్‌గా మారింది. తరచూ ఈ చెత్తకు నిప్పంటుకుని సమీప కాలనీలను పొగ కమ్మేస్తోంది. దీనివల్ల పట్టణంలో వాయు కాలుష్యం పెరిగిపోయింది. ఈ పరిస్థితుల్లో చెత్త గుట్టల తొలగింపునకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

**ఫలించని గత ప్రయత్నాలు**

నంద్యాల డంపింగ్‌యార్డులో ఉన్న చెత్తను తొలగించడానికి 2010 ఆర్థిక సంవత్సరంలో మున్సిపల్ అధికారులు ఒక ప్రణాళికను రూపొందించారు. చెత్తను కాల్చివేయకుండా, ఇతర ప్రాంతాలకు తరలించకుండా భూమిలో పాతిపెట్టి ఎరువులు తయారు చేసి రైతులకు సరఫరా చేయాలని ప్రతిపాదించారు. 'సైంటిఫిక్ ల్యాండ్ ఫిల్లింగ్' పేరుతో చేసిన ఈ ప్రయోగం ఫలించలేదు. చెత్తను భూమిలో పాతిపెట్టిన కొన్నాళ్లకే కుందూనదికి వరద రావడంతో అంతా కొట్టుకుపోయింది. ఈ ప్రయోగం మున్సిపాల్టీకి ఆర్థిక భారాన్నే మిగిల్చింది.
ఏడేళ్ల కిందట డంపింగ్‌యార్డులోని చెత్తను రిక్లేమేషన్ (బయో మైనింగ్) చేసి ఆరెకరాల భూమిని ఖాళీ చేయాలన్న ప్రయత్నాలు జరిగాయి. శుద్ధి చేసిన వ్యర్థాలను అక్కడే వదిలేశారు.

గత ప్రభుత్వం గొప్పలు

గత వైకాపా ప్రభుత్వంలో మూడేళ్ల కిందట అధికారులు డంపింగ్‌యార్డులోని చెత్తను తొలగించేందుకు రూ.5.25 కోట్లతో సాగర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పట్లో 65 వేల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించి 14 ఎకరాల స్థలం ఖాళీ చేస్తామన్నారు. 30 శాతం తొలగించినట్లు అధికారులు ప్రకటించారు. వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉంది. గుత్తేదారు సంస్థకు నిధులు ఇవ్వకపోవడంతో పాటు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో చెత్త తొలగింపు జరగలేదు.

**6 నెలలు.. లక్ష టన్నులు**

స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతినెలా మూడో శనివారం ఒక మున్సిపాల్టీలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ 19న నంద్యాల పురపాలక సంఘంలో పర్యటించనున్నారు. డంపింగ్‌యార్డును సందర్శించి చెత్త శుద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఏప్రిల్ 19న ఈ ప్రక్రియ ప్రారంభమై అక్టోబరు 2వ తేదీకి పూర్తి చేయనున్నారు. ఆరు నెలల్లో లక్ష టన్నుల చెత్తను తొలగించనున్నారు.

**నాలుగు భాగాలుగా విభజన**

తాజాగా కూటమి ప్రభుత్వం నంద్యాల డంపింగ్‌యార్డులోని చెత్త శుద్ధిపై దృష్టిపెట్టింది. నాలుగు పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ట్రామెల్ యంత్రాన్ని వినియోగించనున్నారు. యార్డులోని చెత్తను ఈ యంత్రంలో వేస్తారు. అది ప్లాస్టిక్, ఇనుము, గాజు వస్తువులు, రాళ్లురప్పలను విభజిస్తుంది. నాలుగు రకాల వ్యర్థాలను నాలుగు వైపులకు వేర్వేరుగా పంపిస్తుంది.
రాళ్లు రప్పలను మున్సిపాల్టీ పరిధిలో గుంతలను పూడ్చేందుకు ఉపయోగిస్తారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంటు పరిశ్రమలకు పంపిస్తారు. గాజు, ఇతర వస్తువులను గుట్టలుగా పేరుస్తారు. వీటిని ఎందుకు ఉపయోగిస్తారన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. చెత్తను ఎరువుగా మార్చి రైతులకు అందజేయనున్నారు. ఈ శుద్ధి ప్రక్రియను చేపట్టేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఇప్పటికే టెండర్లు పిలిచింది.

# బరువు తగ్గిన పుస్తకం



కర్నూలు : గత వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైంది. 'కూటమి' ప్రభుత్వం చక్కదిద్దే పనిలోపడింది. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పుస్తకాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలకు విడతల వారీగా పంపిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు మొదటి విడతలో 3,44,932 పుస్తకాలొచ్చాయి. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాలకు సంబంధించినవి ఉన్నాయి. కర్నూలు నగరంలోని పుస్తక నిల్వ కేంద్రానికి చేరుకున్న పుస్తకాలను ఏప్రిల్ మొదటి వారంలోపు ప్రభుత్వ పాఠశాలలకు చేరవేసేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. నిల్వ కేంద్రంలో చెదలు పట్టకుండా రసాయనాలు చల్లించామని, ఆర్టీసీ బస్సుల ద్వారా పాఠశాలలకు చేరవేస్తామని గోదాము మేనేజర్ భారతి తెలిపారు.

**'బన్ని' ఉత్సవానికి చోటు**

పదో తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో కర్నూలు జిల్లాకు చోటు దక్కింది. హొళగుంద మండలంలో ఏటా నిర్వహించే దేవరగట్టు బన్ని ఉత్సవ ప్రత్యేకతను పుస్తకంలోని 26వ పేజీలో వివరించారు. దసరా సందర్భంగా ఎందుకు నిర్వహిస్తారన్న అంశాన్ని అందులో విశ్లేషించారు. ఆదోనిలో ప్రసిద్ధి గాంచిన గొరవయ్యల నృత్యాన్ని పాఠ్యాంశంగా చేర్చారు.

**ఈసారి ఇలా**

పిల్లలకు పుస్తక భారం లేకుండా వివిధ సబ్జెక్టులను ఒకేదాంట్లో కలిపి ముద్రించారు. గతంలో మూడు సెమ్‌లుగా ముద్రించేవారు.. ప్రస్తుతం రెండు సెమ్‌లకే పరిమితం చేశారు.

1–5 తరగతులకు సంబంధించి తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు..వర్క్‌బుక్ అదనంగా చేర్చారు.

6–9 తరగతులకు సంబంధించి తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు. ఎన్ఎస్, పీఎస్ కలిపి ఒకటి చేశారు. సాంఘిక శాస్త్రం మూడు పుస్తకాలు ఉండగా ఇప్పుడు ఒకటిగా చేశారు. 'పది'లో హిందీ పాఠ్య పుస్తకం మారినట్లు సమాచారం.

కావాల్సిన పుస్తకాలు: 50 లక్షలు
మొదటి విడతలో కేటాయింపు: 8,04,366
జిల్లాకు చేరినవి: 3,44,932

# ఈ మందులు ప్రాణాలు పోయవు.. తీస్తాయ్

విజయనగరం : అవి ఏ కంపెనీవో తెలియదు.. మంచివా అంటే అదీ లేదు. ప్రజలు ఎలా పోయినా.. నాకు నాలుగు రూపాయలు మిగిలితే చాలు అన్న రకంగా ఔషధ దుకాణాల వ్యాపారులు వారి ప్రాణాలతో ఎలా చెలగాటమాడుతున్నారో 'ఆపరేషన్ గరుడ'లో వెలుగు చూసింది. మన్యం జిల్లాల్లో 2,176 మందుల దుకాణాలు ఉన్నాయి. రెండు చోట్ల 15 దుకాణాలపై దాడులు జరిపారు. వైద్యులు రాసిన చీటీ లేకుండా వ్యాపారులు తమకు తెలిసిన పరిజ్ఞానంతో ఏవేవో మందులు అంటగడుతున్నారని, కొందరు మత్తు కలిగించే ఔషధాలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని తేలింది.

**దగ్గు మందు కొన్నదెవరు?**

విజయనగరంలో రత్నం ఫార్మా స్యూటికల్స్‌లో మద్యం తాగినంత కిక్కు వచ్చే దగ్గు మందు విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. ఇటీవల డెహ్రాడూన్ నుంచి 305 సీసాలు తెప్పించి, అమ్మగా దుకాణంలో ఉన్న 45 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన సరకు ఏమైందని అధికారులు ఫార్మాసిస్ట్‌ను ప్రశ్నించగా అధిక సంఖ్యలో ఒకాయన తీసుకెళ్లారని బదులిచ్చారు. ఆ వ్యక్తి తన కోసమా.. ఇతరులకు



విక్రయిస్తున్నారా.. అన్న కోణంలో ఆరా తీస్తున్నారు.
విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు మాట్లాడుతూ 'ఏళ్ల క్రితం నాటి కాలం చెల్లిన మందులపై ముద్రించిన బ్యాచ్ నంబరు, తయారీ తేదీ, ముగిసిన గడువు తేదీ తొలగించి విక్రయిస్తున్న స్ట్రిప్‌లు వెయ్యికి పైగా దొరికాయి. వీటికి రికార్డులు లేవు. చిన్న పిల్లలకు వాడే మందులు కాలం చెల్లినవి ఉండటాన్ని గుర్తించాం. వైద్యుడి సిఫార్సు లేకుండా, కాలం చెల్లిన మందులు అమ్మకాలకు సంబంధించి దుకాణ యజమాని, ఆయన భార్యపై రెండు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులు నిర్ణయించారని' చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఒక హెల్త్‌కేర్ కంపెనీ పేరిట ఇతర రాష్ట్రాల్లో తయారైన మందులు విక్రయిస్తున్నట్లు ఔషధ నియంత్రణ విభాగం అధికారులు గతేడాది గుర్తించి కేసు నమోదు చేశారని ఔషధ నియంత్రణ విభాగం సహాయ సంచాలకురాలు రజిత చెప్పారు.

**పశువుల మందులూ..?**

ఒడిశా నుంచి పశువులకు వినియోగించే కొన్ని రకాల మందులను సరిహద్దులోని పార్వతీపురం మన్యం జిల్లాలో విక్రయిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. మత్తు మందు తరహాలో వాడేందుకు కొన్ని రకాల మాత్రలు, సిరప్‌లను అంటగడుతున్నట్లు తేలింది. కొన్ని ప్రముఖ కంపెనీల పేరిట, ఇతర కంపెనీల్లో తయారైన నకిలీ సరకు అమ్ముతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది.

**అక్రమార్కులపై కఠిన చర్యలు**

వైద్యుడి సిఫార్సు లేకుండా మందులు విక్రయించి సంపాదించాలనుకునే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం. శాంపిల్ డ్రగ్స్ అమ్మినా నేరమే. గతంలో తనిఖీలు చేసినప్పుడు కొందరు దుకాణ యజమానులు కాలం చెల్లిన మాత్రలు వెనక్కి పంపించడానికి సిద్ధం చేశామని చెప్పారు. ఆ తర్వాత వాటిపై తయారీ తేదీ, బ్యాచ్ నంబరు, కాలం చెల్లిన తేదీ తీసివేసి అమ్ముతున్నారు. చాలా దుకాణాల్లో అమ్మకాలు, నిల్వలకు సంబంధించి లెక్కల్లో తేడా కనిపిస్తోంది. వారందరిపై చర్యలు తీసుకుంటాం. రజిత, ఔషధ నియంత్రణ విభాగం సహాయ సంచాలకురాలు

# బొబ్బిలికి వెక్కిళ్లు



బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చుతోంది. ఓ పక్క భోజరాజపురం పంపుహౌస్ పథకం శిథిలావస్థకు చేరింది. మరోపక్క వేగావతి నదిలోని ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో ఊరే నీటి శాతం తగ్గిపోయింది. ఫలితంగా ప్రజలకు అవసరం మేర తాగునీరు అందించలేని దుస్థితి నెలకొంది. ప్రస్తుతం రెండు రోజులకోమారు కుళాయిల నుంచి అందిస్తున్నారు.
వేగావతి నది నుంచి పట్టణంలోని రిజర్వాయర్లకు తాగునీరు అందించే భోజరాజపురం ప్రధాన పైపులైను పూర్తిగా పాడైంది. ఎనిమిది చోట్ల లీకులు ఉండడంతో పంపింగ్ అవుతున్న నీటిలో 10 శాతం వృథాగా పోతోంది. రెండు రోజుల కిందట పాలకవర్గ సభ్యులు పథకాన్ని పరిశీలించి, లోపాలు తెలుసుకున్నారు. వేసవిలోనైనా సరిచేస్తారా, లేదా అలా నెట్టుకొస్తారా? చూడాల్సిందే.

**ఈ ప్రాంతాల్లో ఇక్కట్లు**

పట్టణంలోని ఐటీఐ, ఇందిరమ్మ, బోస్ నగర్, మిలట్రీ కాలనీలు, అప్పయ్యపేట, రాజమహల్, ఎరుకుల పాకలు, ప్రసాద్‌నగర్, చేనేత కాలనీ, పాత బొబ్బిలి, మల్లంపేటలో కుళాయి నీరు పూర్తిస్థాయిలో రావడం లేదు. ప్రస్తుతం పట్టణ అవసరంలో 40 శాతమే సరఫరా అవుతోంది. ఒక్కో వీధికి 20 నుంచి 30 నిమిషాలే వదలడంతో అవస్థలు పడుతున్నారు. బోరింగులు, నేలబావులు కూడా సరిపడా లేవు.

**ఇవీ లోపాలు**

నదిలో ఊట బావుల వద్ద ఇసుక తవ్వకాలు కట్టడి చేయాలి. బావుల్లో మేటలు తొలగించాలి.

ప్రధాన పైపులు, సబ్‌లైన్లలో లీకులు అరికట్టాలి.

భోజరాజపురం హెడ్ వాటర్ వర్క్సు వద్ద నదిలో నాలుగు బావుల్లో ఒకటి పనిచేయడం లేదు. దీన్ని సరి చేయాలి.

గతంలో తవ్విన ఆరు బోర్లలో రెండు పనిచేయడం లేదు. వాటికి మరమ్మతులు చేసి, అదనంగా బోర్లు తీయాలి.

**వృథాను అరికడుతున్నాం**

పైపులైన్ల లీకులను సరిచేసి నీటి వృథాను అరికడుతున్నాం. ఇప్పటికే కొన్ని మరమ్మతులు చేశాం. వేగావతిలో ఇసుక గట్లు వేసి నీటిని సంపుల్లోకి మళ్లించే పనులు ప్రారంభిస్తాం. అవసరమైతే పెద్దగెడ్డ నుంచి వేగావతిలోకి నీటిని విడిచి పెట్టడానికి జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడతాం. ఈశ్వర గుప్తా, ఏఈ, బొబ్బిలి పురపాలక

# అనుసంధానం.. ఇంకెంత దూరం?

జియ్యమ్మవలస: కొండల నడుమ సహజసిద్ధంగా వచ్చే జీవజలాలు ఉపయోగించుకోవడంలో గత ప్రభుత్వం, పాలకులు అలసత్వం ప్రదర్శించారు. జియ్యమ్మవలస మండలంలోని అలమండ పంచాయతీ నిడగల్లుగూడ గిరిజన గ్రామానికి సమీపంలో చిట్టిగెడ్డపై పదిహేనేళ్ల క్రితం సుమారు రూ.30 లక్షలతో నిర్మించిన చెక్‌డ్యామ్‌తో వట్టిగెడ్డలో చిట్టిగెడ్డ అనుసంధాన ప్రక్రియ చేపట్టారు. అప్పట్లో నిధులు ఉన్నంత వరకు పనులు చేసి మిగిలినవి వదిలేశారు. చిట్టిగెడ్డ నుంచి వట్టిగెడ్డ జలాశయం వరకూ తవ్విన కాలువల్లో అక్కడక్కడ బండరాళ్లు ఉండటంతో అప్పట్లో సగం పనులు మాత్రమే చేశారు. చిట్టిగెడ్డ కింద ఉన్న సుమారు 300 ఎకరాల కోసం స్థానికులు చిన్న కాలువలు తవ్వుకోవడంతో వట్టిగెడ్డకు నీరు చేరకుండా వృథాగా పోతోంది.

**17 వేల ఎకరాలకు జీవం**

వేసవిలో నీరు లేక వట్టిగెడ్డ పూర్తిగా ఎండిపోతోంది. ఏటా ఖరీఫ్‌లో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఎగువనున్న మండలాల్లో కురిసిన వానలకు జలాశయం నిండితే 17



వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. జలాశయంలో సరిపడా నీరు లేక నేటికీ చివరి భూములకు చేరడం లేదు. చిట్టిగెడ్డకు ఎగువ నుంచి నిత్యం నీరు ప్రవహిస్తుంటుంది. దీన్ని వట్టిగెడ్డతో అనుసంధానిస్తే ఎగువన గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో వర్షాలు కురవకపోయినా అది నిండుతుంది. నిత్యం రెండు పంటల సాగుకు నీటిని అందించవచ్చని రైతులు అంటున్నారు. అనుసంధాన ప్రక్రియ సకాలంలో పూర్తి కానందున ఏటా వేసవిలో వట్టిగెడ్డ కింది ఆయకట్టు ఎండిపోతోంది. గతంలో ఈ విషయమై పలుమార్లు రైతులు, వామపక్షాలు ధర్నాలు, పాదయాత్రలు నిర్వహించినా ఏళ్లుగా అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. నిధులు మంజూరు చేసి మిగిలిన పనులు చేపట్టి చిట్టిగెడ్డ–వట్టిగెడ్డ అనుసంధానం పూర్తి చేయాలని మండల రైతులు కోరుతున్నారు. **పూర్తిచేస్తే మేలు..:** చిట్టిగెడ్డ నీటిని వట్టిగెడ్డలోకి పంపిస్తే నిత్యం నీరు ఉంటుంది. అనుసంధానం చేపట్టడానికి చర్యలు చేపడితే రైతులకు మేలు జరుగుతుంది.
కొల్లి గంగునాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి, పార్వతీపురం మన్యం
ప్రతిపాదనలు లేవు..: గతంలో కొంత వరకు పనులు చేశాం. ప్రస్తుతం నిధులు లేవు. వట్టిగెడ్డ– చిట్టిగెడ్డ అనుసంధాన ప్రక్రియ పూర్తిస్థాయిలో చేపట్టేందుకు ప్రతిపాదనలు కోరితే పంపిస్తాం.
జీవీ రఘు, వట్టిగెడ్డ జలాశయం ఏఈ, జియ్యమ్మవలస

# మొక్కవోని కక్ష

విజయనగరం : వేసవొస్తే విజయనగరంలో ఉండలేమని ఉత్తరాంధ్ర వాసులు చెబుతుంటారు. పచ్చదనం లేకపోవడం, కాలుష్య తీవ్రత పెరగడం, గతంలో వేసిన మొక్కలు కానరాకపోవడం, నీటి వనరులు తగ్గిపోవడం తదితర కారణాలతో ఈ దుస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం రెండు వారాలుగా ఎండలు భగ్గుమంటున్నాయి. జిల్లా కేంద్రంలో అడుగెట్టలేని పరిస్థితి ఉంది. సేదదీరేందుకు సైతం చాలాచోట్ల చెట్లు కరవయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో నివారణ చర్యలు శూన్యం. ఈ నేపథ్యంలో అధికారులు దృష్టిసారించాల్సిందే.

**పెరిగిన తీవ్రత...**

దేశంలో కాలుష్య తీవ్రత ఎక్కువగా ఉన్న నగరాల్లో విజయనగరం ఒకటి. ఉమ్మడి జిల్లాకు సంబంధించి వీటీఅగ్రహారం, కస్పా ఉన్నత పాఠశాల, నగరపాలిక కార్యాలయం, బొబ్బిలి గ్రోత్ సెంటర్లలో యంత్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వాయు కాలుష్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. పీసీబీ(పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) ప్రకారం పీఎం– 10(పాలిక్యులేట్ మేటర్) రోజుకు 100 ఎంఎఫ్‌సీఎం(మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటర్) దాటకూడదు. ఏడాదిలో సరాసరి 60 కంటే తక్కువగా ఉండాలి. ప్రస్తుతం నగరంలో 72 నుంచి 78 వరకు నమోదవుతోంది.



**ఇకనైనా మారాల్సిందే..**

గతేడాది ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో దాదాపు 30 వేల మొక్కలు వేస్తామని అధికారులు ప్రకటించారు. ఈమేరకు రూ.50 లక్షల వరకు ఖర్చు చేస్తామని ప్రకటించారు. కానీ చర్యల్లేవు. ఈ ఆర్థిక ఏడాదిలో ఇప్పటికే 10 వేల మొక్కలు నాటాలి. ఇప్పటివరకు 2,500 వేసినట్లు చెబుతున్నారు. నగరపాలిక పరిధిలో కొత్తగా ఏర్పాటైన ఉద్యానశాఖ విభాగానికి వచ్చిన అధికారిణి ఉమాభరణి కాలపరిమితి పూర్తవడంతో తిరిగి ఆమె మాతృశాఖకు వెళ్లిపోయారు. ఈక్రమంలో సెంటర్ డివైడర్లు, విస్తరించిన రోడ్లకు ఇరువైపులా, ఖాళీస్థలాలు, పార్కుల్లో చాలావరకు మొక్కలు కానరావడం లేదు. పరిశీలించి, అవసరం మేరకు నాటుతామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. నిర్వహణకు 44 మంది సిబ్బందిని నియమించామన్నారు.

**స్పందించని వైకాపా..**

2021లోనే కేంద్రం హెచ్చరించింది. దీంతో మయూరికూడలి, గంటస్తంభం, కొత్తపేట, కలెక్టరేట్ కూడలి, బాలాజీ కూడలి, పారిశ్రామిక వాడ(వీటీ అగ్రహారం), వైకూడలిని ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. ఆయా చోట్ల పెద్దఎత్తున మొక్కలు నాటాల్సి ఉంది. అప్పట్లో జగనన్న హరిత నగరాలు, మెగా ప్లాంటేషన్ తదితర కార్యక్రమాల కింద రూ.కోటి వరకు వెచ్చించి మొక్కలేశామని అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం వాటిల్లో ఒక్కటీ కానరావడం లేదు.

# టిడ్కో లబ్ధిదారులకు తీపి కబురు

పుట్టపర్తి : పట్టణాల్లో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల హామీ అమలు దిశగా కీలకమైన ముందడుగు వేసింది. పేదలందరికీ ఇళు నిర్మించాలనే సంకల్పంతో 2014-19 మధ్య కాలయంలో నాటి తెదేపా ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి ధర్మవరం, కదిరి, హిందూపురం మున్సిపాలిటీల్లో నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో టిడ్కో సౌజన్యంతో ఇళ్ల నిర్మాణానికి పునాది వేసింది. త్వరలో సొంతిల్లు సాకారం అవుతుందని, ఆశతో లబ్ధిదారులు అప్పులు చేసి కంతులు చెల్లించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి. ఐదేళ్ల పాలనలో ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. ఎక్కడికక్కడ పనులు నిలిచిపోవడంతో పేదల సొంతింటి కల సాకారం కాలేదు. చెల్లించిన డిపాజిట్‌కు ఆరేడేళ్లుగా వడ్డీలు చెల్లిస్తూ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ హామీ మేరకు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో భవనాలను పూర్తి చేసి, జూన్ నాటికి నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు వచ్చే జూన్ నాటికి జిల్లాలోని 4,176 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్ణయించారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అనుకున్న తేదీ నాటికి గృహాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

**త్వరలో పూర్తి చేసేలా చర్యలు చేపడతాం..**

షబానా, టీడ్కో డీఈ జిల్లాలో అర్ధాంతరంగా ఆగిపోయిన టిడ్కో సామూహిక భవనాలు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో 4,176 మందికి జూన్ నాటికి సొంతింటి తాళాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ దిశగా చర్యలు చేపట్టింది.

# సహజ పద్ధతుల్లో సాగే ఉత్తమం

హిందూపురం : దీర్ఘకాలిక రోగాలు దూరం కావాలంటే సహజ పద్ధతుల్లో పండించే పంటలే శరణ్యమని విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి రైతు నీటిని పొదుపుగా వాడుకోవడంలో ప్రకృతి వ్యవసాయ పరిశోధకుడు సుభాష్ పాలేకర్ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేసినపుడు నిబంధనలకు విరుద్ధంగా బోర్ల తవ్వకాన్ని అడ్డుకున్నట్లు గుర్తుచేశారు. శనివారం పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉద్యానవనం, వ్యవసాయ శాఖ, ఆర్డీటీ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మన వ్యవసాయం, పంటలు, వంటకాలు, ఆరోగ్యంపై సదస్సు, చిరుధాన్యాల మేళాను ప్రారంభించారు. ఇజ్రాయెల్ లాంటి దేశాల్లో తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధిస్తున్న విషయాన్ని



జనార్దన్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రకృతి వ్యవసాయ స్వతంత్ర ప్రచారకర్త విజయరావ్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో ప్రతి రైతు ఎకరాకు రూ.3 నుంచి 6 లక్షల వరకు లాభాలు పొందవచ్చన్నారు. పురుగు మందులు, రసాయన ఎరువులు లేకుండా చెన్నంగి, కొలతేర్ రకాల వరి వంగడాలను పండించాలన్నారు. ఎ.ఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి అనుకూల వంటలు తినాలంటే పంటల సాగులో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. సహాయ కలెక్టర్ వినూత్న, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఎన్ఐఆర్డీ డైరెక్టర్ డబ్ల్యూఆర్ రెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి గోపాల్‌రెడ్డి, ఏపీఎంఏఎస్ సీఈఓ సీఎస్ రెడ్డి, 18 ఎన్‌జీఓల ప్రతినిధులు పాల్గొన్నారు ఆకట్టుకున్న స్టాళ్లు: చిరుధాన్యాల మేళాలో భాగంగా వివిధ రకాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కట్టె గానుగ నూనెలు, చిరుధాన్యాలతో తయారు చేసిన తినుబండారాలు, వివిధ ప్రాంతాల్లో ప్రాముఖ్యం ఉన్న విత్తనాల ప్రదర్శన, కూరగాయలు, పండ్లు, తదితర రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

# ఎండిన ఆకులు.. చెదిరిన రూపురేఖలు..!

ఆరిలోవ : ఘన చరిత్ర గల ముడసర్లోవ ఉద్యానవనంలో ఇటీవల అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం స్థానికులను కలవరపరిచింది. అటు పచ్చని సింహగిరులు..ఇటు గలగలపారే సెలయేరు.. ప్రకృతి రమణీయత ఉట్టిపడే ప్రాంతంలో ఈ ఉద్యానవనాన్ని 1902లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. నాటి నుంచి దశాబ్దాలపాటు విశాఖ నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచింది. 1980 దశకంలో పదుల సంఖ్యలో సినిమాలను ఇక్కడ చిత్రీకరించారు. అలాంటి ఉద్యానవనాన్ని గత ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది.వైకాపా ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ పాలకులు ప్రపంచ స్థాయి ఉద్యానవనంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వాస్తవంలో ఒక్క పైసా ఖర్చు చేయలేదు. కొత్తగా ఒక్క మొక్క కూడా నాటించలేదు. ఉన్న మొక్కలకు నీరు పోసి సంరక్షించలేదు. గడ్డి ఎండిపోతున్నా, పిల్లల ఆట పరికరాలు విరిగిపోయినా పట్టించుకోలేదు. రాలిన ఆకులను ఏరోజుకారోజు డంపింగ్‌యార్డుకు తరలించే ఏర్పాట్లు చేయలేదు. ఫలితంగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అక్రమాలకు అడ్డాగా మారి: ఉద్యానవనం నిర్వహణను వాస్తవంగా జీవీఎంసీ ఉద్యాన విభాగం చూడాలి. కాని నాటి పాలకులు నీటిసరఫరా విభాగానికి అప్పగించారు. సందర్శకుల నుంచి రుసుములు వసూలు చేయడానికి టెండరు పిలిచి గుత్తేదారుకి అప్పగించారు. ఎన్నడూలేని విధంగా నాడు ఉద్యానవనంలో టెంట్లు వేసి పార్టీలు నిర్వహించే సంస్కృతిని తెచ్చారు. కార్తికమాసంలో గుత్తేదారు ఒక్కో టెంటుకు సుమారు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అనధికారికంగా వసూలు చేశాడు. టెంట్లు, కుర్చీలు, టేబుళ్లను కూడా ఆయనే సరఫరా చేశాడు. వసూలు చేసిన మొత్తంలో భారీగానే నాటి వైకాపా పాలకులు, అధికారులకు అందేవని ఆరోపణలు వచ్చాయి. ఐదేళ్లు కేవలం జేబులు నింపేసుకోవడంపై దృష్టిపెట్టిన గుత్తేదారు ఉద్యానవనం నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న దృష్ట్యా ముడసర్లోవ ఉద్యానవనాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**అందులో సగం వెచ్చించినా మెరుగయ్యేది..**జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం మేరకు రెండేళ్ల క్రితం ముడసర్లోవ ఉద్యానవనం పక్కన పెద్ద వృక్షాలున్న ప్రాంతంలో హార్స్ రైడింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. దీనికి సుమారు రూ.3కోట్లు వెచ్చించారు. రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో నిర్మిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో మధ్యలో ఆపేశారు. అంటే రూ.1.5కోట్లు ఖర్చు పెట్టినా ముడసర్లోవ ఉద్యానవనానికి వచ్చేదని స్థానికులు చెబుతున్నారు.

# పురం.. లీకేజీల పరం



హిందూపురం : హిందూపురం పట్టణం అంటేనే అనాదిగా నీటి సమస్యకు పర్యాయపదం. దీనికి తోడు ఇక్కడ నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా లేదు. ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ తీసుకొని రూ.194 కోట్లతో గొల్లపల్లి నుంచి ఏర్పాటు చేసిన తాగునీటి పథకమే పట్టణానికి జీవనాడి. ఈ పథకంలో భాగంగా పట్టణ సమీపంలోని కొట్నూరు సంపు వరకు మాత్రమే నీరు సరఫరా అవుతోంది. అక్కడ శుద్ధి చేసి మోతుకపల్లి సంపునకు చేరవేస్తారు. అక్కడి నుంచి పాత పైపులైన్ వ్యవస్థతోనే ప్రజలకు నీటి సరఫరా జరుగుతోంది. గొల్లపల్లి నుంచి సైతం కేవలం 8 మిలియన్ లీటర్ల నీరు మాత్రమే సరఫరా అవుతోంది. ఈ నీరు ప్రజల అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదదు. మరోవైపు పట్టణంలోని పాత పైపులైన్ వ్యవస్థ దెబ్బతింది. రోజుకు 20కి పైగా లీకేజీలు అవుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఓ ఇంజినీర్ బదిలీ.. మరో ఇద్దరు సెలవుల్లో..**

వేసవి తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో పట్టణానికి వచ్చే 8-10 మిలియన్ లీటర్ల నీరు ఒక్క రోజు నిలిచిపోయినా పరిస్థితి దారుణంగా మారనుంది. ఇలాంటి సమయంలో నీటి సరఫరా విభాగంలో అధికారులే లేకుండా పోయారు. పట్టణ నీటి సరఫరాపై అవగాహన ఉన్న ఇంజినీర్ బాలసుబ్రహ్మణ్యంకు కమిషనర్‌తో తలెత్తిన విభేదాల కారణంగా ఇక్కడి నుంచి బదిలీపై టిడ్కోకు పంపారు. ఆయన స్థానంలో ఎవరూ ఇక్కడికి రాకపోవడంతో మహిళా డీఈ వాణికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆమె పని ఒత్తిడి తట్టుకోలేక సెలవుపై వెళ్లారు. ఇదే సమయంలో నీటి సరఫరా విభాగం ఏఈ జనార్దన్ ఆకస్మికంగా సెలవులో వెళ్లిపోయారు. ఇంజినీరింగ్ విభాగంలో డీఈ మోహన్, ఏఈ శంకర్‌లు మాత్రమే మిగిలారు. వారు ఇటీవలే బదిలీపై పట్టణానికి వచ్చారు. దీంతో వారికి పట్టణ నీటి సరఫరాపై అవగాహన లేదు. మరో వైపున అన్నీ పనులు వారే చూడాల్సి రావడంతో విపరీతమైన పని భారంతో అల్లాడిపోతున్నారు.

**సహకరించని సిబ్బంది**

నీటి సరఫరా విభాగం కింది స్థాయి సిబ్బంది, కొత్తగా బాధ్యతలు చూస్తున్న ఇంజినీర్లకు ఏ మాత్రం సహకరించడం లేదు. వీటన్నింటి కారణంగా నీటి సరఫరా విభాగం అస్తవ్యస్తంగా మారింది. పట్టణంపై పూర్తి అవగాహన ఉండి, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే వారిని గుర్తించి, నీటి సరఫరా విభాగం పూర్తి బాధ్యతలు అప్పగిస్తే తప్ప నీటి సరఫరా విభాగంలో మార్పు రాదు.

పది రోజుల్లో పరిష్కరిస్తాం ..శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ నీటి సరఫరా విభాగం అస్తవ్యస్తంగా ఉన్న మాట వాస్తవమే. నీటి సరఫరాలోనూ ఇబ్బందులు ఉన్నాయి. పైపులైన్ లీకేజీలు అధికంగా వస్తున్నాయి. వీటన్నింటినీ సరిదిద్దడానికి చర్యలు చేపట్టాం. పది రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

# కాగితాల్లోనే ట్రామా కేర్



గుత్తి : రవాణాపరంగా గుత్తి ప్రాంతం ఎంతో కీలకమైంది. ఈ ప్రాంతం మీదుగా పలు జాతీయ, రాష్ట్ర రహదారులు ఉండటంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మరోవైపు రైల్వే జంక్షన్ ఉంది. ఈ నేపథ్యంలో ట్రామా కేర్ కేంద్రం ఎంతో అవసరం. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. స్థానికంగా రైల్వేజంక్షన్‌తోపాటు డీజిల్‌షెడ్డు, బాక్సఎన్‌డిపో, టీఎక్స్ఆర్, ఇంజినీరింగ్ విభాగాలు ఉన్నాయి. సుమారు 3వేల మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. హైదరాబాదు-బెంగళూరు, గుత్తి-నెల్లూరు, గుత్తి-అంకోలా జాతీయ రహదారులు... రాష్ట్ర రహదారి గుత్తి-ఆదోని రోడ్డు ఉంది. నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ప్రతిరోజు సుమారు లక్ష వాహనాలు వెళుతుంటాయి. ఈ క్రమంలో రెండు రోజులకోసారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా కొత్తపేట ఫ్లైఓవర్, బాటసుంకులమ్మ ఆలయ సమీపాన, ఊబిచర్ల మలుపుల వద్ద ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాద బాధితులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తెస్తుంటారు. గుత్తి, యాడికి, పెద్దవడుగూరు మండలాలతోపాటు నంద్యాల జిల్లా ప్యాపిలి, పోతుదొడ్డి, కర్నూలు జిల్లాలోని జి.ఎర్రగుడి, జొన్నగిరి, బాటతండా, పగిడిరాయి, పెరవలి, లక్ష్మితండా తదితర ప్రాంతాల నుంచి బాధితులు వస్తుంటారు.

**ప్రాథమిక చికిత్సతో సరి...**కాళ్లుచేతులు విరిగి గాయపడిన వారికి ఇక్కడి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి.. కర్నూలు, అనంతపురంలోని ఆసుపత్రులకు పంపుతున్నారు. గుత్తి ఆసుపత్రిలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటైతే సుమారు 30 పడకలు వస్తాయి. ప్రస్తుతం 52 పడకలు ఉన్నాయి. మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం ఎల్లప్ప, వైద్యాధికారి, గుత్తిట్రామా కేర్ కేంద్రం ఏర్పాటుకు గతంలో ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం.

# కథలో అదే కీలక 'మలుపు'



విశాఖపట్నం : గత వైకాపా ప్రభుత్వంలో భీమిలి-భోగాపురం ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి ప్రతిపాదన తీరు అత్యంత వివాదాస్పదమైంది. ఆ రోడ్డుకు ఆనుకొని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు అప్పటి అధికార పార్టీ నేతలు కొందరు భారీగా ఆస్తులు కొనుగోలు చేశారు. కేవలం వారి స్థలాలకు విలువ పెరిగేలా దాని ఎలైన్‌మెంట్ రూపకల్పన చేశారనేది ప్రధాన ఆరోపణ. ప్రస్తుతం ఆ ప్రక్రియ ఆగినా.. తాజాగా భీమిలి మండలంలో కొత్తగా ప్రతిపాదించిన నేరెళ్లవలస-తాళ్లవలస రహదారి చర్చనీయాంశమవుతోంది. ఈ ప్రతిపాదిత మార్గం కేవలం వైకాపా నేతలకు మేలు చేసేలా ఉందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. అనుసంధాన రహదారుల ముసుగులో కొందరికి ప్రత్యేక లబ్ధి కలిగించేయత్నాలు సాగుతున్నట్లు పలువురు నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు కి.మీ. పరిధిలో..**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చేసరికి రద్దీ నియంత్రణకు విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కొన్ని రహదారులను ప్రతిపాదించింది. అందులో భీమిలి మండలంలో అధికంగా ఉన్నాయి. నేరెళ్లవలస - తాళ్లవలస మధ్య 4 కిలోమీటర్లలో 24 మీటర్ల వెడల్పుతో రహదారికి ప్రతిపాదించారు. ఇది కొత్తవలస, దొరతోట మీదుగా జాతీయ రహదారికి చేరుంది.

విశాఖ నుంచి భీమిలిలోకి వెళ్లే ముందు ప్రతిపాదిత నేరెళ్లవలస-తాళ్లవలస రోడ్డు మలుపు తిరుగుతుంది. అక్కడ కొత్తవలస కొండను ఆనుకొని వెళ్లేలా మార్గాన్ని నిర్ణయించారు. వీఎంఆర్‌డీఏకు ఈ ప్రాంతంలో భూములు ఉన్నాయి. అయితే రోడ్డు భీమిలిలో మలుపు తిరిగే చోట.. గతంలో వైకాపా నేతలు భారీగా ఆస్తులు కొనుగోలు చేశారు. ఆ మార్గానికి సమీపంలో దాదాపు వారికి చెందిన స్థలాలే ఉన్నాయి. కొత్తవలస కొండ దిగువన కూడా చాలా స్థలాలు గతంలో పెద్దల చేతుల్లోకి వెళ్లాయి. వీరికి అనుకూలంగా నిర్ణయాలున్నాయనే ఆరోపణలొస్తున్నాయి.

ప్రత్యామ్నాయంగా: ప్రతిపాదిత మార్గానికి ప్రత్యామ్నాయంగా భీమిలిలోనుంచి వెళ్లే రోడ్డును విస్తరిస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పలువురు చెబుతున్నారు. బీచ్ రోడ్డు మీదుగా కాకుండా లక్ష్మీనరసింహస్వామి ఆలయం మీదుగా ప్రస్తుతమున్న రోడ్డును విస్తరించి భీమిలి పోలీసు స్టేషన్ దాటి తగరపువలస వద్ద జాతీయ రహదారికి అనుసంధానం చేస్తే బాగుంటుందనే సూచనలొస్తున్నాయి. ప్రస్తుతం భీమిలి-తగరపువలస రోడ్డు రద్దీగా మారింది. దీన్ని విస్తరించాల్సిన అవసరం కూడా ఉంది.

# జలం నిలవాలి జనం మురవాలి

కర్నూలు : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా జలభగ్నం చేసింది.. నిర్వహణకు పైసా ఇవ్వలేదు.. కేసీ చెదిరింది.. ఎస్సార్బీసీ ఏడిపిస్తోంది.. అలగనూరు కుప్పకూలింది.. గోరుకల్లు లీకేజీ అవుతోంది.. అవుకు అధోగతి పాలైంది.. పెండింగ్ ప్రాజెక్టుల దస్త్రాన్ని అటకెక్కించారు.. తుంగభద్ర, హంద్రీ, కృష్ణమ్మ నదులు పారుతున్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల ఎకరాలు బీళ్లుగా మారాయి.. ప్ర'జల'కు ప్రాధాన్యం ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జలాశయాల నిర్వహణకు నిధులు విడుదల చేసింది.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టబోతున్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలవనరుల బాగుకు రూ.1,568 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు.

**వీటికి మోక్షం కలిగేనా**

పశ్చిమ ప్రాంతంలో ఆర్డీఎస్, వేదవతి జలాశయాల నిర్మాణానికి గతంలో తెదేపా పునాది వేసింది. 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూ.1,942 కోట్లతో వేదవతి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటివరకు రూ.90 కోట్లు ఖర్చు చేశారు. దీన్ని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది.

కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలకు నీరందించేలా రూ.1,985 కోట్ల వ్యయంతో ఆర్డీఎస్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రూ.12.60 కోట్ల వరకు వెచ్చించారు. అందుబాటులోకొస్తే 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సుంకేసుల (రూ.27 కోట్లు)

కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల పరిధిలో 2.65 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే సుంకేసుల జలాశయానికి రూ.27 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కాల్వ అధ్వానంగా మారడంతో 1,500 క్యూసెక్కులు ప్రవహించని పరిస్థితి నెలకొంది.సుంకేసుల, అలగనూరు, ముచ్చుమర్రి జలాశయాలకు కలిపి తొలుత రూ.107 కోట్లకు ప్రతిపాదించారు.. ఆ తర్వాత రూ.27 కోట్లకు కుదించారు.

ఎస్సార్బీసీ (రూ.89 కోట్లు)

శ్రీశైలం కుడిగట్టు కాల్వకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుంటారు. జలాశయం పనులు పూర్తికాకపోవడంతో 12 టీఎంసీలు నిల్వ చేయని పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లు నిర్వహణ చేపట్టకపోవడంతో కట్ట కుంగింది. ఈ నేపథ్యంలో రూ.89 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు.

అవుకు (రూ.40కోట్లు)

గత ఐదేళ్లుగా అవుకు జలాశయం నిర్వహణ పనులు చేపట్టలేదు. గేట్ల వద్ద నీటి లీకేజీ కొనసాగుతోంది. గత ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.. రెండో విడత పనులకు సంబంధించి రూ.24 కోట్లు గుత్తేదారుకు చెల్లించాల్సి ఉంది.

వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని అవుకు సొరంగం, జలాశయం నిర్వహణకు రూ.40 కోట్ల వరకు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

హంద్రీనీవా (రూ.700కోట్లు)

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వను విస్తరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మల్యాల నుంచి జీడిపల్లి (0-216 కి.మీ.) వరకు కాల్వ వెడల్పు, లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.700 కోట్లు అవసరమని ఇంజినీర్లు ప్రతిపాదించారు.

ప్రస్తుతం కాల్వలో 1,900 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. విస్తరించి 3,850 క్యూసెక్కులు తరలించనున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గురు రాఘవేంద్ర (రూ.57కోట్లు)తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టు స్థిరీకరించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా కనీసం విద్యుత్తు బిల్లులు చెల్లించలేదు.. నిర్వహణలేక మోటార్లు సతాయిస్తున్నాయి. వీటిని బాగు చేసేందుకు రూ.57 కోట్లు అవసరమవుతాయి.

శ్రీశైలం (రూ.18కోట్లు)కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.18 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులతో కొంతవరకు పనులు చేసేందుకు అవకాశముంటుంది, డ్రిప్ ద్వారా నిధులు విడుదలైతే తప్ప పూర్తిస్థాయిలో పనులు చేసేందుకు అవకాశముండదని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్ రూ: 313 కోట్లు

కేసీ, రాజోలి, జొలదరాశి (235)


గాజులదిన్నె (35)

చెరువుల నిర్వహణ (46)

సిద్ధాపురం ఎత్తిపోతల (8)

# ఉపాధి మేడలు

కర్నూలు : ఐదేళ్ల వైకాపా కాలంలో భవన నిర్మాణ రంగం కుదేలైంది. 'కొత్త ఇసుక విధానం' పేరిట రీచ్‌లను మూసేశారు. ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. భవనాలు, ఇళ్ల పనులన్నీ ఆగిపోవడంతో కార్మికులకు నెలల తరబడి ఉపాధి కరవైంది. ఇతర రాష్ట్రాలకు వలస పోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అర్ధాకలితో అలమటించేలా చేసింది. కొందరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కార్మికులకు చేతినిండా పని దొరుకుతోంది. పనుల స్థాయిని బట్టి రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు కూలి లభిస్తోంది. ఏడాదిలో అక్టోబరు నుంచి మే వరకు నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఉంటుంది. 'కూటమి' ప్రభుత్వం పల్లె పండగ పేరుతో సిమెంటు దారులు నిర్మిస్తోంది.



ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1,000, రూ.1,500, రూ.2 వేలకు అందుబాటులో ఉంది. కారుచౌకగా ఇసుక లభిస్తుండటంతో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు.“ నగరంలో మూడు సెంట్లలో ఇంటి నిర్మాణానికి దసరా రోజున శంకుస్థాపన చేశాం.. రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు” బ్యాంకు ఉద్యోగి నవీన్ పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాల్లో ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లు వెచ్చించి ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నట్లు అంచనా. ఒక్క కర్నూలు నగరంలోనే గత నెలలో వంద ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు.

**దండిగా ఇసుక నిల్వలు** గతంలో టన్ను రూ.326 ఉండగా.. దాన్ని కూటమి ప్రభుత్వం రూ.320కు తగ్గించింది. ప్రస్తుతం సి.బెళగల్ మండలంలోని డీసిల్టింగ్ పాయింట్లలో టన్ను రూ.202, మరలి ఇసుక రీచ్‌లో రూ.119, గుడికంబాలి రూ.39, నదిచాగిలో రూ.40 నామమాత్రపు ధరకు ఇసుక లభిస్తోంది.ఉమ్మడి జిల్లాలో కార్మికుల సంఖ్య 1,45,350

## బాలీవుడ్ సంచలన క్రైమ్ థ్రిల్లర్ లో కిసిక్ బ్యూటీ!

తెలుగమ్మాయి శ్రీలీల బాలీవుడ్ ప్రయాణం మొదలైన సంగతి తెలిసిందే. ఆషీకీ 3తో అమ్మడు హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెడుతుంది. కిసిక్ బ్యూటీగా పాన్ ఇండియాలో సంచలనమైన తర్వాత వచ్చిన అవకాశం ఇది. దీంతో ఈ బ్యూటీఫుల్ లవ్ స్టోరీలో అమ్మడు ఎలా అలరిస్తుంది? అన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం సెట్స్ లో ఉండగానే అమ్మడు మరో బాలీవుడ్ ఛాన్స్ అందుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇది సంచలన వెబ్ సిరీస్ కావడం విశేషం. షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో రాజ్ అండ్ డీకే తెరకెక్కించిన %-%ఫర్జీ%-% ఎంత వెబ్ సిరీస్ ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. ఇందులో దొంగనోట్లు ముద్రించే వ్యక్తి పాత్రలో షాహిద్ నటన..ఆహార్యం ఎంతగానో అలరించింది. దీంతో ఇటీవలే ఈ సిరీస్



కు సీక్వెల్ గా పర్జీ 2ని కూడా ప్రకటించారు. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. డిసెంబర్ లో షూటింగ్ ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారు. దీనిలో భాగంగా షాహిద్ కి జోడీగా శ్రీలీలను పరిశీలిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. బాలీవుడ్ లో కొంత మంది యంగ్ భామలను ఇప్పటికే స్క్రీనింగ్ చేసినప్పటికీ వాళ్లకన్నా శ్రీలీల పర్ఫెక్ట్ గా ఆ రోల్ కి సూటవుతుందట. దీంతో ఆ పాత్రకు శ్రీలీల దాదాపు ఎంపిక ఖరారైనట్లేనని అంటున్నారు. మరి ఈ విషయాన్ని మేకర్స్ ధృవీకరించాలి. ఇప్పటి వరకూ రాజ్ అండ్ డీకే సౌత్ నుంచి సమంతకు పెద్ద పీట వేసారు. ఫ్యామిలీ మ్యాన్ 2 వెబ్ సిరీస్ లో అవకాశం ఇచ్చారు. అటుపై సీటాడెల్ లోనూ సమంతనే తీసుకున్నారు.

కానీ ప్యామిలీ మ్యాన్ 3 లో ఛాన్స్ ఇవ్వలేదు. ప్రకటించిన సీటాడెల్ 2ని రద్దు చేసారు. కొత్తగా ఇప్పుడు రాజ్ అండ్ డీకే తమ వరల్డ్ లోకి శ్రీలీలను ఆహ్వానించడం ఇంట్రెస్టింగ్ గా మారింది. శ్రీలీల అక్కడా ప్రూవ్ చేసుకోగల్గితే రాజ్ అండ్ డీకే తో చాలా కాలం పాటు పనిచేసే అవకాశం ఉంటుంది. ఇంతవరకూ శ్రీలీల వెబ్ సిరీస్ ల్లోకి ఎంటర్ అవ్వని సంగతి తెలిసిందే.

## 'సౌత్ లో బొడ్డు జూమ్ చేసి మరీ..' రాజాసాబ్ బ్యూటీ షాకింగ్ కామెంట్స్

మాలీవుడ్ బ్యూటీ మాళవిక మోహనన్ గురించి అందరికీ తెలిసిందే. మాస్టర్ మూవీతో టాలీవుడ్ కు పరిచయమైన అమ్మడు.. ఆ తర్వాత వివిధ సినిమాల్లో యాక్ట్ చేసి తన నటనతో మెప్పించింది. ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కు జోడీగా రాజాసాబ్ లో యాక్ట్ చేస్తున్న మాళవిక.. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో షాకింగ్ కామెంట్స్ చేసింది. హాటర్ ప్లై ఇంటర్వ్యూలో అమ్మడు పాల్గొనగా, దక్షిణాది సినిమాల్లో నాభి వ్యామోహం ఎక్కువగా ఉంటుందనేది నిజమేనా అని హోస్ట్ అడిగారు. దీంతో అది నిజమే, సౌత్ సినిమాల్లో బొడ్డు చూపించడానికి ఎక్కువ ఇష్టపడతారని మాళవిక వ్యాఖ్యానించింది. "దక్షిణాది చిత్రాల్లో నాభి, నడుము అందాలపైనే ఎక్కువ ఫోకస్ పెడతారు. హీరోయిన్స్ విషయంలో.. నడుము, ఒంపులు ఎక్కువగా ఉన్న వారినే ఇష్టపడతారు.



నేను ముంబైలో పెరిగా. కాబట్టి అలా చూసి షాకయ్యా. అది నాకు చాలా కొత్త విషయం. నాభిపై అంత మక్కువ ఏంటో మరి" అంటూ మాళవిక మోహనన్ చెప్పుకొచ్చింది. సోషల్ మీడియాలో హీరోయిన్స్ పిక్స్ చూసినప్పుడు.. ఫుల్ గా జూమ్ చేస్తారని, అప్పుడు వాళ్ల బాడీ పార్టులు చూస్తారని మాళవిక తెలిపింది. అదే సమయంలో కెరీర్ స్టార్టింగ్ లో సన్నగా ఉండడం ట్రోల్స్ వచ్చాయని గుర్తు చేసుకుంది.

21 ఏళ్ల వయసులో డెబ్యూ ఇచ్చిన తనను చూసి చాలా ట్రోల్ చేశారని తెలిపింది. "20 ఏళ్లప్పుడు బాగా సన్నబడ్డా. అప్పుడు చూసి అంతా ట్రోల్స్ చేస్తే ఎంతో బాధపడ్డా. ఆ సమయంలో చాలా కష్టంగా అనిపించేది. ఎముకల గూడు, ఎమ్ముకల మీద చర్మం అని కామెంట్ చేసేవారు. వీటి కన్నా ఇంకా చాలా అవమానకర మాటలు పడ్డాను. ఎన్నో సార్లు నన్ను చాలా మంది అవమానించారు" అని చెప్పింది. అయితే యంగ్ ఏజ్ లో ఉన్నప్పుడు ఒకరు తమ బాడీపై అవమానకరంగా కామెంట్స్ చేయడం అస్సలు మంచి విషయం కాదని తెలిపింది. చెప్పాలంటే.. అది కూడా ఒక బెదిరింపు లాంటిదేనని చెప్పిన మాళవిక.. తాను చాలా ఇబ్బంది పడ్డానని, బాధపడ్డానని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం మాళవిక కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్ గా మారాయి.




## మే 1న బాక్సాఫీస్ వద్ద భారీ పోటీ




బాక్సాఫీస్ వద్ద ప్రతీ వారం మినిమం రెండు మూడు సినిమాలు రిలీజ్ అవడం కామన్. కానీ ఒకే రోజు బజ్ బాగా ఉన్న సినిమాలు మాత్రం ఎక్కువ రిలీజ్ కావు. మహా అయితే రెండు మోస్ట్ అవెయిటెడ్ సినిమాలు ఒకేరోజు రిలీజవుతాయి. సంక్రాంతికి లేదా సమ్మర్ లో మాత్రమే బజ్, హైప్ తో సంబంధం లేకుండా ఒకేరోజు ఎక్కువ సినిమాలను రిలీజ్ చేయడానికి మేకర్స్ ఇంట్రెస్ట్ చూపిస్తారు. ఇప్పుడు మే 1న కూడా బాక్సాఫీస్ వద్ద అలాంటి పోటీనే ఉ ండబోతుంది. సమ్మర్ సీజన్ ను వాడుకునేందుకు ఒకే రోజు ఐదు భాషల నుంచి సినిమాలు పోటీ పడనున్నాయి. దీంతో ఈ సమ్మర్ ఫైట్ ఏయే సినిమాల మధ్య ఉందా? వాటిలో ఏ సినిమాలకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తుందా అని తెలుసుకోవడానికి అందరూ ఆసక్తిగా ఉన్నారు. అయితే ముందుగా మే 1న రిలీజ్ కానున్న సినిమాలేంటో చూద్దాం. వాటిలో మొదటిగా తెలుగు నుంచి నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న హిట్3 సినిమా రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. హిట్ ఫ్రాంచైజ్ లో భాగంగా వస్తోన్న ఈ సినిమాకు శైలేష్ కొలను దర్శకత్వం వహించాడు. ఈ మూవీపై అందరికీ మంచి అంచనాలున్నాయి. ఇక బాలీవుడ్ నుంచి అజయ్ దేవగన్ హీరోగా నటించిన రైడ్2 కూడా అదే రోజున రిలీజ్ కానుంది. రైడ్ 2 సినిమా ఇప్పటికే మంచి బజ్ ను క్రియేట్ చేసుకుంది. మౌనీ రాయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ది భూత్నీ సినిమా మే 1వ తేదీనే థియేటర్లలో రిలీజవుతుంది. ఇక కోలీవుడ్ నుంచి తమిళ స్టార్ హీరో సూర్య నటించిన రెట్రో సినిమా రిలీజవుతుంది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్ గా నటించింది. ఈ మూవీపై ఆల్రెడీ కోలీవుడ్ లో మంచి బజ్ నెలకొంది. కోలీవుడ్ నుంచి టూరిస్ట్ ఫ్యామిలీ అనే మరో సినిమా కూడా మే 1న రిలీజ్ కానుంది. ఇక మలయాళం నుంచి అభ్యంతరకుట్టావలి అనే సినిమా మే 1న రిలీజవుతోంది. ఈ మూవీలో ఆసిఫ్ అలీ నటిస్తున్నారు. వీటితో పాటూ మార్వెల్ స్టూడియోస్ నుంచి సూపర్ హీరో మూవీగా థండర్‌బోల్ట్స్ కూడా అదే రోజున ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అయింది. అంటే మే 1 న 5 భాషల నుంచి సినిమాలు బాక్సాఫీస్ వద్ద పోటీ పడనున్నాయన్నమాట. మరి వీటిలో ఏ సినిమా విజేతగా నిలుస్తుందో చూడాలి.

## కార్తీక్ సుబ్బరాజ్ 'రెట్రో'.. ఈసారి ఏం జరుగుతుందో?




కోలీవుడ్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ప్రముఖ హీరో సూర్య లీడ్ రోల్ లో నటిస్తున్న మూవీ రెట్రో. పూజా హెగ్డే హీరోయిన్ గా నటించిన ఆ సినిమా... ఇప్పుడు రిలీజ్ కు సిద్ధమవుతోంది. మే 1వ తేదీన వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానున్న రెట్రో సినిమా ట్రైలర్ ను రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. రెట్రో.. లవ్, యాక్షన్, వయోలెన్స్ మూవీగా ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. అదే సమయంలో రెట్రో లుక్ లో సూర్య అదరగొట్టినట్లు అర్థమవుతోంది. పూజా నేచురల్ గా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా కార్తీక్ సుబ్బరాజ్ స్టైల్ లో రెట్రో ట్రైలర్ కూడా చాలా ఫాస్ట్ గా.. ఫుల్ యాక్షన్ తో సాగిందనే చెప్పాలి. ట్రైలర్ లో గ్రిట్టీ విజువల్స్, లేయర్డ్ స్టోరీ టెల్లింగ్.. ఇవన్నీ కార్తీక్ సుబ్బరాజ్ సిగ్నేచర్ స్టైల్. అయితే ట్రైలర్ రిలీజ్ అయ్యాక.. సోషల్ మీడియాలో తెలుగు ఆడియన్స్ నుంచి మిక్స్ డ్ రెస్పాన్స్ వస్తోంది. ట్రైలర్ కాస్త కన్ఫ్యూజన్ గా ఉందని చెబుతున్నారు. సినిమా స్టోరీలైన్ తోపాటు ఎమోషన్స్ అర్థం కాలేదని అంటున్నారు. అయితే కార్తీక్ సుబ్బరాజ్ స్టోరీ టెల్లింగ్.. తెలుగు ప్రేక్షకుల్లో చాలా మందికి పెద్ద ఎక్కదు. ఇది ఇప్పటికే పలుమార్లు ప్రూవ్ అయింది. పెట్టా, మహాన్, జిగర్తాండ డబుల్ ఎక్స్ వంటి సుబ్బరాజ్ గత సినిమాల విషయంలో అదే జరిగింది. అలా అని నచ్చినవారు లేరని కాదు.. కొందరు స్పెషల్ ఆడియన్స్.. ఆయన సినిమాలకు ఎట్రాక్ట్ అయిపోతారు. అదే సమయంలో కోలీవుడ్ లో కూడా కార్తీక్ సుబ్బరాజ్ సినిమాలు.. కమర్షియల్ గా కన్నా కల్ట్ హిట్స్ గానే ఎక్కువగా నిలుస్తాయి. కొన్ని అరుదుగా బ్లాక్ బస్టర్ హిట్ స్టేటస్ పొందుతాయి. దీంతో ఇప్పుడు రెట్రో విషయంలో ఏం జరుగుతుందనే హాట్ టాపిక్ గా మారింది. ట్రైలర్ రిలీజ్ అయ్యాక కల్ట్ హిట్ అవుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. స్టోరీ లైన్ క్లియర్ గా తెలియడం లేదని చెబుతున్నారు. మరికొందరు.. ట్రైలర్ కన్నా మూవీ వచ్చాక అసలు విషయం తెలుస్తుందని అంటున్నారు. ఇప్పటి నుంచి ఊహాగానాలు కరెక్ట్ కాదని కామెంట్లు పెడుతున్నారు. మొత్తానికి రెట్రో మూవీ కోసం సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. మరి చివరకు రెట్రో మూవీ ఎలా ఉంటుందో.. కార్తీక్ తెలుగు ఆడియన్స్ ను మెప్పిస్తారో లేదో చూడాలి.

## పొట్టి ఫ్రాకులో దిశా పటానీ కిల్లింగ్

సీకే బ్యూటీ దిశా పటానీ బోల్డ్ ఫోటోషూట్లు, బికినీ విన్యాసాల గురించి చెప్పాల్సిన పని లేదు. నటిగా కెరీర్ లో ఆశించిన విజయాలేవీ లేకపోయినా, గూగుల్ లో ట్రెండింగ్ బ్యూటీగా నిరంతరం యువతరం హృదయాల్లో గిలిగింతలు పెడుతూనే ఉంది. పాపులర్ లోదుస్తుల బ్రాండ్ కెల్విన్ క్లెయిన్ బ్రాండ్ అంబాసిడర్ గా దిశా పేరు మార్మోగింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో దిశా పటానీ ఫాలోయింగ్ అమాంతం పెరగడానికి సీకే లోదుస్తుల ప్రచారం ఒక ఎత్తుగడ. స్విమ్ సూట్లు, బికినీలు, యోగా భంగిమలు.. వరుస ఫోటోషూట్లతో సోషల్ మీడియాల్లో దిశా కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటిస్తోంది.



తాజాగా ఈ బ్యూటీ పొట్టి ఫ్రాకులో థై సొగసులను ప్రదర్శిస్తున్న ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. దిశా సిల్వర్ కలర్ మిరుమిట్లు గొలిపే ఫ్రాక్ లో అందాలను ఆరబోసింది.

బాడీ హగ్గింగ్ క్రిస్టలైన్ ఫ్రాక్ మెరుపులు మిరుమిట్లతో కళు చెదిరే ట్రీటిస్తోంది. ఎప్పటిలాగే దిశా లేటెస్ట్ ఫోటోషూట్ ని యూత్ వైరల్ గా షేర్ చేస్తోంది. దిశా ఈ కొత్త లుక్ లో కిల్లింగ్ అంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే... దిశా పటానీ ఇటీవలే కల్కి 2898 ఏడి లో నటించింది. అటు తమిళంలో సూర్య కంగువలోను దిశా నటించిన సంగతి తెలిసిందే. తదుపరి బిగ్ సినిమా గురించి ఇంకా ప్రకటించాల్సి ఉంది.

## ట్రెండీ లుక్‌తో అనసూయ అరాచకం!

మొదట టెలివిజన్ రంగంలో గుర్తింపు అందుకుని ఆ తరువాత బిగ్ స్క్రీన్‌పై తనదైన ముద్ర వేసుకున్న నటి అనసూయ భరద్వాజ్. ఆమె టాలెంట్ అందం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. యాంకర్‌గా ఉన్నప్పుడు హ్యూమర్‌తో ఆకట్టుకుంది. తర్వాత 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప' లాంటి సినిమాలతో నటిగా ట్రాన్సిషన్ అద్భుతంగా చేసుకుంది. ముఖ్యంగా పుష్పలో 'దాక్షయణి' పాత్ర ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఇక లేటెస్ట్ గా అనసూయ చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బ్లాక్ టాప్, స్కై బ్లూ స్కర్ట్‌లో ఓ మోడ్రన్ లుక్‌తో మెరిసిపోతున్న అనసూయ స్టైలిష్ గా దర్శనమిచ్చింది. జస్ట్ క్లాసిక్ లుక్ అని చెప్పుకోవచ్చు. మెటాలిక్ ఫాబ్రిక్ టచ్, జిప్ డిజైన్ విత్ స్లీవ్‌లెస్ స్టైల్‌తో ఈ డ్రెస్సింగ్



మోడర్న్ యూత్‌కు తెగ నచ్చేసినట్లు లైక్స్ చూస్తేనే అర్థమవుతుంది. ఫోటోల్లో ఆమె ఎక్స్‌ప్రెషన్స్ మూడ్స్‌ను బాగా క్యాచ్ చేస్తూ కనిపించాయి. ఒక్కో పోజ్‌కి వేరే వేరే మూడ్‌ను చూపించగలిగిన అనసూయ ప్రొఫెషనల్ యాక్ట్రెస్‌గా ఎంత అభివృద్ధి చెందినదో స్పష్టంగా తెలుస్తోంది. ఆమె కళ్లలో కనిపిస్తున్న కాన్ఫిడెన్స్, కెమెరా ఫ్రెండ్లీ నేచర్ అన్నీ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తున్నాయి. ఈ ఫోటోలకు భారీ లైక్స్ వస్తుండగా, అభిమానులు కామెంట్స్‌లో "కిల్లర్ లుక్", "ఎటిట్యూడ్ క్వీన్", "బోల్డ్ అండ్ బ్యూటిఫుల్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌కి ఫ్యాషన్ ట్రెండ్ చెప్పేలా అనసూయ ఈ ఫోటోషూట్‌లో నలుగురికీ ప్రేరణగా నిలుస్తోంది. ప్రస్తుతం స్టార్ మా ఛానెల్‌లో ప్రసారమవుతోన్న 'కిరాక్ బాయ్స్ అండ్ ఖిలాడీ గర్ల్స్ 2' షోకి అనసూయ యాంకర్‌గా వ్యవహరిస్తోంది. ఈ షోలో ఆమె హోస్టింగ్ స్టైల్‌తో పాటు ఈ విధమైన ఫోటోషూట్స్‌తో మరింత ఫాలోయింగ్ పెంచుకుంటోంది.

కెరీర్‌లోనే కాకుండా స్టైల్ లోనూ అనసూయ ఎప్పటికీ ట్రెండింగ్‌లోనే ఉంటుంది అనడానికి ఈ ఫోటోలు నిదర్శనం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536